నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

బుధవారం | 9 జనవరి 2019 | హైదరాబాద్

సంపుటి 12 | సంచిక 71

| పేజీలు 12+16+16 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, శుక్ల పక్ష తిథి : తదియ ఉ.11.53 నక్షత్రం. ధనిష్ఠ రా.12.53 వర్జ్యం లేదు
రాహుకాలం: మ.12.00 నుంచి 1.30 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.36 నుంచి 12.24 వరకు సూర్యోదయం : ఉ.6.36 గం; సూర్యాస్తమయం: సా.5.43

అగ్రవర్ణాల్లో పేదల రిజర్వేషన్లకు

లోక్‌సభ ఆమోదం



124వ రాజ్యాంగ సవరణ

నేడు రాజ్యసభకు బిల్లు

- ఈబీసీ బిల్లుపై లోక్‌సభలో సుదీర్ఘ చర్చ
- రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 15కి క్లాజ్(6), 16కి క్లాజ్(6)చేరిక
- డివిజన్ ఓటింగ్ తప్పనిసరన్న స్పీకర్ సుమిత్రా మహాజన్
- రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా 323 మంది మద్దతు
- వ్యతిరేకంగా ఓటు వేసిన ముగ్గురు సభ్యులు
- మూడింట రెండొంతులకు పైగా మెజార్టీతో బిల్లు ఆమోదం
- బిల్లు ఆమోదం తర్వాత లోక్‌సభ నిరవధిక వాయిదా
- నేడు రాజ్యసభ ముందుకు ఈబీసీ రిజర్వేషన్ బిల్లు



6లో

ఫైల్‌ఫోటో



ఫలించిన దౌత్యం

- 'సీతారామ' ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి
- గత నెల 25న ప్రధాని మోడీని కలిసిన వేళ విజ్ఞప్తి చేసిన కేసీఆర్
- ఆ వెంటనే శరవేగంగా కదిలిన ఫైల్
- ఖమ్మం చీఫ్ ఇంజనీరుకు అందిన లేఖ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం

సీతారామ ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతిని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ మంజూరు చేసింది. ఈ మేరకు మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. యస్. కర్కెట్ట నుండి ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ వి. సుధాకర్ కు లేఖ అందింది. గత సంవత్సరం నవంబర్ 27 న జరిగిన ఈఏసిసమావేశం లో సీత రామ ప్రాజెక్టుకు తుది పర్యావరన అనుమతిని మంజూరు చేయమని సిఫారసు చేసిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః వారి సిఫారసు మేర కు పర్యావరణ మంత్రిత్వ శాఖ తుది అనుమతిని జారీ చేసింది. దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నుండి గోదావరి నీటి ని తరలించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబా బాద్ జిల్లాల్లో 1,33,085 హెక్టార్ల కొత్త ఆయకట్టుకు మరియు 1,39,836 హెక్టార్ల స్థిరీకరణకు సీతా రామ ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. మొత్తం 2,72,921 హెక్టార్ల భూమికి సాగు నీరు అందుతుంది. పై మూడు జిల్లాల్లో దాదాపు 180 గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు కు నీరు అంధించడం తో పాటు దారి పొడుగునా చిన్న నీటి చెరువులను నింపడం, పూర్తి అయిన ప్రాజెక్టులకు నీటి సరఫరా చేయడం జరుగుతుంది. ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతి పొందడానికి గత సంవత్సరం ఆగస్టు నెలలో మూడు జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరిగింది. ప్రాజెక్టులో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఒక హెడ్ రెగ్యులేటర్ ని, 372 కిలోమీటర్ల కాలువ తవ్వకం, 4 పంప్ హౌస్ ల నిర్మాణం,

మిగతా 6లో

బంద్ పాక్షికం



5లో

పదవుల పందేరం



- పదవుల పంపకాలకు సీఎం కేసీఆర్ శ్రీకారం
- రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి
- 17 ఉదయం కేబినెట్ విస్తరణ
- పలువురు పాత మంత్రులకు ఛాన్స్
- జాబితాలో హరీశ్ రావు, కేటీఆర్, తలసాని, పోచారం
- ఇప్పటికే స్టీఫెన్‌సన్‌కు శాసన సభ్యుడిగా మరో చాన్స్ ఇచ్చిన కేసీఆర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ నామినేటెడ్ పదవుల నియామకానికి శ్రీకారం చుట్టారు. పార్టీ కోసం పనిచేసిన వారికి పార్టీలో, ప్రభుత్వంలో కీలక పదవుల్లో నియమిస్తానని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీఎంతో పాటు పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా మొట్టమొదటిగా ఆంగ్లో ఇండియన్ శాసన సభ్యుడిగా మరోసారి స్టీఫెన్‌కు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి తన రెండో నియామకం సిద్ధిపేట నుంచి ప్రారంభించారు. సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమించేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సంతకం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 17న కేబినెట్ విస్తరణ : ఈనెల 17న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఉదయం కేబినెట్ విస్తరణ కార్యక్రమం ఉంటుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నందున కేబినెట్ తప్పకుండా విస్తరించడం జరుగుతుందని, ఇందుకు సీఎం గత మూడు రోజులుగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మంత్రిపదవులు ఆశించే వారు అధికంగా ఉండటంతో ముందుగా అయిదారుగురితో మంత్రులుగా ప్రమాణం చేయిస్తారన్న సమాచారం. ఇందులో ముఖ్యంగా ఓ మహిళ, ఎస్సీ,బీసీ, ఎస్టీలతో పాటు హరీశ్వర్‌రావు, కేటీఆర్‌కు స్థానం లభిస్తుందని టీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.









సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

పౌరసత్వ సవరణ బిల్లుకు ఆమోదం


- పౌరసత్వ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన రాజ్‌నాథ్
- ఈ బిల్లుపై టీఎంసీ తీవ్ర ఆందోళన
- సభ నుంచి వాకౌట్ చేసిన కాంగ్రెస్
- ఈశాన్య రాష్ట్రాల్లో ఈ బిల్లుపై తీవ్ర వ్యతిరేకత



6లో

మరో ఘట్టం

నేటితో జగన్ పాదయాత్ర పూర్తి



- చరిత్రలో మరో ఘట్టానికి వేదిక కానున్న ఇచ్ఛాపురం
- 341 రోజులుగా జగన్ పాదయాత్ర
- నేడే మహాస్థూపం ఆవిష్కరణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన వైకాపా శ్రేణులు
- సాయంత్రం భారీ బహిరంగ సభ
- జనసమీకరణలో ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు
- ఆ వెంటనే విశాఖకు చేరుకోనున్న వైఎస్ఆర్‌సీపీ అధినేత
- అక్కడి నుంచి విమానంలో తిరుపతికి ప్రయాణం
- కాలినడకన ఏడుకొండలూ ఎక్కనున్న జగన్
- వెంకటేశ్వరుని దర్శనానంతరం ఇడుపులపాయకు

పాదయాత్రల చరిత్రలో మరో ఘట్టానికి ఇచ్ఛాపురం వేదిక కానుంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు వైసీపీ అధినేత వైయస్. జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర తుది ఘట్టానికి చేరుకొని ఈనెల 9వ తేదీన ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగింపు పలుకుతున్నారు. బుధవారం నాటికి ఇచ్ఛాపురం చేరుకొని పాదయాత్ర ముగించనున్నారు.

(సూర్యబ్యూరో శ్రీకాకుళం) : ఇడుపలపాయలో బయలు దేరి ఇచ్ఛాపురం చేరుకునే వరకు 3458 కిలోమీటర్ల పాదయాత్రను 341 రోజుల్లో పూర్తిచేసినట్టు అవుతుంది. ఈ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛా పురంలో నిర్వహించే ప్రజా సంకల్పయాత్రసభ విజయవంతంచేసేందుకు వైకాపా నేతలు పెద్ద ఎత్తున విస్తృత ఏర్పాట్లు చేసారు. జగన్ ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా

మిగతా 6లో



అంతే ఇంతే!



ఓట్ల ప్రచారం కోసం బయోపిక్‌లు తీస్తున్నారు.

మోడీ సర్కారుకు ఎదురుదెబ్బ

సిబీఐ చీఫ్‌గా తిరిగి అలోక్ వర్మ నియామకం



- అలోక్ వర్మ విషయంలో న్యాయం జరిగిందన్న రాహుల్
- రాఫెల్‌పై దర్యాప్తు చేస్తారనే అలోక్‌ను తప్పించారు
- రాఫెల్ విషయంలో ఇకపై ఏం జరుగుతుందో చూడాలి

వివరాలు 6లో

ధర్మాసనానికి అయోధ్య కేసు


ఐదుగురు సభ్యుల్లో ఎన్‌వీ రమణ కూడా

- ఈ నెల 10న విచారణ చేపట్టనున్న ధర్మాసనం
- హిందు ముస్లింల మధ్య ఘర్షణకు కారణమవుతున్న అయోధ్యబాబ్రీ మసీదు



వివరాలు 6లో

మోడీకి ట్రంప్, పుతిన్ ఫోన్



- వాణిజ్యలోటును తగ్గించడంపై ట్రంప్‌తో చర్చలు
- బంధం బలోపేతం చేసుకోవాలని నిర్ణయం
- వెల్లడించిన వైట్ హౌస్
- పలు అంతర్జాతీయ అంశాలపై పుతిన్ చర్చ
- ఈస్ట్రన్ ఎకనామిక్ సదస్సుకు రావాలని మోడీకి ఆహ్వానం
- సానుకూలంగా స్పందించిన భారత ప్రధాని

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ విషయాన్ని నిర్ధారించిన వైట్ హౌస్, ఇరు నేతల మధ్యా వాణిజ్యలోటు తగ్గించడం, ఆఫ్ఘనిస్థాన్ లో నెలకొన్న పరిస్థితి తదితర అంశాలపై చర్చలు జరిగినట్టు పేర్కొంది. కొత్త సంవత్సరంలో ఇరు దేశాల మధ్యా ఉన్న వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నేతలు నిర్ణయించారు. ఇండియా, యూఎస్ మధ్య ఉన్న వాణిజ్యలోటును తగ్గించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా వారు చర్చించారు. ఇండో – పసిఫిక్ రీజియన్ లో శాంతి, ఆఫ్గన్ కు సహకారం తదితర అంశాలపైనా వారు మాట్లాడుకున్నారు అని వైట్ హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, భారత్ నుంచి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై ట్రంప్ సుంకాలను పెంచిన తరువాత, రెండు దేశాల

మిగతా 6లో

క్యూనెట్ గుట్టు రట్టు 58 మంది అరెస్టు

● 17ఏళ్లుగా రూ.వెయ్యికోట్ల మోసం ● ప్రపంచ వ్యాప్తంగా బాధితులు సైబరాబాద్ కమీషనర్ సజ్జనార్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: డబ్బు ఆశ చూపి వేల సంఖ్యలో బాధితులకు కుచ్చుటోపి పెట్టిన క్యూనెట్ మోసగాళ్లను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నిరుద్యోగులను, అమాయకులను ట్రాప్ చేసి చైన్ సిస్టమ్ ద్వారా ప్రైజ్ మనీ, కమీషన్లు వస్తాయంటూ నమ్మించి మోసాలకు పాల్పడిన 58 మంది కేటుగాళ్లను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ వ్యక్తి ఇచ్చిన పిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగిన సైబరాబాద్ ఈవోడబ్ల్యు(ఎకానిమిక్స్ అఫెన్స్ వింగ్) అధికారులు మల్టిలేవల్ మార్కెట్ గ్యాంగ్ గుట్టు రట్టు చేశారు. సైబరాబాద్ పరిధిలో క్యూనెట్ మోసంపై 14 కేసుల నమోదయినట్లు పోలీసు కమిషనర్ సజ్జనార్ మీడియాకు తెలిపారు. దేశవ్యాప్తంగా క్యూనెట్ బ్యాంకు అకౌంట్లను, గోదాంలను సీజ్ చేసినట్లు వివరించారు. అరెస్టు చేసిన 58 మందిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇక ఇప్పటికే క్యూనెట్ చైర్మన్ మైకెల్ ఫెరారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే.

రూ.1000 కోట్ల మోసం : బిజినెస్ ప్లాన్ ఉందని అమాయక, నిరుద్యోగ యువకులను టార్గెట్ చేస్తూ ముగ్గులోకి దింపి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన కేటుగాళ్లను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ తెలిపారు. పలు రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన అనంతరం సజ్జనార్ పలు విషయాలు వెల్లడించారు. వివధ రకాల కేసుల్లో మొత్తం 58 మందిని అరెస్టు చేశాము. క్యూనెట్ సంస్థ సుమారు వెయ్యి కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ముఠాలో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులు కూడా ఉన్నారు వారిని కూడా అదుపులోకి తీసుకున్నాం. 2001 నుంచి వీళ్లు వ్యాపారం చేస్తున్నారు.

రాజాసింగ్‌ను అనర్హుడుగా ప్రకటించాలి

● మతవిద్వేషాలను రెచ్చగొడుతున్న అసదుద్దీన్, రాజాసింగ్
● బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై దాదాపు 43 క్రిమినల్ కేసులున్నా ఎందుకు శిక్షించడం లేదు ● రాజాసింగ్, ఓవైసీ సోదరుల మధ్య లోపాయికారి ఒప్పందాలున్నాయి
● ఏఐసిసి అధికార ప్రతినిధి డాక్టర్ శ్రవణ్ దాసోజు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణా శాసన సభ సభ్యుడిగా మైనార్టీ కి చెందిన ప్రొటెం స్పీకర్ ముందు ప్రమాణ స్వీకారం చేయనని మత తత్వ బిజెపి పార్టీ కి చెందిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అనడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. రాజా సింగ్ వ్యాఖ్యలు యావత్ మైనార్టీ సమాజాన్ని కించ పరిచినట్లేనని, ఆసమాజం పై ఆయనకున్న ద్వేష భావాన్ని బహిర్గతం చేస్తున్నాయని, ప్రజాస్వామ్య సిద్దాంతాలకు, లౌకిక విధానాలకు ఆయువు పట్టైన శాసనసభ లో బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ కొనసాగే అర్హత లేదని ఆయననను తక్షణమే అనర్హుడుగా ప్రకటించాలని ఏఐసిసి అధికార ప్రతినిధి డాక్టర్ శ్రవణ్ దాసోజు డిమాండ్ చేశారు. 43 కేసులున్న వ్యక్తిని ఎందుకు శిక్షించడం లేదో ముఖ్యమంత్రి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ పై దాదావు 43 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని వాటిలో ఎక్కువ మేరకు విద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించినవేనని డాక్టర్ శ్రవణ్ ఆరోపించారు. 2014 లో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజాసింగ్ పై దాదాపు 24 కేసులు నమోదయ్యాయన్నారు. టీఆర్ఎస్ పాలన లో ఆయన పై నమోదయిన ఏ ఒక్క కేసుల్లో కూడా అరెస్ట్ చేసిన దాఖలాలు లేవన్నారు. లౌకిక వాదం అంటూ గొప్పలు చెప్పే కేసీఆర్ ఎందుకు రాజాసింగ్ ను కాపాడుతున్నారని, పోలీసులు ఆయన పై చర్యలు తీసుకోకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ పార్టీతో అంటకాగుతున్న ఎంఐఎం పార్టీ నేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రాజాసింగ్ పై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పై ఎందుకు వత్తిడి తేలేకపోతున్నారో, ఈ ఇద్దరి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏంటో స్పష్టం చేయాలన్నారు. బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ ఎంఐఎం పార్టీ సృష్టేనని గతంలో కార్పోరేటర్‌గా ఉన్నప్పుడినుంచే ఈ ఇద్దరి మధ్య సత్సంబంధాలున్నాయన్నాయని ఆరోపించారు. రాజాసింగ్, ఓవైసీ సోదరుల మధ్య లోపాయికారి ఒప్పందాలున్నాయని ఆరోపించారు. ఓవైసీ సోదరులు, రాజాసింగ్ లు ఇరువురు విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూఒకరికి మరోకరు సహకరించుకుంటున్నారన్నారు. భవిష్యత్తులో ఈ ఇరువురు మట్టి కరువక తప్పదని హెచ్చరించారు. రాజాసింగ్ కేవలం మతం కారణంగా ప్రొటెం స్పీకర్ ముందు ప్రమాణం చేయననడం పై ఆయన సభ్యత్వాన్ని రద్దు పరిచేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఆయన్ను పదవిచ్యుతుణ్ని చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ తప్పు చేయని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్ ల సభ్యత్వాలను రద్దుచేసిన టీఆర్ఎస్ పార్టీ ద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన రాజాసింగ్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోడి లు తమ పార్టీ ఎమ్మెల్యే మాట్లాడిన మాటలను సమర్ధిస్తున్నారా లేక వ్యతిరేకిస్తున్నారో వెల్లడించాలని దేశంలోని అన్ని మతాలు ప్రజల పట్ల సమభావంతో ఉన్నట్లయితే వెంటనే రాజాసింగ్ ను పార్టీనుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒక వర్గం పట్ల తీవ్ర వ్యతిరేకత ప్రదర్శించే రాజాసింగ్ లాంటి వ్యక్తులు అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ఉండడం దురదృాఎష్టకరమని ఇలాంటి వారి వల్ల దేశంలో జాతి సమగ్రతకు భగ్నం కలుగుతున్నదని డాక్టర్ శ్రవణ్ అన్నారు.

ఈబీసీ బిల్లును స్వాగతిస్తోన్న టీఆర్ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: అగ్రవర్ణాల పేదల కోసం 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన ఈబీసీ బిల్లును స్వాగతిస్తున్నామని టీఆర్ఎస్ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం ఈబీసీ బిల్లుపై లోక్ సభలో చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈ బిల్లును సీఎం కేసీఆర్ పూర్తిగా స్వాగతి స్తున్నారని అన్నారు. బలమైన సమాజ నిర్మాణం కోసం జరిగే, ప్రతి ప్రయత్నాన్ని టీఆర్ఎస్ స్వాగతిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో వెనుకబాటు తనానికి ప్రభుత్వాలే కారణమని జితేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకు ఉన్న ఏ ప్రభుత్వం కూడా, సామాన్యుడి గురించి ఆలోచించలేదని ఆయన అన్నారు. ఆలస్యమైనా అగ్రవర్ణ పేదలకు న్యాయం జరుగుతుందని జితేందర్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. విభజన తర్వాత తెలంగాణ అభివృద్ధిలో ముందుకెళ్తోందని అన్నారు. తెలంగాణలో 12 శాతం ముస్లిం మైనార్టీలున్నారని, 10శాతం రిజర్వేషన్లతో సమస్య పరిష్కారం కాదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముస్లింల రిజర్వేషన్లను..12శాతానికి, ఎస్టీల రిజర్వేషన్లను 10శాతానికి పెంచిందని జితేందర్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లు ఉన్నాయని, తెలంగాణ అసెంబ్లీ ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల పెంపును ఆమోదించాక కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపలేదని జితేందర్‌రెడ్డి విమర్శించారు.

కుష్ఠు రోగాన్ని తరమడానికి చర్యలు తీసుకోవాలి కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్



ఢిల్లీ, మేజర్‌న్యూస్ : కుష్ఠు రోగం పేరిట విడాకులిచ్చే విధానానికి స్వస్తి పలుకాలని టీఆర్ఎస్ ఎంపీ బీ వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోకసభలోఆయన మాట్లాడుతూ కుష్ఠు రోగానికి ప్రస్తుతం చికిత్స లభిస్తున్నదని, కాబట్టి ఈ కారణంతో విడాకులిచ్చే విధానానికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఇందుకోసం లోక్‌సభ మొత్తం ఏకగ్రీవంగా పర్సనల్ లాస్ (సవరణ) బిల్లును ఆమోదించాలని కోరారు. ఇలాంటి తీర్మానం చేయాలని 2008లో భారత మానవ హక్కుల కమిషన్ సూచించిందని, ఐక్యరాజ్యసమితి 2010లో ఇలాంటి తీర్మానమే చేసిందని గుర్తుచేశారు. నిరుపేద వర్గాల్లో సాధారణంగా వచ్చే జబ్బుగా మారిన కుష్ఠురోగాన్ని సంపూర్ణంగా తరిమివేయడానికి కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



రాజస్థాన్ మాజీ గవర్నర్ మార్గరేట్ అల్వా రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, విమలా నర్సింహన్‌ను కలిసి, ఆమె రాసిన 'ఆటోబయోగ్రఫీ' పుస్తకాన్ని అందజేశారు.

పేదలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు

● అధికారులే ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు ● అసైన్,చుక్కల భూములను పేదలకు పంచాలని వైఎస్ రాజశేర్ రెడ్డి జీవో తెచ్చారు ● దాదాపు 12 లక్షల ఎకరాల చుక్కల భూములు ● మూపై లక్షల మంది ఇబ్బంది పడుతున్నారు ● సినీ నటుడు శివాజీ



అమరావతి,సూర్యబ్యూరో: పేదలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటు న్నారని హీరో శివాజీ ప్రభుత్వాధికారులపైనే తీవ్ర ఆరోపణలు గుప్పించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధికారులే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. రైతులు విద్యుత్ సమస్యతో పాటు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూ సమస్యలు అన్ని రాష్ట్రాల్లో ఉంటాయన్నారు. కానీ చుక్కల భూములు, అసైన్డ్ భూములు పేదలకు పంచాలని 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఒక జీవో తీసుకొచ్చారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత అధికారులు మాత్రం పేదలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చుక్కలు భూములు, అసైన్డ్ భూములను పేదలకు ఇవ్వాల్సిందేన్నారు. నిషేధిత భూముల పేరుతో అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులపైనే తనకు అనుమానాలు న్నాయన్నారు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు స్పష్టంచేశారు. అధికారులే గందరగోళం సృష్టిస్తున్నట్లుగా తెలుస్తుందన్నారు. అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరొస్తోందన్నారు. ఈనెలాఖరుకు సమస్య తేలకపోతే అధికారుల పేర్లు బయటపెడతానని హెచ్చరించారు. నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్లతో మాట్లాడి ఈ సమాచారాన్ని సేకరించానని వెల్లడించారు. ఏపీలో దాదాపుగా 12 లక్షల ఎకరాల చుక్కలు భూములు న్నాయని పేర్కొన్నారు. ఈ భూముల వల్ల 30 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

దిగ్విజయంగా జగన్ యాత్ర పూర్తి : తలశిల రఘురాం



శ్రీకాకుళం, మేజర్‌న్యూస్: టీడీపీ ప్రభుత్వం ఎన్నో అవరోధాలు సృష్టించినా, చివరకు భౌతికంగా అంతం చేసేందుకు హత్యయత్నానికి పాల్పడినా చలించకుండా ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దిగ్విజయంగా తన పాదయాత్రను పూర్తి చేశారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం అన్నారు. వైఎస్ జగన్‌పై భౌతిక దాడి ఫలించకపోవడంతో ఇప్పుడు ఆధ్యాత్మిక దాడి చేసేందుకు చంద్రబాబు కుట్రపన్నారని ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ పాదయాత్రకు సహకరించిన వారందరకీ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారంనాడు ప్రజాసంకల్పయాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛాపురం పాత బస్టాండ్ సెంటర్ లో బహిరంగ సభ ఏర్పాటు చేశామని చెప్పారు. గొప్ప సంకల్పంతో వైఎస్ జగన్ పాదయాత్ర చేశారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తిరుమల దర్శనం సందర్భంగా చంద్రబాబే టీడీపీ కార్యకర్తల చేత హడావిడి చేయించే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. గతంలో కూడా ఇదే విధంగా వ్యవహరించారని విమర్శించారు. ఇప్పుడు కూడా అదే విధంగా దుశ్చర్యలు చేయబోతున్నారని, దీనిపై తమకు పక్కా సమాచారం ఉందన్నారు. స్వామి వారిని కూడా రాజకీయ అవసరాల కోసం వాడుకోవడం చంద్రబాబు అలవాటేనని విమర్శించారు.

జగన్‌పై హత్యాయత్నం కేసు

కోర్టును ఆశ్రయించిన ఎన్ఐఏ



విశాఖపట్నం, మేజర్‌న్యూస్: వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఏపీ పోలీసులు సహకరించకపోవడంతో జాతీయదర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మంగళవారం కోర్టును ఆశ్రయించింది. ఈ హత్యాయత్నం కేసుకు సంబంధించిన డాక్యు మెంట్లు ఇప్పించాలని ఎన్ఐఏ కోర్టులో మెమో దాఖలు చేసింది. అలాగే ఈ కేసును విజయవాడ కోర్టుకు బదలాయించాలని కోరింది. నిందితుడు శ్రీనివాసరావును కూడా కస్టడీ కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విశాఖ విమానాశ్రయంలో గతేడాది అక్టోబర్ 25న ప్రతిపక్ష నేతపై జరిగిన హత్యాయత్నం ఘటనమీద దర్యాప్తును హైకోర్టు ఆదేశాల మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఎన్ఐఏ జనవరి 1న ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి దర్యాప్తు కూడా మొదలుపెట్టింది. విచారణలో భాగంగా ఏపీ పోలీసులు సహకరించకపోవడంతో ఎన్ఐఏ అధికారులు కోర్టును ఆశ్రయించారు.

ప్రజాభిప్రాయానికి భిన్నంగా అసెంబ్లీ ఫలితాలు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ ఫలితాలపై కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయానికి భిన్నంగా వచ్చాయని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని రాష్ట్రం కోడై కూసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆంఎస్ విపరీతంగా డబ్బు పంచిందని ఆరోపించారు.అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ వస్తుంది అని ప్రచారం జరిగిందని,మీడియా కూడా అలానే చూపించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో డబ్బును విపరీతంగా ఓటర్లకు టీఆరెస్ పార్టీ పంపిణీ చేసిందని ఆరోపించారు. డబ్బుల పంపిణీపై ఫిర్యాదు చేసినా ఎన్నికల కమీషన్ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల కమిషన్ ఈ డబ్బులు పంచడాన్ని అరికట్టలేక పోయింది. మద్యం విపరీతంగా పంచారు. ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ చేస్తుందన్నారు. ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ చేస్తుంది. రాజ్యాంగాన్ని సవరణకు, ఈబీసీలకు రిజర్వేషన్ కప్పించడానికి కాంగ్రెస్ సహకరిస్తుందని తెలిపారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ వ్యాఖ్యలు సరికాదన్నారు. సీనియర్ నేతలు పార్టీకి నష్టం కలిగేలా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సర్వే సత్యనారాయణపై సస్పెన్షన్ విషయం ఏఐసీసీ చూసుకుంటుందని తెలిపారు.

ఎన్నికల కోసమే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు

● తెలుగురాష్ట్రాల అసెంబ్లీ తీర్మాణాలు ఏమయ్యాయి ● అగ్రవర్ణాలలోని పేదలపై మోడీకి ప్రేమలేదు ● టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: బీజేపీ స్వార్థ రాజకీయాలు చేస్తోందని తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ ధ్వజమెత్తారు. గిరిజనులు, మైనార్టీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొసలీ కన్నీరు కారుస్తు న్నాయని ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా బీజేపీని ప్రజలు తిరస్కరించారని చెప్పారు. ఎన్నికల కోసమే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లంటూ బీజేపీ స్వార్థ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పేదలపై మోదీకి నిజమైన ప్రేమ ఉంటే అఖిలపక్ష సమావేశం పెట్టాలన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు.. స్వార్థ రాజకీయాలకు పరాకాష్టగా ఆయన అభివర్ణించారు. ప్రధాని నరేంద్రమోడీ కేబినెట్ ఆకస్మాత్తుగా అగ్రవర్ణా లలోని పేదలకు విద్య , ఉద్యోగాలలో 10శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించడం, వెంటనే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ బిల్లు అమలు కావాలంటే 2/3 వంతు మెజార్టీతో రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. మెజార్టీ రాష్ట్రాలు తీర్మాణం చేఆయల్సి ఉంటుందని తెలిపారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో దెబ్బతిన్న రేంద్రమోడీ ప్రభుత్వం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఉద్దేశంతో అదరబాదరాగా ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. అగ్రవర్ణాలలోని పేదల పట్ల కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే ఇంతకు పూర్వమే ఈ బిల్లును ప్రవేశపెట్టి ఉండేవారన్నారు. ఎన్నికల్లో గెలవాలనే కుయుక్తులలో భాగంగానే దీన్ని తీసుకొచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీలకు 12శాతం, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు కల్పించే అసెంబ్లీ తీర్మాణాన్ని కేంద్రం పక్కన పెట్టడంపై ఆయన దుయ్యబట్టారు. ఏపీలోనూ కాపులకు రిజర్వేషన్ కల్పించాలని పంపిన అసెంబ్లీ తీర్మాణాన్ని పక్కన పెట్టిందని తెలిపారు. రిజర్వేషన్లు 50శాతం మించవద్దన్న నెపంతో తెలుగు రాష్ట్రాలు పంపిన అసెంబ్లీ తీర్మాణాలను కేంద్రం పక్కన పెట్టినట్లు కేంద్రం తెలిపిన విసయాన్ని గుర్తుచేశారు. నిజంగా అగ్రవర్ణాలలోని పేదలకు రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశం కేంద్రానికి ఉంటే అఖిల పక్షాన్ని పిలిచి నిర్మాణాత్మకమ ఐన సలహాలను తీసుకొని, శాస్త్రీయంగా చేసి ఉండేవారని రమణ అన్నారు. స్వార్థ రాజకీయాల కోసమే బిల్లును ప్రవేశపెట్టారన్నారు. పేదలు ఏ వర్గంలో ఉన్నా వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నది తెలుగుదేశం పార్టీ భావిస్తున్నదని రమణ తెలిపారు.

రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదు కానీ


న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టారు. దీనిపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఈ బిల్లుకు ఎవరూ వ్యతిరేకం కాదు, కానీ సమగ్ర చర్చ జరిగే సమయం లేకుండా సభలో బిల్లును ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవడం లేదని మండిపడ్డారు. కేంద్రం నిర్ణయం ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా ఉందన్నారు. అగ్రకులాల వారికి రిజర్వేషన్లు ఇవ్వడంతో జనరల్ కేటగిరిలో తమకి స్థానం దక్కదని వేరే వాళ్లు అనుకుంటే ఇబ్బంధులు తలెత్తుతాయని హెచ్చరించారు. ఎన్నికల ముందు అగ్రకులాల పేదలకు తాయిలాలు ఇచ్చేలా కేంద్రం దీన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. సీబీఐ కేసులో సుప్రీం తీర్పు ప్రధాని మోదీ, సీవీసీ చౌదరికి చెంపపెట్టు అని అన్నారు.

స్వతంత్ర సంస్థల్లో కేంద్రం జోక్యం మానుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని పేర్కొన్నారు. మోదీ నిరంకుశ పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

రిజర్వేషన్ల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

అమరావతి, మేజర్‌న్యూస్: అగ్రవర్ణ పేదలకు (ఈబీసీ) ప్రధాని మోదీ ప్రకటించిన 10శాతం రిజర్వేషన్ల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరా రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ తన వైఫల్యాల నుంచి తప్పించుకునేందుకే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు అంశం తెరపైకి తెచ్చిందని విమర్శించారు.

నాలుగేళ్ల తర్వాత మోదీ చేసిన హడావుడిలో ఆయన నిజాయితీ కనిపించటం లేదన్నారు. జనాభా ప్రాతిపదిక ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పెంచాలని రఘువీరా రెడ్డి డిమాండ్ చేశారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్. ఈ సందర్భంగా రెండోసారి అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించినందుకు సీఎం కేసీఆర్‌ను ఆయన అభినందించారు.

బిల్లుకు మద్దతు తెలుపకపోతే కర్ర కాల్చి వాతపెడతారు : బీజేపీ లక్ష్మణ్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఆర్థిక వెనుకబాటు ఆధారంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మక నిర్ణయమంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ కొనియాడారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలన్నీ అగ్రవర్ణ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలుపకపోతే ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు. అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు దశాబ్దాల డిమాండ్ అని సామాజిక వివక్షకు సంబంధించిన రిజర్వేషన్లతో పాటు ఆర్థిక వెనుకబాటు ఆధారంగా కూడా రిజర్వేషన్లు అవసరమన్నారు. ఈ సాహసోపేత నిర్ణయం అమలు చేసిన ఘనత మోదీనే అని తెలిపారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలు, ఓటు బ్యాంకు రాజకీయాలే చేస్తుందని ఆరోపించారు. అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు అర్ధరహితమని పేర్కొన్నారు. అసదుద్దీన్ ది నోరా.. తాటి మట్టా? అని ఫైర్ అయ్యారు. సమాజంలోని అసమానతలు తొలగించడానికే మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పేదలకు రిజర్వేషన్లు ఇస్తే కొందరు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. అన్ని కోణాల్లో ఆలోచించి ఎలాంటి చిక్కులు రాకుండా ఉండే విధంగానే ఈ బిల్లు రూపొందించామని తెలిపారు. ఇది ముమ్మాటికీ ఎన్నికల స్టంట్ కాదని, కాన్షీరామ్ కూడా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. మాయావతి, ములాయం కూడా అగ్రవర్ణ రిజర్వేషన్లు సమర్ధించారని తెలిపారు. కేసీఆర్ మతపరమైన రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెడితే బీజేపీ ఎమ్మెల్యేలుగా అడ్డుకున్నామని, ఆర్థిక ప్రాతిపదికగా రిజర్వేషన్లు ఇవ్వాలని కోరామని తెలిపారు. మేము ఆనాడు చెపితే కేసీఆర్ కు అర్థం కాలేదు, కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే పెరిగిన 10శాతం రిజర్వేషన్లు తెలంగాణలో అమలు చేయాలన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసి పెరిగిన రిజర్వేషన్లను అమలు పరచాలన్నారు. సామాజిక వివక్షను, ఆర్థిక వెనుకబాటును దృాఎష్టిలో పెట్టుకొని రిజర్వేషన్లు ఇవ్వాలని సూచించారు. సిన్హా కమీషన్ నివేదిక పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు.

నేటి ప్రజా సంకల్పయాత్ర షెడ్యూల్



శ్రీకాకుళం, మేజర్‌న్యూస్: ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. వారిలో భరోసా నింపుతూ ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర తుది అంకానికి చేరింది. ఇడుపులపాయలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి స్మృతివనం (వైఎస్సార్ ఘాట్) నుంచి 2017 నవంబర్ 6వ తేదీన చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర, బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనున్న సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం వైఎస్ జగన్ పెద్ద కొజ్జిరియా నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారు. అక్కడి నుంచి లొద్దకుట్టి మీదుగా జననేత పాదయాత్ర ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర సాగుతుంది. ప్రజాసంకల్పయాత్ర ముగింపు సూచకంగా ఏర్పాటు చేసిన విజయసంకల్ప స్తూపాన్ని జననేత ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి తన తండ్రి మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన ప్రజాప్రస్థానం విజయస్తూపం, తన సోదరి షర్మిల చేసిన మరో ప్రజాప్రస్థానం స్తూపం మీదుగా ఇచ్ఛాపురం పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభ ప్రాంతానికి వైఎస్ జగన్ చేరుకుంటారు.అక్కడ జననేత ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడితో ఆయన చారిత్రాత్మకమైన పాదయాత్ర ముగుస్తుంది. ఈ మేరకు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం ఓ ప్రకటన విడుదల చేశారు.

డెబ్బై ఏళ్లలో ఏ ప్రధాని తీసుకోని నిర్ణయం మోదీ తీసుకున్నారు : కన్నా లక్ష్మీనారాయణ



గుంటూరు,సూర్యబ్యూరో: నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మినారాయణ అన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మోదీ చేసిన ప్రకటనపై స్పందించిన ఆయన మాట్లాడుతూ 10 శాతం రిజర్వేషన్లతో అగ్రవర్ణాల్లోని పేదలకు భరోసా అని అన్నారు. 70 ఏళ్లలో ఏ ప్రధానమంత్రి తీసుకోని నిర్ణయం మోదీ తీసుకున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు అదుపులోపెట్టుకుని మాట్లాడాలన్నారు. పోలవరం నిర్మాణంలో నాణ్యతను గాలికొదిలిప్రచారం కోసం చంద్రబాబు పాకులాడుతున్నారని కన్నా విమర్శించారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 31వరకు గడువు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు చేసుకోవడానికి ఈ నెల 31వరకు గడువు ఉందని ఎన్నికల అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు పేరు నమోదు చేసుకోని వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుకు భారతీయ పౌరుడై ఉండాలనీ, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పరిధిలో సాధారణ నివాసి అయి ఉండాలని తెలిపారు. 2018 నవంబర్ 1 నాటికి మూడేళ్ల ముందు డిగ్రీ ఉత్తీర్ణులైన వారే ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. నియోజక వర్గంలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-18 పూరించి, కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటో, డిగ్రీ ఉత్తీర్ణత సర్టిఫికెట్ జిరాక్సుపై గెజిటెడ్ అధికారితో సంతకం చేసి సంబంధిత తహసీల్దార్ లేదా రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పేరు నమోదుకు 2012-18 మధ్య కాలంలో మూడేళ్ల బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఓటర్లు నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. వృత్తిలో ఉన్నవారు (ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల) సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఫారం-19దరఖాస్తు నింపి సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా తహసీల్దార్ లే ఎంపీడీవో లేదా ఎంఈవో కార్యాలయాల్లో సమర్పిం చాలన్నారు. ఉన్నత పాఠశాలలు, కళాశాల బోధనా సిబ్బంది దరఖాస్తులను సంబంధిత ప్రిన్సిపాల్ ఒకేసారి సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు చివరి తేదీ ఈ నెల 31అని తెలిపారు.

అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఈ అవకాశన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

భారత్ బంద్ 'పాక్షికం'

● ఇందిరాపార్కు వద్ద మహాధర్నా ● తెలంగాణాలో ప్రభావం నిల్

న్యూఢిల్లీ, సూర్యప్రధానప్రతినిధిః కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు చేపట్టిన భారత్ బంద్ మంగళవారం ఉదయం ప్రారంభమైంది. సెంట్రల్ ట్రేడ్ యూనియన్ బిల్లు 2018కు వ్యతిరేకంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు జనవరి 8, 9న భారత్ బంద్ నకు పిలువునిచ్చిన విషయం తెలిసిందే. అన్ని రాష్ట్రాల్లోనూ కార్మికులు తెల్లవారుజాము నుంచే రోడ్లమీదకు వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు.

ఈ బంద్‌లో బ్యాంకు ఉద్యోగులు కూడా పాల్గొన్నారు. దీంతో బ్యాంకులు మూతపడ్డాయి. దీంతో ఈ రోజు, రేపు బ్యాంకులకు తాళాలు పడనున్నాయి. ట్రేడ్ యూనియన్ బిల్లు 2018 సవరణ ద్వారా ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని సీఐటీయు జాతీయ కార్యదర్శి తపన్ సేన్ గుప్తా ఆరోపించారు. ఈ బిల్లు ఆమోదం పొందితే కార్మిక సంఘాల అధికారాలకు తెరపడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులను, ఉద్యోగులను అణిచివేసేందుకు ప్రయత్నం ప్రయత్నిస్తోందన్నారు.తమ 12 డిమాండ్లను కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వం ముందుంచాయి. రెండు రోజుల భారత్ బంద్‌కు 10 పెద్ద ట్రేడ్ యూనియన్లు మద్దతు ప్రకటించగా, ఆలిండియా కిసాన్ మహాసభ కూడా దీనిని స్వాగతించింది. సాధారణ ప్రజలతో పాటు ఈ ఆందోళనల్లో రైతులు కూడా పాలు పంచుకున్నారు. పూర్తి రుణమాఫీ, నెలకు రూ.3,500 నిరుద్యోగ భృతి చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

పబ్లిక్ సెక్టార్, చిన్న పరిశ్రమలు, ప్రైవేట్ రంగ ఉద్యోగులు, సౌకాశ్రయాలలో పని చేసేవారు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఉద్యోగులు కూడా ఈ భారత్ బంద్ లో పాల్గొంటున్నారు. సమ్మెలో భాగంగా రైల్ రోకో, రోడ్ రోకో, నిరసన ప్రదర్శనలు, ఇతర ఆందోళనలు చేపడుతున్నారు.

తెలంగాణలో కనిపించని సమ్మె ప్రభావం....

దేశ వ్యాప్తంగా వ్యవస్థీకృఎత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు తమ హక్కుల సాధన కోసం కార్మిక సంఘాలు రెండు రోజులపాటు సమ్మె చేపట్టాయి. మంగళ,బుధవారాల్లో సమ్మెకు పిలుపు ఇచ్చాయి. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ సమ్మె చేపట్టారు. దేశ వ్యాప్తంగా కార్మికులు చేపట్టిన సమ్మెకు మిశ్రమ స్పందన లభిస్తోంది. తెలంగాణలో సమ్మె ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. హైదరాబాద్ లో ఆటోలు, ఆర్టీసీ బస్సులు యాధావిధిగా తిరిగాయి. మహాత్మ గాంధీ బస్ స్టాండ్ నుంచి వివిధ జిల్లాలకు వెళ్లే బస్సుల తిరుగుతూనే ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సింగరేణిలో సమ్మె ప్రభావం కనిపించడం లేదు. యాధావిధిగా కార్మికులు విధులకు



హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ డిపో ముందు ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ సమ్మెకు మద్దతు తెలిపినప్పటికీ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపింది. బీజేపీ అనుబంధ యూనియన్ మినహా మిగతా అన్ని యూనియన్లు సమ్మెకు మద్దుతు తెలిపాయి.

ఒమాన్ దేశంలో టీఆర్‌ఎస్ సంబురాలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ఒమాన్ దేశం మస్కట్ లో టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ అద్వర్యంలో అట్టహాసంగా విజయోత్సవ సంబురాలు జరువుకున్నారు. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్ ఒమాన్ శాఖ అధ్యక్షుడు ఈగపూరి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ టీఅర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగల అద్వర్యంలో గత నెలలో తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో టీఅర్‌ఎస్ ఒమాన్ శాఖ నుంచి అన్ని నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించి టీఆర్‌ఎస్ పార్టీ విజయానికి తమ వంతు కృషి చేశారని తెలిపారు.ఆర్‌ఎస్ పార్టీ భారీ విజయం సాధించినందుకు ఒమాన్ లో వివిధ ప్రాంతాల్లో నివసించే తెలంగాణ వాసులతో భారీగా సంబురాలు నిర్వహించమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తలపెట్టిన ఫెడరల్ ఫ్రంట్ కు, రాష్ట్రంలో జరగబోయే అన్ని ఎన్నికలకు టీఆర్‌ఎస్ ఒమాన్ శాఖ నుంచి పూర్తి సహాయ, సహకారాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఅర్‌ఎస్ ఒమాన్ కోర్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు మరియు టీఆర్‌ఎస్ మద్దతుదారులు కుటుంబం సమేతంగా పాల్గొన్నారు.

కేటీఆర్‌కు చెక్‌ను అందజేసిన టీఆర్‌ఎస్‌నేత

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించబోయే తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయ నిర్మాణానికి పలువురు విరాళాలు అందజేస్తున్నారు. సంక్రాంతి పండు గ తరువాత హస్తినలో పార్టీ కార్యా లయ నిర్మాణపనులకు శంకు స్థాపన చేయాలని టీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీని సైతం టీఆర్‌ఎస్ ఎంపీలు కలిసి హస్తినలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఢిల్లీలో టీఆర్‌ఎస్ నిర్మించతలపెట్టిన పార్టీ కార్యాలయ నిర్మాణానికి రంగారెడ్డి జిల్లా టీఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు వసిలి చంద్రశేఖర ప్రసాద్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. చంద్రశేఖర్ వెంట శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఉన్నారు.

జూన్ 26 నుంచి నగరంలో 32వ ఇస్టా సమావేశాలు

ఏర్పాట్లపై సమీక్షించిన సీఎస్ జోషి

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిం జూన్ 26 నుండి జూలై 3 వరకు , హైదరాబాద్ లోని హెచ్ఐసీసీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగే 32వ (ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్) సమావేశాలను పకడ్బందీగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె జోషి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సమావేశాల నిర్వహణపై ముందస్తు ఏర్పాట్ల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డా.అండ్రీయస్ వేస్, ఇస్టా స్విజర్‌ల్యాండ్ శ్రీమతి ఓల్గా స్టోకీ, ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ పీటర్ కార్ బెర్రీ, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారధి, టూరిజం శాఖ కార్యదర్శి బి.వెంకటేశం, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ అంజనీ కుమార్, అదనపు డి.జి. జితేందర్ , వ్యవసాయ శాఖ కమీషనర్ రాహుల్ బొజ్జా, రీజినల్ పాస్ పోర్టు ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి, కేశవులు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ , సమాచార శాఖ చీఫ్ ఇన్ ఫర్మేషన్ ఇంజనీర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముందుగా ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ పై రూపొందించిన బ్రోచర్ ను ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు.

జూన్ 26న ప్రారంభోత్సవ కార్యక్రమం, 26 నుండి 28 వరకు సీడ్ సింపోజిం, ఇంటర్నేషనల్ సీడ్ ఎగ్జిబిషన్, 28న విత్తన వ్యవసాయ దారుల సమావేశం , జూన్ 29 నుండి జూలై 3 వరకు వార్షిక సమావేశాలు జరుగుతాయని, దాదాపు 400 మంది విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని, వీరికి వసతి, బద్రత, రవాణా సదు పాయాలు కల్పించాలని ప్రధాన కార్యదర్శి అన్నారు. విత్తన ప్రదర్శనలో ప్రపంచం లోని వివిధ ప్రాంతాల నుండి 200 విత్తన కంపనీలు పాల్గొంటాయని, కొత్త ఉత్పత్తులు ,సీడ్ ప్రాసెసింగ్ , ప్యాకింగ్ ఎక్విప్ మెంట్స్ , సీడ్ ట్రీట్ మెంట్, నూతన టెక్నాలజి పై వుంటుందని సి.యస్ అన్నారు. విత్తన ఉత్పత్తి , నాణ్యతపై ఈ సింపోజియం ఉంటుందన్నారు. ఈ సింపోజియం లో అభివృఎద్ధి చెందుతున్న దేశాల నుండి 50 మంది చిన్న , మధ్య తరహా ఎంటర్ ప్రైజెస్ నుండి పాల్గొంటారని అన్నారు. ఎఫ్.ఎ.ఓ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్-ఎఫ్ఏఓ) సహకారం తో జరుగుతుందని అన్నారు. రైతులకు విత్తనాల ఉత్పత్తి లో అమలవుతున్న నూతన పద్దతులు , నాణ్యతపై అవగాహన కల్పించడానికి ఈ సమావేశాలు జరుగుతాయన్నారు.

ఈ సందర్భంగా భారతీయ, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇస్టాకు తగు ప్రచారాన్ని నిర్వహించాలని ఆదేశించారు. విదేశీ ప్రతినిధులు తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించే ప్యాకేజి వివరాలను ముందుగానే వారికి తెలియచేయాలని అన్నారు.



ప్రజా సంకల్ప యాత్ర 340వ రోజు సాగిందిలా



శ్రీకాకుళం, మేజర్‌న్యూస్:ప్రజల సమస్యలు తెలుసుకుని, వారిలో భరోసా నింపేందు కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర శ్రీకాకుళం జిల్లాలో దిగ్విజయంగా కొనసాగుతోంది. జననేత 340వ రోజు పాదయాత్రను మంగళ వారం ఉదయం ఇచ్ఛాపురం నియోజకవ ర్గంలోని జగతి శివారు నుంచి ప్రారంభించారు. అక్కడి నుంచి కవిటి, తుత్తు డిపుట్టుగ క్రాస్, బొర్రపుట్టుగ క్రాస్ మీదుగా రాజపురం, అగ్రహారం వరకు వైఎస్ జగన్ పాదయాత్ర కొనసాగించారు.

రాహుల్‌తో చంద్రబాబు భేటీ



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. న్యూఢిల్లీలోని రాహుల్ నివాసానికి చేరుకున్న సీఎం ఆయనతో సమావేశమయ్యారు. బీజేపీ వ్యతిరేకంగా కలిసి వచ్చే పార్టీలను ఏకం చేయాలనే లక్ష్యంతో గతేడాది డిసెంబర్ 9న న్యూఢిల్లీలో సుమారు 28 రాజకీయ పార్టీలతో జరిగిన భేటీకి కొనసాగింపుగా చంద్రబాబు మంగళవారం న్యూఢిల్లీ పర్యటన చేపట్టారు. రాహుల్‌తో భేటీ అనంతరం ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, న్యూఢిల్లీ సీఎం కేజ్రీవాల్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరితో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈనెల 19న కోల్‌కతాలో బహిరంగ సభ తర్వాత దేశవ్యాప్తంగా నిర్వహించే భారీ ర్యాలీలపై నేతలతో చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఎజెండాను పూర్తిస్థాయిలో ఖరారు చేసే లక్ష్యంతో చంద్రబాబు న్యూఢిల్లీ పర్యటనకు వెళ్లినట్టు సమాచారం. భవిష్యత్తు కార్యాచరణ ఎలా ఉండాలి? జనవరి 19 తర్వాత ఎక్కడ ఎలాంటి సమావేశాలు పెట్టాలి? ఎవరు ఎక్కడ హాజరు కావాలి? ఆయా చోట్ల ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలేమిటి? తదితర అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. జాతీయ నేతలతో భేటీ అనంతరం చంద్రబాబు టీడీపీ ఎంపీలతో సమావేశమయ్యారు.

జగన్ అవినీతి చక్రవర్తి-మంత్రి ఆదినారాయణ రెడ్డి



(వెలగవూడి సూర్య ప్రత్యేక ప్రతినిధి) నా రాజీనామా కోరే హక్కు జగన్‌కి లేదని రాష్ట్ర మార్కెటింగ్ గిడ్డంగుల శాఖా మంత్రి ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తండ్రి రాజా ఆఫ్ కరప్షన్ అయితే ఆయన కుమారుడు జగన్ అవినీతి చక్రవర్తి అని పేర్కొన్నారు. ఆ రోజుల్లోనే లక్ష కోట్ల అవినీతి చేసి సిబిఐ, ఈడీ కేసుల్లో ముద్దాయిగా ఉన్న జగన్ ఎదురుదాడి చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఉనికిని దెబ్బకొట్టాలని మోడీ చూస్తుంటే, దానికి జగన్, కేసీఆర్ మద్దతు పలకడం శోచనీయమన్నారు. అమరావతి రాజధానికి 33 వేల ఎకరాలు భూములను రైతులు స్వచ్ఛందంగా ఇస్తే, దానిని కూడా రాజకీయం చేస్తున్నారని, ఇక్కడ ప్రజలు ఎంతో తెలివైనవారని వారికీ భూముల విలువ తెలుసన్నారు. రాష్ట్రాభివద్ధి కోసం సీఎం చంద్రబాబు నిరంతరం పనిచేస్తున్నారన్నారు. నిపుణులు, ఇంజనీర్లు, ఇతర రాష్ట్రాల నేతలు పోలవరం ప్రాజెక్టును మెచ్చుకుంటే ఆ మంచిని జగన్ ఒప్పుకోవడం లేదన్నారు. నీటి ప్రాజెక్టుల కోసం 62 వేల కోట్లు ఖర్చు అయినట్లు నిన్న విడుదల చేసిన వుస్తకంలో రాస్తే అదే వుస్తకంలో లక్ష కోట్ల అవినీతి అని వూర్తి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. జమ్మలమడుగు విషయంలో సీఎం ఒకరిని ఎంపీగానూ, ఇంకోకరిని ఎమ్మెల్యేగా పోటీ చేయమని అంటున్నారని పలువురు పేర్కొంటున్నారని, మా కార్యకర్తలు నేను జమ్మలమడుగు నుండి మళ్ళీ ఎమ్మెల్యేగా పోటీచేయాలని కోరుకుంటున్నారన్నారు. ఏనిర్ణయం తీసుకున్నాదానికి కట్టుబడి ఉంటామని, మా పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ముందు మావాదన మేము వినిపించామన్నారు. ఆయన చివరగా ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటామన్నారు.

తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రాజెక్టుల గురించి అధికారులతో చర్చించిన ఉపరాష్ట్రపతి

● రేణిగుంట నుంచి వెంకటాచలం(నెల్లూరు) వరకూ రైలులో ప్రయాణించిన శ్రీ వెంకయ్యనాయుడు

● ప్రయాణించిన సమయంలో రైల్వే అధికారులతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైల్వే ప్రాజెక్టుల గురించి ప్రత్యేక చర్చ

● కృష్ణపట్నం ఓబులవారి పల్లె రైల్వే లైను మరియు నడికుడి శ్రీకాళహస్తి మార్గం పనుల గురించి ప్రత్యేకంగా చర్చించిన ఉపరాష్ట్రపతి

ఉపరాష్ట్రపతి శ్రీ ఎం.వెంకయ్యనాయుడు అత్తగారి దశదిన కార్యక్రమాల కోసం ఢిల్లీ నుంచి నెల్లూరు బయలు దేరారు. ఢిల్లీ నుంచి రేణి గుంట విమానాశ్రయం చేరుకుని, అక్కడ నుంచి రైలు మార్గంలో వెంకటాచలం (నెల్లూరు) చేరుకున్నారు. ఉపరాష్ట్రపతి రైలు ప్రయాణం చేయడమే కాకుండా, ఆ సమయాన్ని పలు రైల్వే ప్రాజెక్టుల గురించి అధికారులతో మాట్లాడేందుకు కేటాయించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు రైల్వే ప్రాజెక్టులు చర్చకు వచ్చాయి. ఈ సమావేశానికి జనరల్ మేనేజర్ శ్రీ ఆర్.కె.కులశ్రేష్ఠ, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ శ్రీ శివప్రసాద్, డి.ఆర్.ఎమ్. శ్రీ విజయ్ ప్రతాప్ సింగ్, ఆర్వీఎన్ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ కమలాకర్ రెడ్డి హాజరయ్యారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృఎద్ధి కోసం రవాణా సౌకర్యాలు కీలకమనే విషయాన్ని దృఎష్టిలో పెట్టుకుని, నూతన రైల్వే ప్రాజెక్టులతో పాటు ప్రస్తుతం ముందుకు సాగుతున్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. ముఖ్యంగా కృఎష్ణ పట్నం-ఓబులవారిపల్లె రైల్వే లైను మరియు నడికుడి శ్రీకాళహస్తి రైలు మార్గం పనుల గురించి ప్రత్యేకంగా అధికారులతో చర్చించారు. వీటితో పాటు గూడూరు విజయవాడ మూడో లైను, గుంటూరు-అమరావతి-విజయవాడ రైల్వేలైను, గుంతకల్లు స్టేషన్, నెల్లూరు నూతన స్టేషన్లతో పాటు గూడూరు, రేణిగుంట స్టేషన్లలో వైఫై సౌకర్యం గురించి చర్చించారు. వీటితో పాటుగా ఈ మధ్య రైల్వే ప్రవేశపెట్టిన సువిధ డైనమిక్ ఫెయిర్ ట్రైన్స్ గురించి కూడా మాట్లాడారు. వీటిలో టిక్కెట్టు ధరలు మరీ ఎక్కువగా ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయని, మధ్యతరగతికి సౌకర్య వంతంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నెల్లూరు కడప జిల్లాల మధ్య ముడిసరుకుల రవాణా మరియు ప్రయాణ సౌకర్యాలు, కృఎష్ణపట్నం పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులకు ఉద్దేశించిన కృఎష్ణపట్నం-ఓబుల వారి పల్లె రైల్వే లైన్ సొరంగం పనుల గురించి గతంలోనే రైల్వే మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ని తన ఛాంబర్ కు పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. అప్పట్లో రైల్వే బోర్డు చైర్మన్ లోహాని,



ఆర్వీఎన్ఎల్ ముఖ్య అధికారి ప్రదీప్ గౌర్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ ప్రాజెక్టు ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి కానున్నట్లు ఉపరాష్ట్రపతికి పూర్తి వివరాలను రైల్వే అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం ఆ పనుల గురించి మరో సారి ఉపరాష్ట్రపతి రైల్వే అధికారులతో చర్చించారు. ముందుగా తెలియజేసినట్లుగా ఫిబ్రవరి చివరి నాటికి పనులు పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. రాయలసీమ మరియు కోస్తా ప్రాంతాలను కలువుతూ, కడప-నెల్లూరు మధ్య ముడిసరుకుల రవాణా కోసం ఉద్దేశించిన ఈ ర్వైల్వే లైనును ప్రజా రవాణా కోసం కూడా అందుబాటులో తెచ్చేందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సానుకూలమైన నిర్ణయాన్ని తీసుకునే దిశగా ఆలోచించాలని ఉపరాష్ట్రపతి గతంలోనే రైల్వే మంత్రికి సూచించారు. ఈ విషయాన్ని అధికారులకు కూడా వివరించి, దానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

నడికుడి శ్రీ కాళహస్తి రైల్వే లైను విషయంలోనూ ఉపరాష్ట్రపతి, రైల్వే అధికారులతో మాట్లాడారు. పనుల వేగం, ఏ సమయానికి పూర్తి కావొచ్చు తదితర అంశాల గురించి అడిగిన ప్రశ్నలకు రైల్వే అధికారులు వివరాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం 2016 ఆగష్టులో 45 కి.మి విస్తీర్ణం కలిగిన భూమిని పిడుగురాళ్ళ సవలాయ పురం మధ్య అందించిందని, అయితే అందులో రెండు చోట్లు భూమి విషయంలో వివాదాలు తలెత్తి, ప్రస్తుతం అది హైకోర్టులో వివాదం నడుస్తోందని, దీని మీద రాష్ట్ర ప్రభుత్వం వివరాలు అందించాల్సి ఉందని తెలిపారు. అధే విధంగా పిడుగురాళ్ళ రొంపిచర్ల మధ్య వివాదంలో ఉన్న భూమి మినహా మిగిలిన ప్రదేశంలో పనులు వూర్తి అయ్యాయని, వివాదాలు తేలిన తర్వాత మిగిలిన చోట కూడా పని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇప్పటికే వూర్తన రైల్వే లైను విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పలు కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి ఆమోదం రావలసి ఉందని తెలిపారు. ఈ విషయంలో వెంటనే చొరవ తీసుకోవాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. క్లియరెన్స్ రావలసిన కేంద్ర మంత్రిత్వ శాఖలతో తాను మాట్లాడతానని తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నడుస్తున్న అన్ని రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వీటికి కావలసిన సమస్యలు ఏవైనా ఉంటే తన దృఎష్టికి తేవాలన్నారు. అవసరమైన శాఖల మంత్రులతో తాను మాట్లాడతానని, ప్రజల సౌకర్యాలను దృఎష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయాలని తెలిపారు

జగన్‌కు రాజీనామా లేఖ పంపిన ఆదిశేషగిరిరావు



విజయవాడ, మేజర్‌న్యూస్ః సినీ హీరో సూపర్ స్టార్ కృష్ణ సోదరుడు, నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరి రావు వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన వైసీపీ అధినేత జగన్‌కు రాజీనా మా లేఖ పంపారు. గుంటూరు జిల్లా తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆదిశేషగిరిరావు ఆశించారు. అయితే విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ అధినేత జగన్ సూచించారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి లోనైన ఆయన గత కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. చంద్రబాబుకు కూడా బంధువైన ఆదిశేషగిరిరావు టీడీపీలో చేరే అవకాశముందని భావిస్తున్నారు. సంక్రాంతి తర్వాత ఆదిశేషగిరిరావు కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ తరపున పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించి టీడీపీలో చేరడంపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

చంద్రబాబు స్టేల సీఎం



విశాఖపట్నం, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో చంద్రబాబు నియంతలా వ్యవహరిస్తూ, కేంద్ర దర్యాప్తు సంస్థలేవి రాష్ట్రానికి రాకుండా అడ్డుకుంటున్నారని వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్ నాథ్ మండిపడ్డారు. మంగళ వారమిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీబీఐ, ఈడీని అడ్డుకున్న చంద్రబాబు నాయుడు, ఇప్పుడు ఎన్ఐఏని కూడా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు ప్రతి కేసులోనూ స్టే తెచ్చుకుంటుండగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రం తన మీద పెట్టిన కేసులను ధైర్యంగా ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్టేల సీఎంగా బాబు పేరు మారుమోగిపోతుందంటూ ఎద్దేవా చేశారు. బాబు పాలనలో రాష్ట్రంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొన్నారు. టీడీపీ మంత్రులు, నాయకుల అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణకు వస్తే సహకరించరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టిసీమ, పోలవరం, రాజధాని భూముల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దోచుకున్న లక్షల కోట్ల అవినీతి సొమ్మును దాచుకునేందుకు బాబు కూడా విజయ్ మాల్యాలా దేశం విడిచి పారిపోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. అడ్రస్ లేని గంటా ఇప్పుడు ఇన్ని ఆస్తులు ఎలా సంపాదించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతిలో గంటాకు ఫస్ట్ ర్యాంక్ ఇవ్వాలన్నారు. సహచర మంత్రి అయ్యన్న ఆరోపణలకు గంటా ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై కాక దోచుకున్న ఆస్తులు దాచుకోవడానికి సీఎం పర్యటనలు చేస్తున్నారని అమర్‌నాథ్ మండిపడ్డారు.

మధ్యప్రదేశ్‌లో దారుణం.. ఆకలికి తట్టుకోలేక పురుగుల మందు తాగిన చిన్నారులు..

రత్లాం: ఆకలికి త ట్టుకోలే క చిన్నారులు పురుగుల మందు తాగిన ఘటన సంచలనం రేపుతోంది. డిసెంబర్ 31న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జాతీయ పిల్లల పరిరక్షణ సమితి ఘటనకు సంబంధించిన వివరాలను తెలియజేసింది. మధ్య ప్రదేశ్‌లోని రత్లాం జిల్లాలో కొందరు గిరిజ నులకు రేషన్ దుకాణాల నుంచి సరకులు అందడం లేదు. దీంతో ఆయా కుటుంబాలు ఆకలితోనే గడువుతున్నాయి. ఈ క్రమంలో ఆ కుటుంబాల్లోని చిన్నారులు ఆకలికి తట్టుకోలేక పురుగుల మందు తాగారు. వెంటనే చిన్నారులను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించినట్టు తెలుస్తోంది. వారి పరిస్థితి విషమం గా ఉన్న ట్టు సమాచా రం. స్థానిక మీడియా సంస్థల ద్వారా విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని జాతీయ పిల్లల పరిరక్షణ సమితి స్థానిక అధికారులను ఆదేశించింది.

జగన్మోహన యాత్ర!

పాదయాత్ర చేయడం సామాన్యమైన విషయం కాదు. దానికి పట్టుదల మాత్రం ఉంటే చాలదు. కృతనిశ్చయం, అంతకు మించిన దృఢ సంకల్పం తోడవ్వాలి. వీటన్నింటికీ మించి అదృశ్య శక్తి కూడా జత కలవాలి. వీటికి ప్రజాదరణ కూడా కలిసొస్తే చెప్పేందుకు మాటలు చాలవు. చూసేందుకు రెండు కళ్ళూ చాలవు. ఇది ఏ ఒక్కరి గురించో చెబుతున్నది కాదు. అద్వితీయమైన యాత్రల గురించి చెబుతున్నది. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అయిన ఎడుగూరి సందింటి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన యాత్ర ఇలాంటి సత్కార్యాన్నే బోధిస్తోంది. ప్రతి యాత్రకూ ఏదో ఒక ఉద్దేశం ఉంటుంది. జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రను ఆయన ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవడానికి చేపట్టారు. ప్రజల సమస్యలను అవగాహన చేసుకోవడానికి తలపెట్టారు. ప్రాంతాలవారీగా నెలకొన్న ఇబ్బందులను ఆకళింపు చేసుకోవడానికి నడుం కట్టారు. యస్ అందరూ అనుకుంటున్నట్లు ఆ యాత్ర పరమావధి అధికారమే కావచ్చు. 2012 అక్టోబర్ 2న వస్తున్నా మీకోసం పేరుతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 208 రోజుల పాటు అప్పటి ఉమ్మడి ఏపీలోని 13 రాష్ట్రాలలో పాదయాత్ర చేశారు. ఫలితం 2014 ఎన్నికలలో కనిపించింది. ఈ యాత్రలో ఆయన 2800కిమీ పైనే నడిచారు. 2012 అక్టోబర్ 18న వైయస్ఆర్ కుమార్తె షర్మిల ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ పాదయాత్ర చేశారు. 2013 జూలై 29 వరకూ ఇది సాగింది. 3112 కిలోమీటర్ల దూరాన్ని ఆమె నడిచారు. జగన్మోహన్ రెడ్డి జైలులో ఉన్న కారణంగా ఆయనకు సంఘీభావంగా ఆమె మరో ప్రజా ప్రస్థానం పేరిట దీనిని నిర్వహించారు. అంతకు ముందు 2003 మార్చి నెలలో భీకరమైన ఎండలలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి 1470కిలోమీటర్ల మేర ప్రజాప్రస్థానం పేరుతో పాదయాత్ర చేపట్టారు. 64 రోజుల పాటు ఇది సాగింది. ఒక్క ఉత్తరాంధ్రలోనే ఆయన 300 కిలోమీటర్లు నడిచారు. రాజమండ్రి సమీపంలో వైయస్‌కు వడదెబ్బ కొట్టింది. యాత్ర విరమించుకుంటే మంచిదని సూచించినప్పటికీ ఆయన వినలేదు. వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకుని తిరిగి యాత్రను కొనసాగించారు. దృఢసంకల్పానికి ప్రతీకగా వైయస్ యాత్ర మిగిలిపోయింది. ఆ యాత్రే కాంగ్రెస్ పార్టీని 2004లో తిరిగి అధికారంలోకి తెచ్చింది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి తండ్రి దృఢ సంకల్పాన్ని చాటుతూ పాదయాత్రను పూర్తిచేశారు. 341 రోజులపాటు ఆయన యాత్ర సాగింది. 3648 కిలోమీటర్ల దూరం ఆయన నడిచారు. ఇది ఏకబిగిన సాగిన యాత్ర కాదు. వివిధ కారణాల వల్ల వారానికి ఐదు రోజుల పాటు సాగింది. 2017 నవంబర్ 2న ఈ యాత్ర ఆరంభమైంది. పాదయాత్రను సంకల్ప సిద్ధికి ఆయుధంగా వాడిన తొలి వ్యక్తి మహాత్మా గాంధీ. దక్షిణాఫ్రికాలో బొగ్గు గనుల్లోని కార్మికులను ఒకటి చేసి, పాదయాత్ర చేశారు. 1930లో గాంధీ నిర్వహించిన దండి సత్యాగ్రహం కూడా పాదయాత్రే. 1950లో ఆచార్య వినోబా భావే భూదానోద్యమానికి దీన్ని ఆయుధంగా చేసుకున్నారు. 1983లో జనతా పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రాజకీయ లక్ష్యంతో కన్యాకుమారి నుంచి ఢిల్లీ వరకూ పాదయాత్ర చేపట్టారు. జనవరి 6న ప్రారంభమైన ఈ యాత్ర జూన్ 25న ముగిసింది. మొత్తం 4260కిలోమీటర్లు ఆయన నడిచారు. రాజ్‌ఘాట్‌లో బాపూజీకి శ్రద్ధాంజలి ఘటించి యాత్రను ముగించారు. ఆ సందర్భంలో చంద్రశేఖర్‌కు ఒనగూరిన రాజకీయ ప్రయోజనం ఏమీ లేదు. జయప్రకాశ్ నారాయణ్ దీనికి బాసటగా నిలిచారు. ప్రజలకు అవగాహన పెంపొందించడానికి సుందర్‌లాల్ బహుగుణ ఉత్తరాఖండ్‌లో పాదయాత్ర నిర్వహించారు. హరిత విప్లవానికి ఆయన సారధిగా వ్యవహరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హక్కులు సాధించుకోవడానికి ఏక్‌తా పరిషత్, స్వరాజ్ అభియాన్, తదితర సంస్థలు పాదయాత్రలను చేపట్టాయి. 1990లో బీజేపీ అధ్యక్షుడు ఎల్‌కె అద్వానీ 36రోజుల పాటు రామరథ యాత్రను చేపట్టారు. రామాలయ నిర్మాణం కోసం ఆ యాత్రను ఆయన ఉద్దేశించారు. ఆ యాత్ర దేశంపై విస్తృతమైన ప్రభావాన్ని చూపించింది. ఇలా చేపట్టిన ప్రతి యాత్ర వెనుక ఏదో ఒక ఉద్దేశం సంకల్పం ఉండనే ఉన్నాయి. ఒక్క చంద్రశేఖర్ మినహా మిగిలిన వారంతా ఫలితాలను రాబట్టారు. ఇక జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర జనసమ్మోహనంగా సాగింది. ఎక్కడికెళ్ళినా ఇసకేస్తే రాలనంత జనం హాజరై జననేతకు బ్రహ్మరథం పట్టారు. పార్టీ పెట్టిన దగ్గర్నుంచి ప్రజల్లోనూ ఉంటూ వస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. 2017లో ప్రారంభమైన జగన్ పాదయాత్ర ఏరకంగా చూసుకున్నా చారిత్రాత్మక యాత్రే. ప్రజా సంక్షేమం కోసం వైయస్ ఒకడుగు ముందుకేశారు..నేను రెండడుగులు ముందుకేస్తానంటూ జగన్ చెప్పిన మాటలు ప్రజలలో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలలో ఏళ్ళ తరబడి నిలిచే నాయకుడికి ప్రజలు బ్రహ్మరథం పడతారని చెప్పడానికి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రే ఒక నిదర్శనం. ఒకే కుటుంబం నుంచి కారణమేదైతేనేమి ముగ్గురు పాదయాత్ర చేసిన సందర్భం దాదాపుగా లేదు.

మంగపేట మండలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా వలస వచ్చిన గిరిజనేతరులు కోర్టు ద్వారా అడ్డుకుంటున్నారు. ఇది సామాజిక న్యాయానికి విరుద్ధం, ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదం. జయశంకర్ భూపాలపల్లి, మంగపేట మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం 90% ఆదివాసీ జనాభా గల మండలం. మంగపేట మండలం 5వ షెడ్యూల్డ్ ఆదివాసీ భూభాగంలోనిది. మంగపేట మండలంలో ప్రభుత్వ ఉద్యోగస్తులు ఏజెన్సీ అలవెన్స్‌లు తీసుకుంటూ ఆ మండలంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఆదివాసీ విద్యార్థులకు 144 జీవో ప్రకారం ఏజెన్సీ ధృవీకరణ పత్రాలు కూడా ఇస్తున్నారు. మంగపేట మండలం చారిత్రక నేపథ్యం కలిగి కాకతీయుల పాలనలో సంస్థానాలుగా ఉన్న మండలం. ఆదివాసీ పోరాట యోధులు సమ్మక్క సారక్కలు, పగిడిద్దరాజు జంపన్నలు కలియదిరిగిన నేల, కయ్యానికి కాలు దువ్విన నేల మంగపేట మండలం. నేడు ఆ ప్రాంతంలో ఆదివాసీలు కొన్ని వందల వేల సంవత్సరాలుగా అడవితో మమేకం అయి జీవిస్తున్న మండలం మంగపేట. అలాంటి ఈ ప్రాంతంలో నేడు ఆదివాసీల అస్థిత్వానికి పెను ప్రమాదం ఏర్పడింది. మంగపేట మండలంలో 2011 వరకు పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తరువాత గిరిజనేతరులు జరగకుండా కోర్టులలో కేసులు వేస్తూ ఆదివాసీల చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారు. మంగపేట మండలంలో ఇంత అప్రజాస్వామికంగా గిరిజనేతరులు ఆదివాసీల మనుగడను మట్టిలో కలుపుతుంటే ఈ రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు, విప్లవ పార్టీలు మంగపేట మండలం గురించి మాట్లాడకపోవడం చాలా దారుణం, మోసం. ఆదివాసీలపై సవతితల్లి ప్రేమను కురిపిస్తూ అభివృద్ధి ముసుగులో ఆదివాసీలను అంతం చేయాలని గిరిజనేతరులు కంకణం కట్టుకున్నారు. ఏజెన్సీలో గిరిజనేతర సామ్రాజ్యవాదం ఆదివాసీ సమాజంపై సవాల్ చే స్తున్నది. అందుకే నేడు ఏజెన్సీలో గిరిజనేతర రాజకీయ పార్టీలను బహిష్కరించాలని, నిషేధించాలని ఆదివాసీలు కోరుతున్నారు. మంగపేట మండలంలో అడవులను సంపూర్ణ అక్రమంగా బినామీ పేర్లతో నరికించి ఆ మండలాన్ని సంపూర్ణంగా మైదాన ప్రాంతంగా (ప్లేన్ ఏరియా) గా మార్చాలని, తద్వారా ఆదివాసీల చట్టాలనూ, జీవోలనూ నిర్వీర్యం చేసి, ఆ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపద, సహజ వనరులను అక్రమంగా దోచుకోవాలని కలలు గంటున్నారు. ఆ మంగపేట మండలంలో ఇంత అరాచకం రాజ్యమేలుతున్నా కూడా, గిరిజనేతరుల ఆధిపత్యం జరుగుతున్నా కూడా రాజకీయ యంత్రాంగం, అధికార యంత్రాంగం ఏమీ చేయలేక నిస్సహాయంగా చేతులు ఎత్తేస్తున్నది. ఐటిడిఎ కూడా పనికి రాకుండా పోతున్నాయి. మంగపేట మండలంలో స్థానిక పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రతిసారి అడ్డుపడుతున్న గిరిజనేతరులను ఆ ప్రాంతం నుండి తన్ని తరమాలని ఆదివాసీ సమాజం ఆరాటపడుతున్నది. గిరిజనేతరులతో రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తున్నది. మంకిడి బుచ్చయ్య ఆధ్వర్యంలో హైకోర్టులో కేసు వేయగా మంగపేటలో ఎన్నికలు జరపాలని తీర్పునిచ్చింది. గిరిజనేతరుల పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. అయినా కూడా గిరిజనేతరులు ఎన్నికలు నిస్పక్షపాతంగా ఎన్నికలు జరగకుండా కుట్రలు కుయుక్తులు పన్నుతున్నారు. పోయినసారి ఎన్నికలు జరిపినా కూడా ప్రమాణ స్వీకారం చేయించకుండా అడ్డుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మంగపేట మండలంలో పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా ఆదివాసీ సంఘాలు, ప్రభుత్వం చూడాలని ఆదివాసీలు కోరుతున్నారు. ఏజెన్సీలో గిరిజనేతరులు ఓటు హక్కు రద్దు చేయాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు.

– పూసె రామకృష్ణ దొర
ఆదివాసీ రచయితల సంఘం

మోడీ దౌత్యానికి జై!



అనితా సలూజా, న్యూఢిల్లీ

అనితర సాధ్యం

- **జపాన్-అమెరికా-ఇండియా కొత్త పుంతలు**
- **విదేశాంగానికి కొత్త ఊపు** ● **2017లో తొలి సమావేశం** ● **జైతో కొత్త శిఖరాలకు సంబంధాలు**
- **జపాన్‌తో భారత్‌లో అద్వితీయ అభివృద్ధి**



భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశాంగ వ్యవహారాలు నెరపడంలో కడు ప్రవీణులు. ఆయన దౌత్యం ఊహించిన విధంగానే కొంగ్రొత్త మలుపులు తీసుకుంటోంది. 2014లో ప్రధాన మంత్రి పదవి స్వీకరించిన దగ్గర్నుంచీ నాటకీయతను సంతరించుకుంది. అందులో ప్రధానమైనది త్రైపాక్షిక సమావేశం. అమెరికా అధ్యక్షు డు డోనాల్డ్ ట్రంప్, జపాన్ ప్రధాన మంత్రి షింజో అబే, మన ప్రధాని నరేంద్ర మోడీ మధ్య ఈ సమావేశం జరిగింది. అర్జెంటినా రాజధాని బ్యూనస్ ఏరిస్‌లో నిర్వహించిన జి-20 దేశాల సదస్సు సందర్భంగా ఈ త్రైపాక్షిక సమావేశం ఏర్పాటైంది. ఈ సమావేశాని మోడీ జై (జె-జపాన్, ఎ-అమెరికా, ఐ-ఇండియా) అనే సంక్షిప్తనామాన్ని ఇచ్చారు. జై అనే పదం భారత్‌లో గెలుపునకు సూచిక. 2017 సెప్టెంబర్‌లో విదేశాంగ మంత్రుల స్థాయిలో ఈ త్రైపాక్షిక సమావేశం ఏర్పాటైంది. మన విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ టిల్లర్‌సన్, జపాన్ విదేశాంగ మంత్రి కోనో న్యూయార్క్‌లో సమావేశమయ్యారు. సముద్ర సంబంధ రక్షణ, సంబంధాలు, విస్తరణ అంశాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. అంతకు ముందు అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, ఇండియా దేశాలు చతుర్ముఖ చర్చలు చేశాయి. ఇందులో అత్యున్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఇదే కీలకమైన పరిణామానికి మాతృక. త్రైపాక్షిక చర్చలు సాగిన జై సమావేశం దీనిని కొత్త శిఖరాలకు చేర్చింది. చతుర్ముఖ చర్చలు గానీ, జై సమావేశం గానీ ఒకే లక్ష్యంతో సాగాయి. అది చైనాను నిరోధించడం లేదా అడ్డుకట్టవేయడం. అమెరికా, దాని మిత్రుడు జపాన్ ఇదే పనిలో ఎప్పటి నుంచో ఉన్నాయి. వాటికి భారత్ తోడు అవసరమైంది. ఆసియాలో పెద్ద శక్తి అయిన భారత్ తమతో చేతులు కలపాలని కోరుకున్నారు. దక్షిణ ఆసియా, హిందూ మహాసముద్ర ప్రాంతంలోకి చొచ్చుకుని వస్తున్న చైనాను నిరోధించడానికి భారత్ భాగస్వామ్యం అత్యవసరమని ఆ రెండు దేశాలూ గుర్తించాయి. భారత్‌కు చైనా అతి పెద్ద పొరుగుదేశం. ఈ రెండు దేశాల మధ్య వివాదాలను అవి చర్చల ద్వారా పరిష్కరించుకోగలవు. రెండు దేశాలకూ గుర్తుంచుకోదగ్గ గతం ఉంది. వాటిని అవి పరస్పరం పంచుకోగలవు కూడా. యుగాల తరబడి ఈ రెండు దేశాల మధ్య సంబంధాలున్నాయి. స్నేహితులుగా ఎవరినైనా ఎంపిక చేసుకోగలం.. కానీ పొరుగువారిని కాదు అనేది ఒక సామెత. భారత్‌కు పొరుగున ఉన్న చైనా, పాకిస్థాన్‌లతో వివాదాలున్నాయి. వీటిని ఇతరులపై ఆధారపడకుండా ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవచ్చు. భారత్ స్థాయి దేశం సమస్యలకు వెరసి పారిపోకూడదు. ప్రతి దేశంతో సంబంధాలు నెరపాలి. ఆత్మవిశ్వాసంతో వాటిని ఎదుర్కోవాలి. అలీనోద్యమం సారాంశం ఇదే. చైనాతో భారత్‌కు సుదీర్ఘకాలంగా సరిహద్దు తగాదా ఉంది. దీనిని అత్యంత శీఘ్రంగా పరిష్కరించుకోవాల్సి ఉంది. వాస్తవ సరిహద్దు రేఖపై చర్చలను వాజపేయి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధుల స్థాయికి చేర్చింది. అదే సమయంలో పాకిస్థాన్‌ను చైనా, అమెరికా రెండూ సమర్థిస్తున్నాయి. ఈ సమస్యను చాకచక్యంగా పరిష్కరించుకోవాల్సి ఉంది. చైనాతో సంబంధాలను మెరుగుపరచుకోవడం ద్వారా పాకిస్థాన్‌ను అదుపులో ఉంచుకోగలడమే భారత్‌కు అత్యంత శ్రేష్టమైన మార్గం. చైనా దేశం పాకిస్థాన్‌కు అత్యంత సన్నిహితంగా మెలుగుతుండడమే దీనికి కారణం.

1971లో పాకిస్థాన్‌తో భారత్ యుద్ధ చేసిన సమయంలో అమెరికా-చైనా రెండూ ఆ దేశానికి మద్దతుగా నిలిచాయి. భారత్-రష్యా మధ్య పదేళ్ళ స్నేహం, సహకార ఒప్పందాన్ని సోవియట్ రష్యాతో కుదుర్చుకునేలా ఇదే అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని పురిగొల్పింది. ఆ సమయంలో సోవియట్ యూనియన్ పూర్తిస్థాయిలో భారత్‌కు బాసటగా నిలించింది. ఇది చైనా-అమెరికాలను వెనకడుగు వేసేలా చేసింది. 1971 యుద్ధం కారణంగా తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా అవతరించడానికి కారణమైంది. ఆ సమయంలో చైనా భారత్‌ను తీవ్రంగా విమర్శించడానికే పరిమితమైంది తప్ప, పాకిస్థాన్ తరపున యుద్ధంలో దిగడానికి సాహసించలేదు. అప్పటి నుంచి ఏళ్ళుగా వివిధ ప్రభుత్వాలు చైనాతో సంబంధాలను సాధారణ స్థాయికి తేవడానికి ప్రయత్నించాయి. 1988లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ చైనా పర్యటన ఒక మహత్తర ఘటనగా మిగిలింది. ఇరు దేశాల మధ్య సంబంధాల మెరుగుకు ఈ పర్యటన ఊపిరినిచ్చింది. 1993లో వాస్తవ సరిహద్దు రేఖ వెంబడి శాంతి, సామరస్యాలను నెలకొల్పేందుకు వీలుగా ఒప్పందంపై సంతకాలు చేశారు. రెండు దేశాల మధ్య పెరుగుతున్న ద్వైపాక్షిక సంబంధాలకు, స్థిరత్వానికీ ఈ ఒప్పందం సాక్ష్యంగా నిలిచింది. 2003లో ప్రధాని అటల్ బిహారీ వాజపేయి హయాంలో సంబంధాలు, సమీకృత సహకారం అంశాలపై అనుసరించాల్సిన సిద్ధాంతాలపై ఇండో-చైనా సంతకాలు చేశాయి. సరిహద్దు సమస్య రాజకీయ కోణం నుంచి పరిష్కరించడానికి వీలుగా ప్రత్యేక ప్రతినిధులను నియమించడానికీ ఈ అంగీకారం కుదిరింది. 2005లో చైనా ప్రధాన మంత్రి వెన్ జియబావో భారత్‌ను సందర్శించినపుడు రాజకీయ పరామితులు, పాటించాల్సిన సూత్రాలపై ద్వైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చైనాతో సంబంధాల మెరుగుకు చొరవతో కొన్ని చర్యలు తీసుకున్నారు. అహ్మదాబాద్ విచ్చేసిన చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌ను ఆహ్వానించడంతో పాటు, మోడీ కూడా చైనాలో పర్యటించారు. మోడీ చేపట్టిన ఈ చర్యలే చైనా-ఇండియా మధ్య రాజకీయంగా సన్నిహిత సంబంధాలు నెలకొనడానికి ఇతోధికంగా కృషి చేశాయి. సరిహద్దు వివాదం, చైనా రహదారి, ఎన్ఎస్‌జిలో భారత్‌కు సభ్యత్వం అంశాలలో పెరుగుతున్న విభేదాల నేపథ్యంలో దక్షిణాసియా, హిందూ మహాసముద్ర ప్రాంతాలలో చైనా ఉనికి వంటి అంశాలను పక్కన పెట్టి మోడీ చైనాలోని ఉహాన్‌కు వెళ్ళారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఉహాన్ సదస్సు సృష్టించిన అనుకూల పవనాలు జై త్రైపాక్షిక సమావేశంతో అననుకూల సంకేతాలు వెలువడ్డాయి. కానీ, ఈ పరిణామం తప్పించుకోలేనిది. ఇందిరా గాంధీ నేతృత్వంలో అమెరికాతో సంబంధాలను మెరుగుపరచుకునే ప్రక్రియ ప్రారంభమైంది. అనంతరం రాజీవ్ గాంధీ, పివి నరసింహారావు, అటల్ బిహారీ వాజపేయి, డాక్టర్ మన్మోహన్ సింగ్ దానిని కొనసాగించారు. ఇది పౌర అణు ఒప్పందాన్ని 2005లో సాధించుకునేలా చేసింది. ఒక గ్రూపులో లేకుండా కూడా దేశ ప్రయోజనాలను కాపాడుకోవడం ఎలాగో భారత్ చేసి చూపించింది. జపాన్‌తో సైతం భారత్‌కు తరాల తరబడి అనుబంధం ఉంది. స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీ ప్రతిపాదించిన అహింసా సిద్ధాంతాన్ని వ్యతిరేకించారు. జపాన్ మద్దతు తీసుకుని బ్రిటన్‌తో పోరాడారు. సాయుధ పోరాటంతోనే భారత్‌ను బ్రిటన్ శృంఖలాల నుంచి విముక్తం చేయగలదని భావించారు. 1943లో నేతాజీ తాత్కాలిక భారత ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటుచేశారు. దీనిని జపాన్, జర్మనీ, ఇటలీ, తదితర దేశాలు అధికారికంగా గుర్తించాయి. నేతాజీ ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఎన్ఐఎ)ని స్థాపించారు. దీనికి ఆజాద్ హింద్ ఫౌజ్ అనే పేరు కూడా ఉంది. 1944లో ఢిల్లీ చలో అనే నినాదంతో మిలటరీ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆర్మీ కోహిమా చేరింది. ఇంఫాల్‌ను స్వాధీనం చేసుకుంది. 1945లో హిరోషిమా, నాగసాకి పట్టణాలపై యునైటెడ్ నేషన్స్ మొట్టమొదటిసారి అణుబాంబులను ప్రయోగించింది. ఈ చర్యతో రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. జపాన్ అమెరికాకు దాసోహమంది. అప్పటి నుంచి ఏళ్ళ తరబడి జపాన్ అమెరికా ఛాయలోనే మెలిగింది. అమెరికాకు ఆప్తురాలిగా మారింది. ఆ సమయంలో సైతం భార-జపాన్ సంబంధాలు సజావుగానే ఉన్నాయి. ఆర్థిక భాగస్వామ్యం పరిఢవిల్లింది. జపాన్ పెట్టుబడులతో మౌలికరంగం అభివృద్ధి చెందింది. సుజుకీ మోటార్స్ సంస్థ పెట్టిన పెట్టుబడులు భారత ఆటోమొబైల్ రంగాన్ని ద్విగుణీకృతం చేశాయి. ఢిల్లీ మెట్రో వ్యవస్థ ఇరు దేశాల సహకారానికీ ప్రతీకగా నిలుస్తోంది. ప్రచ్ఛన్న యుద్ధానంతరం భారత్ తూర్పు దేశాల వైపు తన దృష్టిని మళ్ళించింది. ఆగ్నేయాసియా, జపాన్‌లపై భారత్ తన వైఖరిని పునర్నిర్వచించుకుంది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. జై త్రైపాక్షిక సదస్సుకు పూర్వం మోడీ కూడా భారత ప్రయోజనాలను కాపాడటం ఏ గ్రూపులోనూ చేరకుండానే సాధ్యమేనని నిరూపించారు. రష్యా-ఇండియా-చైనా(ఆర్ఐసి) త్రైపాక్షిక సదస్సు, షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఒ) గ్రూపులలో ప్రస్తుతం భారత్ సభ్యురాలు. ఈ రెండూ భారత్‌ను విదేశాంగ విధానానికి స్వతంత్ర ప్రతిపత్తిని చేకూర్చి పెట్టాయి. జై త్రైపాక్షిక, చతుర్ముఖ స్థాయి చర్చలు ఇంకా నవజాత స్థాయిలో ఉంది. ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉంది. ఈ గ్రూపులు చైనాతో దుష్పరిణామాలకు దారితీయకుండా భారత్ చూసుకోవాల్సి ఉండడం ప్రధానం.

ఆధిపత్య కులాలకు రిజర్వేషన్లు తగదు...

ఆధిపత్య కులాలు సామాజికంగాను, రాజకీయంగాను శక్తివంతంగా ఉన్నారు. వారికి ఆర్థిక వెనుకబాటు కారణంతో రిజర్వేషన్స్ అమలు చేయడం తగదు. ఇలాంటి చర్యల వలన సామాజికంగా, రాజకీయంగా, బలంగా ఉన్న ఆధిపత్య కులాలు తరతరాలుగా వివక్షకు, అణచివేతలకు గురవుతున్న వర్గాలను మరింత అణచివేతకు గురి చేస్తారు. ఈ రిజర్వేషన్లు ఒక ఉద్యోగాల కోసమే కాదు, అన్ని రకాల విద్య, ఉద్యోగ, రాజకీయ, వనరులు పంచుకోవడం లాంటి అన్నిటిలోనూ ఉంటుంది. ఆధిపత్య కులాలను రిజర్వేషన్ పరిధిలోకి తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆర్థిక కారణంతోనే సామాజిక వెనుకబాటుతనం లేకుండా రిజర్వేషన్లు పొందడం తగదు. పేదరికాన్ని రూపుమాపి ఆయా ఆధిపత్య కులాలకు చేయూతనివ్వాలనుకుంటే ప్రైవేటీకరణను తగ్గించాలి. విద్య, వైద్యం జాతీయం చేయడం ద్వారా ఉద్యోగాల కల్పన జరగాలి, విద్య, ఉపాధి, ఆహార భద్రత, గృహ సదుపాయం మొదలైన అంశాలలో ప్రభుత్వం ఉచితంగా తగిన సదుపాయాలు అందించాలి, తదనుగుణంగా సంక్షేమ పథకాలు రూపొందించాలి. ఈ విధంగా ఉన్నత కులాల పేదలకు, ఇతర పేదల అభివృద్ధికి పరిష్కారం చూపాలే గాని, అణగారిన వర్గాలు, అణిచివేతకు గురి కాబడిన వర్గాలు, బలహీన వర్గాలు వారి సామాజిక ప్రాతినిధ్యం కొరకు భరోసాగా ఇవ్వబడిన రిజర్వేషన్లను పేదరికం పేరుతో ఉన్నత కులాలకు కేటాయించడం తగదు. కేవలం ఆర్థిక కారణంతో ఉన్నత కులాలకు రిజర్వేషన్ పొందే అర్హత లేదు. ఇది కేంద్ర ప్రభుత్వం రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న తొందరపాటు నిర్ణయం. దీనిని తక్షణమే వెనక్కి తీసుకోవాలి.

–వాసిలి సురేష్
9494615360

అగ్రకులాలకు రిజర్వేషన్లెందుకు?



-ఆర్. కృష్ణయ్య, అధ్యక్షులు
జాతీయ బి.సి సంక్షేమ సంఘం

- **కేంద్ర నిర్ణయం రిజర్వేషన్ల సిద్ధాంతానికి వ్యతిరేకం**
- **జనాభాలో 20శాతం ఉండి 80శాతం పదవులు అనుభవిస్తున్నారు** ● **వారికి పదిశాతం కోటా ఎందుకు?**
- **రాజకీయ చతురత ప్రదర్శిస్తున్న కాషాయ పార్టీ**

అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం రిజర్వేషన్ల సిద్ధాంతానికి వ్యతిరేకం. రిజర్వేషన్లు పెట్టడానికి ప్రాతిపదిక సామాజిక వెనుకబాటుతనమే తప్ప ఆర్థిక ప్రతిపాదిక కాదు. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలనం పథకం కాదు. అగ్రకులాలకు రిజర్వేషన్లు పెట్టడం అనేది రాజ్యాంగ మౌలిక విలువలకు సూత్రాలకు విరుద్ధమైన అంశం. సామాజిక వివక్షతకు చిన్నచూపునకు గురవుతున్న కులాలకు అధికారం ద్వారా సామాజిక హోదా పెంచాలనే లక్ష్యంతో పెట్టిన రిజర్వేషన్లు నేడు రాజకీయ నాయకుల చేతిలో గురితప్పాయి. పవిత్ర ఆశయం దారి తప్పింది. రాజకీయ నాయకులకు ఓట్ల వర్షం కోసం వాడుకునే సాధనంగా దిగజారింది. బిజెపి జాతీయ పార్టీ తన మౌలిక విలువలకు తిలోదకాలు ఇచ్చి కాదేదీ ఓట్ల కనర్హం అంటూ రాజకీయ చతురత ప్రదర్శిస్తోంది. ఇది ఎదుగుతున్న సమాజానికి ఉండవలసిన లక్షణం కాదు. ఈ సున్నితమైన రిజర్వేషన్ల అంశాన్ని బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటుండడం నిర్వివాదమైన అంశం. ఎందుకంటే అసలు ఉద్యోగాల నియామకాలే లేవు. కేంద్రంలో 12 లక్షల ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్లు కల్పించడం లో ఉన్న హేతుబద్ధత ఏమిటి? ఇది పచ్చి మోసం. ఇంకోవైపు నుంచి చూస్తే ఇది రాజకీయ రిజర్వేషన్లు మౌలిక సిద్ధాంతం విరుద్ధమైన అంశం. అగ్రకులాలకు రిజర్వేషన్లు పెట్టడం వలన రిజర్వేషన్ల మౌలిక లక్ష్యాన్ని దెబ్బ తీయడమే కాక రిజర్వేషన్ల పరిధి విస్తరిస్తుంది. దీనివల్ల ప్రజలకు అన్యాయం జరుగుతుంది. దీనికి ఒక ప్రతిపాదిక అంటూ లేకుండా పోయింది. సమాజంలో అసంతృప్తికి గురవుతున్న వర్గాలకు ఏదో ఒక ఎర వేయడం ప్రభుత్వానికి ఉండవలసిన లక్షణం కాదు. సిద్ధాంతాల వాస్తవాల ప్రతిపాదిక కార్యక్రమాలు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీలకు రిజర్వేషన్లు పెట్టడానికి సిద్ధాంతపరమైన పునాది ఉంది. కుల వ్యవస్థతో ముడిపడి ఉన్న మన భారతీయ సమాజం లో మొదట కులాన్ని నిర్మూలించడానికి ఎలాంటి నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు జరగలేదు. కనీసం కులాల మధ్య ఉన్న అంతరాలు నిర్మూలించడానికి చర్యలు తీసుకోలేదు. మొదట కులం నిర్మూలించి ఆ తర్వాత కుల వ్యవస్థతో వచ్చిన అసమానతలను రూపుమాపి అందరికీ ప్రతిభ అభివృద్ధితో కూడిన సమాన అవకాశాలు కల్పించి అవసరమైన ఆర్థిక సామాజిక మార్పును తీసుకు రావడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 71 సంవత్సరాల కాలంలో ఘోరంగా విఫలమయ్యాయి. గత 71 సంవత్సరాలుగా 20 శాతం జనాభా ఉన్న అగ్రకులాలవారు 80 శాతం ఉన్నత పదవులు పొందారు దేశంలో ఇంతవరకు అయిన ప్రధానమంత్రులు ఒక నరేంద్రమోడీ మినహా, మిగతా 28 మంది ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, చైర్మన్ లు అన్ని పదవులు అగ్రకులాల వారే పొందారు. ఆస్తులు, సంపద కూడా అగ్రకులాల ఆధీనంలో ఉన్నాయి. అధికారం చట్రంలో 80% ఉన్నత పదవులు అగ్రకులాల వారే పొందారు. 20 శాతం జనాభా ఉండి 80 శాతం పదవులు పొందుతున్న అగ్ర కులాల వారికి ఇంకా రిజర్వేషన్లు ఇవ్వడం ఏమిటి. ఇది చరిత్రను వక్రీకరించడమే, నిజాన్ని నిలువునా పాతి పెట్టడమే అవుతుంది. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదు. విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెట్టడానికి రెండు సిద్ధాంత ప్రతిపాదకలు ఉన్నాయి. మొదటిది ప్రజాస్వామ్యంలో ప్రతి కులానికి, ప్రతి వర్గానికీ ఈ సమాజాన్ని నడపడంలో ముఖ్యంగా ప్రభుత్వ పాలనలో, అధికారంలో ఆయా కులాల జనాభా ప్రకారం వాటా ఇచ్చి భాగస్వామ్యం కల్పించడం. ఇక రెండవది పేద కులాలకు సాంఘిక వివక్షతకు గురవుతున్న కులాలకు వివక్షత తొలగించాలంటే అధికారంలో వాటా ఇచ్చి ఈ కులాల సామాజిక గౌరవం పెంచడం, ఆత్మవిశ్వాసం కలిగించడం. ఈ రెండు ప్రతిపాదికల్లో రిజర్వేషన్ లో పెట్టారు తప్ప ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి రిజర్వేషన్లు పెట్టలేదు. రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదు. పేదకులాల అభివృద్ధికి ఆర్థికపరమైన పథకాలు సరిపోతాయి. ఆత్మగౌరవం, సామాజిక హోదా పెంచడానికి అధికారం కావాలి. అధికారం రావాలంటే ఉన్నత ఉద్యోగాలు రాజకీయ పదవుల ద్వారా మాత్రమే సిద్ధిస్తుంది. ఆర్థికంగా అభివృద్ధి చేయాలంటే అనేక స్కీములు ప్యాకేజీలు మంజూరు చేయవచ్చు. ప్రభుత్వం పరంగా లభించే అనేక పథకాలను అగ్ర కులాలకు ఇస్తున్నారు. స్కాలర్ షిప్ లు, ఫీజు రియంబర్స్మెంట్ హాస్టల్ అడ్మిషన్లు. రుణాల మంజూరు. బలహీనవర్గాల గృహ నిర్మాణ పథకం, స్వయం ఉపాధి పథకాలు తదితర పథకాలను మంజూరు చేస్తున్నారు. దానిని ఎవరు వ్యతిరేకించడం లేదు. రిజర్వేషన్లలో కులాలకు వాటా పోరాటమే తప్ప – అభివృద్ధి కోసం కాదు. నల్లజాతికి చెందిన అమెరికా అధ్యక్షుడిగా ఒబామా ఎంపికైతే నల్ల జాతి గౌరవం ఆత్మవిశ్వాసం పెరిగింది. బీసీ కులాల్లో దళిత కులాల ఈ వర్గాలకు చెందిన వారు ఉన్నత పదవులలో ఉంటే ఆ కులాలలో ఆత్మగౌరవం పెరుగుతుంది. రిజర్వేషన్ల లక్ష్యం ఏమిటి కులాన్ని– కుల వివక్షతను, సాంఘిక అసమానతలను ఆర్థిక కోణంలో చూడరాదు. సామాజిక వివక్షత వేరు. – ఆర్థికంగా వెనుకబడి ఉండడం వేరు. ఒక బీసీ కులం వారు ఆర్థికంగా ఉన్న సామాజికంగా గౌరవం ఉండదు. ఈ రిజర్వేషన్లను కుల వివక్షత తొలగించి సాంఘిక సమానత్వం సాధించడానికి పెట్టారే తప్ప ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కాదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఆర్థికంగా బలపడడం వేరు. సామాజిక సమానత్వం సాధించడం వేరు. ఆర్థికంగా ఎదిగిన వారు సామాజికంగా ఎదగక పోవచ్చు. విద్యా. ఉద్యోగ రంగాలలో ఎదిగిన కుటుంబాల వారు సామాజికంగా అభివృద్ధి చెందుతారు. సామాజిక వికాసం అధికారులతో ముడిపడి ఉంది. రిజర్వేషన్లు కల్పించడం వెనుకగల ఉద్దేశం ఈ వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కాదు. ఈ కులాలకు ప్రభుత్వ పరిపాలనలో భాగస్వామ్యం కల్పించి అధికారంలో వాటా ఇవ్వాలనేది ప్రధాన ఉద్దేశం. ఈ పేద కులాలకు అధికారంలో వాటా కల్పిస్తే ఈ హోదా ద్వారా ఈ కులాల గౌరవం పెరిగి సాంఘిక వివక్షత చూపడానికి అవకాశం కలుగుతుందనేది ప్రధాన ఆశయం. రిజర్వేషన్ల ద్వారా చదువుకుంటారు. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు వస్తాయి. ఉద్యోగాల ద్వారా అధికారం లభిస్తుంది. అధికారం ద్వారా సాంఘిక హోదా పెరుగుతుంది. సాంఘిక వివక్షత, సాంఘిక అసమానతలు తొలగిపోతాయి. ఈ కులాల గౌరవం పెరుగుతుంది. ఇది రిజర్వేషన్ల సిద్ధాంత ప్రాతిపదిక. అందుకే రిజర్వేషన్లు పెట్టారు తప్ప ఆర్థికగా అభివృద్ధి చేయడానికి కాదు. దీనిని అగ్రకులాలు అర్థం చేసుకోవాలి. అంటరాని కులాలకు అస్పృశ్యతకు గురవుతున్న కులాలకు సామాజిక హోదా, గౌరవం పెంచడానికి ఆయా రంగాలలో ప్రాతినిత్యం పెంచాలి. ఈ వర్గాలకు అధికారంలో వాటా ఇవ్వాలి. రిజర్వేషన్ల ద్వారా ఉన్నత స్థాయి ఉద్యోగాలలో చేరితే ఈ వర్గాలకు చెందిన వారి సాంఘిక హోదా పెరుగుతుంది. మన సమాజంలో ఒక వ్యక్తిని తక్కువ కులం వారనే తక్కువ దృష్టి తో చూస్తారే తప్ప ఆర్థిక ప్రాతిపదికగా చూడరు. బి.సి కులాల్లోని చాకలి, మంగలి, వడ్డెర, కురుమ, బుడుబుక్కల, దాసరి, మేదరి, గొల్ల, కుమ్మరి తదితర కులాలవారినీ, ఎస్సి లోని మాల, మాదిగా తదితర కులాల్లో ఎవరైనా ధవంతులు, భూస్వాములు ఉన్న వారిని సమాజం అంటరాని వారిగానే తక్కువ చూపుచూస్తారు. వారికీ సాంఘిక హోదా, గౌరవం ఇవ్వరు. అదే అగ్రకులాలో పేదవారు ఉన్న వారికి దొర, పటేల్, పంతులు అంటూ గౌరవంగా పిలుస్తారు. గ్రామాలలో గౌరవంగా చూస్తారు. ఒక వ్యక్తికి సమాజంలో లభించే గౌరవం ఆర్థిక స్థితిని బట్టి కాక కులాన్ని బట్టి గౌరవించే సంప్రదాయం రెండు వేల సంవత్సరాలుగా మన దేశంలో కొనసాగుతుంది. ఈ వ్యత్యాసాలు పోవాలంటే పేదల కులాలకు అధికారం హోదా పదవులు చదువు కావాలి. అధికార పదవుల ద్వారా అధికారంలోకి వస్తే పేద కులాల సాంఘిక హోదా పెరుగుతుంది. దళిత , బి.సి కులాల వారు ఉన్నత ఉద్యోగాలలో చేరినపుడు మాత్రమే వారి సామాజిక హోదా పెరుగుతుంది. ఉదాహరణకు రిజర్వేషన్ల నుండి వచ్చిన ఎస్సీ ఎస్టీ బీసీ కులాల వారు ఒక కలెక్టర్ గానో, డిప్యూటీ కలెక్టర్ గానో, ఒక ప్రొఫెసర్ గానో ఉన్నత ఉద్యోగాలలో ఎంపికైన అప్పుడు వారికి సమాజంలో అగ్ర కులాల వారితో సమానంగా సభలో కూర్చుండ బెడతారు. గౌరవం ఇస్తారు. అదే ఆస్తిపరుడు ధనవంతుడు ఎవరైనా ఎస్సీ/ఎస్టీ /బీసీ కులాలలో ఉన్నవారికి గౌరవం హోదా ఇవ్వరు. అధికారానికి సాంఘిక హోదాకు అవినాభావ సంబంధం ఉంది పేద కులాల సాంఘిక హోదా గౌరవం పెరగాలంటే ఉన్నత ఉద్యోగం చేయాలి. ఉన్నత ఉద్యోగాలలో చేరాలంటే రిజర్వేషన్లు కావాలి. అందుకే పేద కులాల వారికి రిజర్వేషన్లు పెట్టారు. పైగా మన సమాజంలో ఆర్థిక స్థితి శాశ్వతం కాదు. కులం శాశ్వతం. ఈరోజు పేదవాడు రేపు కోటీశ్వరుడు కావచ్చు, అలాగే కోటీశ్వరుడు బిచ్చగాడు కావచ్చు. కానీ తక్కువ కులం వారు అగ్రకులం వారు కారు. అగ్రకులం వారు తక్కువగా మారరు. ఇది ఒక వాస్తవికమైన, సామాజిక విధానం ఘనీభవించిన సత్యం.

(తరువాయి రేపటి సంచికలో)



ఎల్‌జీ నుంచి ఫోల్డింగ్ టీవీ

లాస్‌వెగాస్: ఇటీవలే ఫోల్డింగ్ స్మార్ట్ ఫోన్ మార్కెట్‌కు వచ్చింది. ఇప్పుడు ఏకంగా ఫోల్డింగ్ టీవీ రానుంది. ప్రముఖ ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి సంస్థ ఎల్‌జీ 65 అంగుళాల(165 సెంటీమీటర్) 4కే సిగ్నేచర్ ఓఎల్‌డీ టీవీని రూపొందించింది. నెవడాలోని లాస్‌వెగాస్‌లో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వినియోగదారుల ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్రదర్శనలో కంపెనీ దీన్ని ఉంచింది. ఈ ఏడాది దీన్ని మార్కెట్‌లోకి తేనున్నట్లు ప్రకటించింది. దీనికి రోల్-అప్ మోడల్ కొత్త ఓఎల్‌ఈడీగా చెవుతోంది. ఈ టీవీని ఈజీగా ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్లడంతోపాటు అవసరం లేనప్పుడు చుట్టచుట్టి పెట్టేయవచ్చు.

ఈ టీవీ కోసం 65 అంగుళాల తెరను ఎల్‌జీ రూపొందించింది. గూగుల్ అసిస్టెంట్, అమెజాన్ అలెక్సా వర్చువల్ అసిస్టెంట్, యాపిల్ ఎయిర్ ప్లే సపోర్టు తోపాటు 100 వాట్స్ డాల్బీ అట్మాస్ స్పీకర్ ఈ టీవీ ప్రత్యేకత అని సీనియర్ డైరెక్టర్ టిమ్ అలెస్సీ చెప్పారు. అలాగే తన మొట్టమొదటి సూపర్-హై-డెఫినేషన్ 88 అంగుళాల 8కె ఓఎల్‌ఈడీ టీవీని కూడా కంపెనీ ఆవిష్కరిస్తుండడం విశేషం. ఎల్జీ కంపెనీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ వందర్ వాల్ మాట్లాడుతూ దశాబ్దాల క్రితం నుంచి ఎదురుచూస్తున్న ఈ టెక్నాలజీ వాస్తవ రూపం దాల్చిందని చెప్పారు. కాకుంటే ఈ టీవీ ధరను మాత్రం కంపెనీ గోప్యంగా ఉంచడం విశేషం.

బిజినెస్


8-1-2019 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	36,198.13
గరిష్ఠం	36,236.70
కనిష్ఠం	35,734.01
ముగింపు	**35,980.93**
మార్పు (పా)	130.77
మార్పు (శా)	0.36

&

నిఫ్టీ	
ఆరంభం	10,786.25
గరిష్ఠం	10,815.30
కనిష్ఠం	10,746.25
ముగింపు	**10,802.15**
మార్పు (పా)	30.35
మార్పు (శా)	0.28

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	11,294.31	+36.85	+0.33
S&P BSE SENSEX Next 50	32,620.18	+40.24	+0.12
S&P BSE 100	11,081.36	+32.96	+0.30
S&P BSE Bharat 22 Index	3,484.52	+16.18	+0.47

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
HFCL	23.90	+2.65	+12.47
SREINFRA	35.50	+2.40	+7.25
ASHOKA	135.55	+8.90	+7.03
HDIL	28.75	+1.55	+5.70
SYNDIBANK	41.70	+1.95	+4.91

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
GRUH	256.00	-50.20	-16.39
TATASTEELPP	66.15	-7.30	-9.94
HCC	12.83	-0.54	-4.04
HAVELLS	671.05	-22.90	-3.30
NAVKARCORP	51.40	-1.65	-3.11

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
BAJFINANCE	2535.05	93.43	368431
YESBANK	192.30	72.36	3799139
RELIANCE	1103.95	56.58	513616
AXISBANK	650.90	56.14	875149
COLPAL	1308.90	51.07	392344

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	**69.4814**	యూరో	**79.3890**
యన్	**64.21**	పౌండ్	**88.5943**

స్తంభించిన బ్యాంకింగ్, రవాణా

దేశవ్యాప్తంగా భారత్ బంద్ - తొలిరోజు ప్రభావం పాక్షికం

- కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త ఘటనలు
- బస్సులపై రాళ్లు రువ్విన నిరసనకారులు
- రోడ్లపై బైఠాయించి నినాదాలు
- కర్ణాటకలో అంగన్‌వాడీ కార్యకర్త మృతి
- పుదుచ్చేరితో తమిళనాడు బస్సులపై రాళ్లు
- పలు ప్రాంతాల్లో ఆగిన రైలు సర్వీసులు
- నరేంద్ర మోడీ దిష్టిబొమ్మల దగ్ధం
- త్రిపురలో నామమాత్రంగా బంద్ ప్రభావం

హైదరాబాద్ / న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన 48 గంటల సమ్మెతో దేశవ్యాప్తంగా రవాణా, బ్యాంకింగ్ రంగాలు స్తంభించాయి. సమ్మె కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సమ్మెకు కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాలు మద్దతు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ర్యాలీ, రాస్తారోకోలు, ధర్నాలు జరుగుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో విద్యా సంస్థలు మూతపడ్డాయి. సమ్మె ప్రభావం తెలుగు రాష్ట్రాలపై కూడా పడింది. కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు భారీ ఎత్తున నిరసన ర్యాలీలు జరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నాలు నిర్వహించాయి. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఆందోళనలు మిన్నంటాయి. కార్మిక సంఘాల ఆందోళనలకు పలు రాజకీయ పార్టీలు సంఘీభావం తెలిపాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కేరళలో కార్మిక సంఘాలు రోడ్డెక్కడంతో ప్రజాజీవనం స్తంభించింది. ఒడిశాలోనూ రవాణా వ్యవస్థ స్తంభించింది.



కాగా, కనీస వేతనాలు, సామాజిక భద్రతా పథకాల అమలు చేయాలన్న డిమాండ్‌తో పాటు ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతి రేకంగా కేంద్ర ట్రేడ్ యూనియన్లు దేశవ్యాప్తంగా ఇచ్చిన 48 గంటల బంద్ పిలుపుతో మంగళవారం నాడు పలు రాష్ట్రాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. రైళ్ల రాకపోకలను అడ్డుకోవడం, హైవేల దిగ్బంధం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. బస్సులపై రాళ్లు రువ్వడం వంటి హింసాత్మక ఘటనలు కూడా అక్కడక్కడా చోటుచేసుకున్నారు. కర్ణాటకలోని ముందగొడి టౌన్‌లో బంద్ సందర్భంగా 57 ఏళ్ల అంగన్‌వాడీ కార్యకర్త అక్కడికక్కడే కుప్పకూలి కన్నుమూసింది. మహారాష్ట్ర లోని పాల్ఘర్‌లో ముంబై- బరోడా -జైపూర్-ఢిల్లీ జాతీయ రహదారిని బంద్ మద్దతుదారులు దిగ్బంధించారు. వుదు చ్చేరిలో తమిళనాడు స్టేట్ బస్సుపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. తిరువనంతపురం, త్రివునితుర, షోరనూర్ రైల్వే స్టేషన్లలో రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు.

పశ్చిమబెంగాల్‌లో వాహనాలను అడ్డుకునేందుకు రోడ్లపై టైర్లను తగులబెట్టారు. గోవా రాజధాని పనజీలో వేలాది మంది కార్మికులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. అయితే జనజీవనంపై బంద్ ప్రభావం పెద్దగా కని పించలేదు. కేరళలో రైళ్ల రాకపోకల్లో జాప్యం తలెత్తినా శబరిమల భక్తులు ఇబ్బంది పడకుండా కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ వివిధ ప్రాంతాల నుంచి పంబకు బస్సులు నడిపింది. త్రివురలో బంద్‌కు పాక్షిక స్పందన లభించింది. రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు యథావిధిగా తిరిగారు. దుకాణాలు, మార్కెట్లు మూసేశారు.

డిజిటల్ చెల్లింపుల దర్యాప్తు కమిటీ

చైర్మన్‌గా నందన్ నిలేకని


- నిర్ణయం వెలువరించిన రిజర్వ్ బ్యాంక్
- డిజిటల్ పేమెంట్ల క్రమబద్ధీకరణే లక్ష్యం
- పీఆర్‌బీని ఏర్పాటు చేయనున్న ఆర్‌బీఐ
- కమిటీలో ఆర్‌బీఐకి సంబంధం లేనివారికి స్థానం

ముంబై: దేశంలో డిజిటల్ చెల్లింవులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ఆర్బీఐ పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నాయి. నోట్ల రద్దు నేపథ్యంలో ప్రజల్లో నగదు వాడకాన్ని తగ్గించేందుకు చాలాకాలంగా డిజిటల్ చెల్లింవులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. డిజిటల్ వాలెట్లు, మొబైల్ బ్యాంకింగ్ సహా పలు రకాలుగా డిజిటల్ చెల్లింవులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ఆర్బీఐ చొరవ చూవుతున్నాయి. భారతదేశంలో డిజిటల్ చెల్లింవులను దర్యాప్తు చేసే కమిటీకి చైర్మన్‌గా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నియమితులయ్యారు. భారతీయ రిజర్వు బ్యాంకు ఆయనను ఈ పదవిలో మంగళవారం నియమించింది. డిజిటల్ పేమెంట్లను క్రమబద్ధీకరించేందుకు స్వతంత్ర చెల్లింవుల నియంత్రణ మండలి (పీఆర్‌బీ)ని ఏర్పాటు చేయాలని అంతర్ మంత్రిత్వ శాఖల కమిటీ సిఫారసు చేయడంతో ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీకి ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి రతన్ వటల్ నేతృత్వం వహిస్తున్నారు. పీఆర్‌బీ సభ్యుల్లో అత్యధికులను ఆర్బీఐకి సంబంధం లేనివారిని నియమించాలని, వీరిని కేంద్ర ప్రభుత్వం నియమించాలని కమిటీ సిఫారసు చేసింది. ఇదిలావుండగా పీఆర్‌బీ తప్పనిసరిగా ఆర్బీఐ పరిధిలోనే ఉండాలని, ఆర్బీఐ గవర్నర్ నేతృత్వం వహించాలని ఆర్బీఐ పేర్కొంది. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. కాగా, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నిలేకని యూపీఏ హయాంలో ఆధార్ అమలును పర్యవేక్షించే యూఐడీఏఐకి చైర్మన్‌గా వ్యవహరించారు.



ఐఎంఎఫ్ ముఖ్య ఆర్థికవేత్తగా తొలి మహిళ బాధ్యతలు స్వీకరించిన గీతా గోపీనాథ్

- హార్వర్డ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గీత
- గీత నియామకంపై ఐఎంఎఫ్ చీఫ్ లగార్డే హర్షం
- గౌరవంగా భావిస్తున్నానన్న గీతా



వాషింగ్టన్: అమెరికాలోని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో చీఫ్ ఎకనమిస్ట్ పదవిని తొలిసారి ఓ మహిళ అలంకరించారు. భారత్ లోని తమిళనాడుకు చెందిన గీతా గోపీనాథ్ ఐఎంఎఫ్‌లో చీఫ్ ఎకనమిస్ట్ పదవిని చేపట్టి రికార్డు సృష్టించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో గీత ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గీతా గోపీనాథ్‌ను ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్‌గా నియమించుకుంటామని గతేడాది అక్టోబరు 1నే ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీన్ లగార్డే ప్రకటించారు. గీత ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో ఒకరని ప్రశంసించారు. ఆమె నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. గీతా గోపీనాథ్ ఐఎంఎఫ్‌కు 11వ చీఫ్ ఎకనమిస్ట్. ఈ సందర్భంగా గీత స్పందిస్తూ, తనకు ఈ పదవి దక్కడం చాలా అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రపంచీకరణ నుంచి వెనక్కి తగ్గడం, సుంకాలు పెంవు పెద్ద సవాళ్లుగా మారాయని, బహుళజాతి సంస్థలకు ఇబ్బందులు పెరిగాయని గీత అభిప్రాయపడ్డారు.

హీరో మోటోస్పోర్ట్స్ టీమ్ ర్యాలీకి సన్నాహాలు



న్యూఢిల్లీ: ప్రముఖ హీరో సంస్థ తన హీరో మోటోస్పోర్ట్స్ టీమ్ ర్యాలీ డాకర్ 2019 తొలి దశకు సన్నాహాలు చేస్తోంది. ఇది 243 కిలోమీటర్ల పొడవున సాగనుంది. కాగా ఇండియన్ ఏస్ రైడర్ సీఎస్ సంతోష్ తన ఫిఫ్త్ డాకర్ అవుటింగ్‌లో మంచి ముగింపునిచ్చి 20వ స్థానంలో నిలిచాడు. అతని తరువాతి స్థానంలో లోవాకిమ్ రోడ్రిగూస్ నిలిచారు. అతను అత్యంత సురక్షితంగా ఫినిషింగ్ స్టేజ్‌ను అధిగమించారు. ఓరియల్ మెనా చివరి స్థానం దక్కించుకున్నారు. ఇప్పుడు వీరంతా డాకర్ తదుపరి స్టేజ్ కోసం సిద్ధమవుతున్నారు.

220 కేవీ లైన్ల పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సన్నాహాలు

హైదరాబాద్: నగరంలోని 220 కేవీ లైన్లకు ఉన్న కండక్టర్ల స్థానంలో హై ఆంపాసిటీ హెచ్‌టీఎల్ఎస్ కండక్టర్లను అమర్చనున్నది. దీంతో ఈ లైనల్లో ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యం రెట్టింపు అవుతుంది. ఈ మార్పులను 220 కేవీ మామిడిపల్లి-శివరాం పల్లి లైన్, 220 కేవీ హైల్ మామిడిపల్లి- 1 లైన్, 220 కేవీ హైల్ శివరామపల్లి లైన్, 220 కేవీ హైల్ మామిడిపల్లి-2 లైన్లలో చేపట్టనుంది. ఈ లైన్లలో పనులు పూర్తయ్యాక వీటిమీద ఏర్పడే లోడ్ సమీపంలోని ట్రాన్స్ ఫారాలకు మళ్లింపు జరుగుతుంది. ఇందుకోసం ట్రాన్స్‌కో, టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నాయి.

TSTRANSCO

బేంబో రీసెర్చ్‌తో ఐటీసీ భాగస్వామ్యం



న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీసీ సంస్థ అగరబత్తీల వ్యాపారంలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో తాజాగా దేశానికి చెందిన ప్రీమియర్ బేంబో రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్(బీఆర్‌టీసీ)తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా బీఆర్‌టీసీ... ఐటీసీ కోరిన విధంగా ప్యాకేజింగ్‌కు సహకారం అందించనుంది. ఈ ఇరు సంస్థల మధ్య కుదిరి భాగస్వామ్య ఒప్పందం మహారాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సుధీర్ మంగన్‌తివార్ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఐటీసీ అగరబత్తీస్, మాచెస్ బిజినెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రవి రాయవరం మాట్లాడుతూ మంగళ్ దీప్ అగరబత్తీల ఉత్పత్తితో వేల మందికి ఉపాధి దొరుకుతున్నదన్నారు.

అమెజాన్ అలెక్సాలో రియల్ ఎస్టేట్ సమాచారం

న్యూఢిల్లీ: సింగపూర్‌కు చెందిన డిజిటల్ రియల్ ఎస్టేట్ కంపెనీ ఎలెరా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, హౌసింగ్ డాట్ కామ్, ప్రాప్ టైగర్ డాట్ కామ్, మకాన్ డాట్ కామ్ రియల్ ఎస్టేట్ సమాచారాన్ని అందించేందుకు అమెజాన్ అలెక్సాను వేదికగా ఎంచుకున్నాయి. ఈ నూతన వేదికతో ఇకపై వినియోగదారులు అత్యంత సులభంగా హౌసింగ్ న్యూస్, ప్రాప్ గైడ్, మకాన్ ఐక్యూ రెస్పెక్టివిటీ మొదలైన సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఈ సందర్భంగా సీపీటీవో గ్రూప్ ప్రతినిధి రవి భూషన్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఎప్పటికప్పుడు వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తుంటామని అన్నారు.

amazon alexa

యూసీ బ్రౌజర్ నుంచి వియ్ షేర్ ఛానల్



న్యూఢిల్లీ: యూసి బ్రౌజర్ తాజాగా ఆవిష్కరించిన వియ్ షేర్ ఛనల్‌లో క్రికెట్ లెజెండ్స్ వీరేంద్ర సెహ్వాగ్, మైఖేల్ క్లార్క్ అభిమానులతో తమ అనుభవాలను పంచుకున్నారు. వరల్డ్ నంబర్ వన్ థర్డ్ పార్టీ మొబైల్ బ్రౌజర్‌గా పేరొందిన యూసీ బ్రౌజర్ క్రీడాభిమానులకు కొత్త అనుభూతులను అందించేందుకు నూతన కంటెంట్ ప్రొవైడర్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా వినియోగదారులు షార్ట్ వీడియోలను, గిఫ్‌లను చూసి ఆనందించవచ్చు. ఈ సందర్భంగా అలీబాబా డిజటల్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్రూప్, యూసీ బ్రౌజర్ ఇండియా, ఇండోనేషియా జనరల్ మేనేజర్ దమాన్ క్సి మాట్లాడుతూ యూసీ బ్రౌజర్ వినియోగదారులకు నాణ్యమైన కంటెంట్‌ను అందించేందుకు ప్రాధాన్యతనిస్తుందని అన్నారు.

అలియా భట్‌తో ఉబెర్ ఈట్స్ ప్రచారం



ముంబై: ప్రపచంలోనే అత్యధిక నెట్‌వర్క్ కలిగిన ఉబెర్ ఈట్స్ తన బ్రాండ్ అంబాసిడర్ అయిన బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్‌తో సరికొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఎవ్విడి డే మూమెంట్ పేరుతో దీనిని ప్రారంభించింది. ఈ సందర్భంగా ఉబెర్ ఈట్స్ ఇండియా బ్రాండ్ హెడ్ నమితా కత్రే మాట్లాడుతూ భారత్‌లో యువత ఆధునిక జీవనశైలిలో ఇంటికి ఫుడ్ ఆర్డర్ చేయడం అవసరంగా మారిపోయింది. ఇందుకోసమే ఎవ్విరిడే మూమెంట్స్ పేరిట వినూత్న పచారాన్ని నిర్వహిస్తున్నాం. ఆహార ప్రియుల అభిరుచులకు అనుగుణంగా,అత్యంత వేగంగా వారికి ఫుడ్ డెలివరీ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

విక్రయాలను పెంచుకున్న జాగ్వార్ ల్యాండ్ రోవర్



ముంబై: ప్రముఖ జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా గత ఏడాడి జనవరి నుంచి డిసెంబరు మధ్యకాలంలో వాహన విక్రయాల్లో 16 శాతం అభివృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది. మొత్తం 4,596 యూనిట్లను విక్రయించింది. ఇంతవరకూ జాగ్వార్ ల్యాండ్ రోవర్ విక్రయాల్లో ఇదే రికార్డుగా నమోదైంది. ఈ సందర్భంగా జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా లిమిటెడ్(జేఎల్ఆర్ఐఎల్) మేనేజింగ్ డైరెక్టర్. ప్రెసిడెంట్ రోహిత్ సూరి మాట్లాడుతూ గత 2018వ సంవత్సరంలో ఆటో ఇండస్ట్రీ అత్యధిక ఒడిదుడుకులను ఎదుర్కొంది. అయినప్పటిక జాగ్వార్ ల్యాండ్ రోవర్ వాహనాలు అత్యధిక స్థాయిలో విక్రయమయ్యాయన్నారు.

రైలులో గుజరాత్ బీజేపీ నేత దారుణ హత్య!

అహ్మదాబాద్: గుజరాత్ కు చెందిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే జయంతీలాల్ భానుషలీ రైలులో ప్రయాణిస్తున్న వేళ దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఆయన్ను అతి సమీపం నుంచి తుపాకితో కాల్చి చంపారు. భుజ్ నుంచి అహ్మదాబాద్ వరకూ ప్రయాణించే 'సజయా నగరీ ఎక్స్ ప్రెస్'లో ఈ ఘటన గత రాత్ర జరిగింది. గతంలో గుజరాత్ రాష్ట్ర బీజేపీ వైస్ ప్రెసిడెంట్ గా, అబుదాస ఎమ్మెల్యేగా పనిచేసిన జయంతీలాల్ పై అత్యాచార ఆరోపణలు రాగా, తన పదవికి రాజీనామా చేశారు. అపై డబ్బు కోసమే తన భార్య ఇలా భానుషలీపై తప్పుడు ఆరోపణలు చేసిందని ఆమె భర్తే స్వయంగా చెప్పడం గమనార్హం. కాగా, ఆయన హత్య విషయాన్ని తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తిగత పగతోనే జయంతీలాల్ ను హత్య చేసి ఉండవచ్చని భావిస్తున్నా, ఘటనా స్థలిలో ఓ తుపాకీ లభించడంతో, ఆయన తనంతట తానుగా కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారా? అన్న కోణంలోనూ దర్యాప్తు సాగుతుందని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

మా నాన్నకు కేన్సర్ సోకింది: హృతిక్ రోషన్

ముంబై:ప్రముఖ బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, తన అభిమానులతో పాటు యావత్ బాలీవుడ్ దిగ్భ్రాంతి చెందే వార్తను చెప్పారు. ఈ ఉదయం తన తండ్రి రాకేష్ రోషన్ తో కలిసి ఓ జిమ్ లో దిగిన ఫోటోను తన ఇన్ స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన హృతిక్, తన తండ్రికి కేన్సర్ సోకిందని అన్నారు. మా నాన్నతో ఓ ఫోటో తీసుకోవాలని ఉందని అడిగాను. సర్జరీ జరిగే రోజు కూడా ఆయన వ్యాయామం మానలేదు. మా నాన్న చాలా బలమైన వారు. కొద్ది వారాల క్రితం ఆయన గొంతు కేన్సర్ తో బాధపడుతున్నట్టు తెలిసింది. ఇది ప్రారంభ దశలోనే ఉంది. కేన్సర్ పై యుద్ధం చేయడానికి ఆయన బయలుదేరారు. ఆయన వంటి తండ్రి దొరకడం నాకెంతో అదృష్టం. మా కుటుంబానికి కూడా – లవ్ యూ డాడ్ అని అన్నారు. ఇటీవలి కాలంలో పలువురు బాలీవుడ్ ప్రముఖులు కేన్సర్ బారిన పడిన సంగతి తెలిసిందే.

లోక్‌సభలో పౌరసత్వ సవరణ బిల్లుకు ఆమోదం

- పౌరసత్వ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన రాజ్‌నాథ్
- ఈ బిల్లుపై టీఎంసీ తీవ్ర ఆందోళన
- సభ నుంచి వాకౌట్ చేసిన కాంగ్రెస్
- ఈశాన్య రాషాట్రల్లో ఈ బిల్లుపై తీవ్ర వ్యతిరేకత



న్యూఢిల్లీ: లోక్ సభలో పౌరసత్వ సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. పార్లమెంట్ సమావేశాల్లో చివరి రోజైన మంగళవారం పలు కీలక బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టారు. అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ బిల్లు, పౌరసత్వ సవరణ బిల్లును లోక్ సభ ముందు ఉంచారు. ఈ సవరణ బిల్లును బీజేపీ ఎంపీ రాజ్ నాథ్ సింగ్ సభలో ప్రవేశపెట్టారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్ దేశాలకు చెందిన ముస్లిమేతరులుకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ ముసాయిదా బిల్లు–2018కు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కాగా, పౌరసత్వ సవరణ బిల్లుపై టీఎంసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సభ నుంచి కాంగ్రెస్ పార్టీ వాకౌట్ చేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఈ బిల్లుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ బిల్లుకు ఆమోదం లభించడంతో అస్సాంతో బీజేపీ ప్రభుత్వానికి మిత్ర పక్షం అస్సాం గణపరిషత్ (ఏజీపీ) తమ మద్దతు ఉపసంహరించుకుంది. అంతకుముందు, లోక్ సభలో రాజ్ నాథ్ మాట్లాడుతూ, పౌరసత్వ సవరణ బిల్లు దేశ పౌరుల ప్రయోజనాలను పరిరక్షిస్తుందని అన్నారు. ఈ బిల్లు కేవలం అసోంకే పరిమితం కాదని, ఇతర రాష్ట్రాలకు కూడా వర్తిస్తుందని అన్నారు.


చంద్రబాబు తన డిక్షనరి నుంచి ఆత్మాభిమానం పదాన్ని ఎపుడో తీసేశారు

బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు

రాజమహేంద్రవరం,సూర్యబ్యూరో: చంద్రబాబు తన డిక్షనరి నుంచి ఆత్మాభిమానం పదాన్ని ఎపుడో తీసేశారని బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీజేపీ నేత సోమువీర్రాజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను తిట్టిన చంద్రబాబు ఇప్పుడు కాంగ్రెస్‌తో జతకట్టడం ఆత్మాభిమానమా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతి వెనుక మంత్రి లోకేష్ ఉన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేల నుంచి లోకేష్‌కు డబ్బులు అందుతున్నాయని సోము వీర్రాజు వ్యాఖ్యానించారు.

ప్రత్యేక రైలులో ప్రయాణించిన ఉపరాష్ట్రపతి

- రేణిగుంట- వెంకటాచలంకు రైల్లో ప్రయాణం
- నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూసేకరణ ఆలస్యం
- నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వే స్టేషన్ లో వైఫై ఏర్పాటుకు ఆదేశించా
- భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తిరుపతి,సూర్యబ్యూరో: భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రత్యేక రైలులో ప్రయాణించారు. రేణిగుంట నుంచి నెల్లూరు జిల్లా వెంకటాచలంకు ఆయన రైలులో వెళ్లారు. ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై రైల్వే అధికారులతో వెంకయ్యనాయుడు సమీక్షించారు. ఈ సమీక్షలో దక్షిణ మధ్య రైల్వే జీఎం కులశ్రేష్ఠ, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం, మీడియాతో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, ఓబులవారిపల్లె నుంచి కృష్ణపట్నం వెళ్లేలా గూడ్స్ రైళ్ల పనులు జరుగుతున్నాయని, వీలైతే వాటిని ప్యాసింజర్ కు మార్చేలా రైల్వే ట్రాక్ పూర్తి చేయాలని సూచించానని, ఫిబ్రవరి 25 లోగా ఈ పనులు పూర్తి కావాలని ఆదేశించినట్టు చెప్పారు. నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ కు సంబంధించి భూసేకరణ ఆలస్యమైందని, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభుత్వం వద్ద భూసేకరణలో జాప్యం జరిగిందని అన్నారు. నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వే స్టేషన్ లో వైఫై ఏర్పాటుకు, గూడూరు– విజయవాడ మూడో లైన్ విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించానని, నెల్లూరు సౌత్ స్టేషన్ పనులకు పునాది వేశానని, అది పూర్తయిందని చెప్పారు.

జమాల్ అల్ బడావీని మట్టుబెట్టాం: అమెరికా

- జనవరి 1న యూఎస్ ఎయిర్ ఫోర్స్ దాడులు
- అల్ ఖైదా ముఖ్యనేతను చంపేశామన్న యూఎస్
- టీమ్ ను అభినందించిన డొనాల్డ్ ట్రంప్



న్యూఢిల్లీ: ఒసామా బిన్ లాడెన్ తరువాత, ఉగ్రవాద సంస్థ అల్ ఖైదాను నడిపిస్తున్న ముఖ్య నేత జమాల్ అల్ బడావీని మట్టుబెట్టామని అమెరికా వెల్లడించింది. తాము చేపట్టిన వాయుసేన దాడుల్లో ఆయన మరణించాడని స్పష్టం చేసింది. అల్ ఖైదా తరఫున యెమెన్ లో కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్న బడావీ, 2000 సంవత్సరంలో యూఎస్ నేవీపై జరిగిన ఆత్మాహుతి దాడిలో కీలకపాత్ర పోషించాడు. నాటి దాడిలో 17 మంది మరణించగా, 40 మందికి గాయాలు అయ్యాయి. బడావీ ఆచూకీ తెలిపిన వారికి 5 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 35 కోట్లు) పారితోషికం ఇస్తామని కూడా అమెరికా ప్రకటించింది. తాజాగా, జనవరి 1న మారిబ్ గవర్నేట్ లో తమ ఎయిర్ ఫోర్స్ దాడులు నిర్వహించగా, జమాల్ అల్ బడావీ మరణించాడని అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారి బిల్ అర్బన్ వెల్లడించారు. కాగా, బడావిని మట్టుబెట్టిన బృంద సభ్యులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభినందించారు. అల్ ఖైదాకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

ఈబీసీ రిజర్వేషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- ఈబీసీ బిల్లుపై లోక్‌సభలో సుదీర్ఘ చర్చ
- రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 15కి క్లాజ్ (6), 16కి క్లాజ్(6)చేరిక
- డివిజన్ ఓటింగ్ తప్పనిసరన్న స్పీకర్ సుమిత్రా మహాజన్
- రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా 323 మంది మద్దతు
- వ్యతిరేకంగా ఓటు వేసిన ముగ్గురు సభ్యులు
- మూడింట రెండొంతులకు పైగా మెజార్టీతో బిల్లు ఆమోదం
- బిల్లు ఆమోదం తర్వాత లోక్‌సభ నిరవధిక వాయిదా
- నేడు రాజ్యసభ ముందుకు ఈబీసీ రిజర్వేషన్ బిల్లు



న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 124 రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈబీసీ బిల్లుపై మంగళవారం లోక్‌సభలో సుదీర్ఘ చర్చ జరిగింది. బిల్లుపై చర్చ ముగింపు సందర్భంగా.. కేంద్ర మంత్రి థావర్ చంద్ మాట్లాడుతూ.. రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 15కి క్లాజ్(6), 16కి క్లాజ్(6) చేరుస్తున్నామని ప్రకటించారు. రెండేళ్ల క్రితం తమ ప్రభుత్వమే క్రిమిలేయర్ పరిమితిని రూ. 6లక్షల నుంచి 8లక్షలకు వరకు పెంచిందని తెలిపారు. రాజ్యాంగ సవరణ బిల్లు కావడం వల్ల డివిజన్ ఓటింగ్ తప్పనిసరి అని స్పీకర్ సుమిత్రా మహాజన్ స్పష్టం చేశారు. దీంతో సభ్యులు ప్రతిపాదించిన సవరణలపై డివిజన్ పద్ధతిలో స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు. రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా 323 మంది సభ్యులు, వ్యతిరేకంగా ముగ్గురు సభ్యులు ఓటు వేశారు. మూడింట రెండొంతులకు పైగా మెజార్టీతో బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత లోక్‌సభ నిరవధిక వాయిదాపడింది. లోక్‌సభ ఆమోదంతో ఈబీసీ రిజర్వేషన్ బిల్లు బుధవారం రాజ్యసభ ముందుకు రానుంది. ఈబీసీ రిజర్వేషన్లు 50శాతం కోటా పరిధిలోకి రావని కేంద్రం స్పష్టం చేసింది. 50శాతం కోటాకు అదనంగా ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కేంద్ర మంత్రి థావర్ చంద్ గహ్లోత్ స్పష్టం చేశారు. ఈ బిల్లు ద్వారా కులాలు, మతాలకు అతీతంగా ఈబీసీలందరికీ రిజర్వేషన్లు అందనున్నాయి. రిజర్వేషన్లకు అర్హత ధ్రువీకరణలు రాష్ట్రాల పరిధిలోనే ఉంటాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

రామజన్మభూమి కేసు విచారణకు ప్రత్యేక ధర్మాసనం



- అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు
- ఈ నెల 10న విచారణ చేపట్టనున్న ధర్మాసనం
- హిందు ముస్లింల మధ్య ఘర్షణకు కారణమవుతున్న అయోధ్యబాబ్రీ మసీదు
- 2.77 ఎకరాల స్థలంలో మందిర నిర్మాణం జరగాలని డిమాండ్

న్యూఢిల్లీ: వివాదాస్పద రామజన్మభూమి బాబ్రీ మసీదు కేసు విచారణ కొత్త ధర్మాసనానికి కేటాయించాలని సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ కేసు విచారణకు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఏర్పాటయింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ ఉదయ్ లలిత్, జస్టిస్ చందర్ చూడ్‌లతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఆయోధ్య కేసును ఈ నెల 10న విచారణ చేపట్టనుంది. భారత్‌లో ఐదు దశాబ్దాలుగా హిందుముస్లింల మధ్య ఘర్షణకు అయోధ్యబాబ్రీ మసీదు వివాదం కారణమవుతోంది. తమ ఆరాధ్య దైవమైన శ్రీరాముడు జన్మించిన పవిత్రస్థలంలో మందిర నిర్మాణం జరగాలని హిందువులు డిమాండ్ చేస్తున్నారు. 2.77 ఎకరాల స్థలంలో భవ్యంగా మందిర నిర్మాణం జరగాలని కోరుతున్నారు. అయితే బాబర్ మసీదు నిర్మించిన ఈ స్థలం తమకే చెల్లుతుందని రామమందిర నిర్మాణం జరపడానికి వీల్లేదని ముస్లింలు వాదిస్తున్నారు. రామజన్మభూమిలో ఆయన విగ్రహాలు పెట్టి.. అక్కడ పూజలకు అనుమతించాలంటూ 1950లో గోపాల్ సిమ్లా, పరమహంస రామచంద్రదాస్‌లు ఫైజాబాద్ కోర్టును ఆశ్రయించారు. దీనికితోడు 1992, డిసెంబర్ 6న కరసేవకులు బాబ్రీ మసీదులోని కొంత భాగాన్ని ధ్వంసం చేయడంతో దేశవ్యాప్తంగా ఇరువర్గాల మధ్య వివాదం మరింత ముదిరింది. ఆ తర్వాత పురాతత్వ శాస్త్రవేత్తలు చేపట్టిన తవ్వకాల్లోనూ మసీదు కింద రామమందిరానికి సంబంధించిన ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో రామమందిర నిర్మాణానికి హిందూ సంఘాలు, వద్దే వద్దంటూ ముస్లింలు పోటాపోటీగా కోర్టులో పిటిషన్లు వేస్తున్న విషయం తెలిసిందే.

సీబీఐ చీఫ్‌గా తిరిగి అలోక్ వర్మ నియామకం

- అలోక్ వర్మ విషయంలో న్యాయం జరిగిందన్న రాహుల్
- రాఫెల్‌పై దర్యాప్తు చేస్తారనే అలోక్ ను తప్పించారు
- రాఫెల్ విషయంలో ఇకపై ఏం జరుగుతుందో చూడాలి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి మరో ఎదురు దెబ్బ తగిలింది. సీబీఐ డైరెక్టర్ల అంశంలో కేంద్ర నిర్ణయాన్ని సుప్రీం కోర్టు మంగళవారం తప్పుపట్టింది. సీబీఐ చీఫ్గా అలోక్ వర్మను తిరిగి నియమిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఇటీవల సీబీఐ చీఫ్ అలోక్ వర్మ, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా మధ్య వివాదాలు తలెత్తడంతో కేంద్ర ప్రభుత్వం వర్మను సెలవుపై పంపిన విషయం తెలిసిందే. దాన్ని సవాల్ చేస్తూ అలోక్ వర్మ.. సుప్రీం కోర్టును ఆశ్రయించారు. చీఫ్ జస్టిస్ రంజన్ గంగోయ్ సెలవు తీసుకోవడంతో.. ఆ తీర్పును కోర్టు నెంబర్ 12లో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ వినిపించారు. అయితే అలోక్ వర్మ కీలక నిర్ణయాలు ఏవీ తీసుకోకూడదని కోర్టు తన తీర్పులో స్పష్టంగా పేర్కొంది. సీబీఐ చీఫ్ను నియమించే ప్యానల్ మాత్రమే అతనిపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీం తెలిపింది. సీబీఐ నుంచి బలవంతంగా సెలవుపై బయటకు వెళ్లిన డైరెక్టర్ అలోక్ వర్మకే తిరిగి బాధ్యతలు అప్పగించాలని సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. దీనిపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందిస్తూ, అలోక్ వర్మ విషయంలో న్యాయం జరిగిందని అన్నారు. సీబీఐ డైరెక్టర్ ని అర్ధరాత్రి ఒంటిగంటకు తొలగించిన విషయాన్ని ఈ సందర్భంగా రాహుల్ ప్రస్తావించారు. రాఫెల్ కుంభకోణంపై దర్యాప్తు చేస్తారనే అలోక్ వర్మను ఆ పదవి నుంచి తప్పించారని విమర్శించారు. రాఫెల్ కుంభకోణం విషయంలో ఇకపై ఏం జరుగుతుందో చూడాలని రాహుల్ వ్యాఖ్యానించారు.

బలవంతపు పెళ్లికి యత్నం: హోంగార్డు అరెస్ట్

చెన్నై ,టీ.నగర్: మహిళా ఎస్ఐకు బలవంతంగా తాళి కట్టేందుకు ప్రయత్నించిన హోంగార్డును పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. నుంగంబాక్కం పోలీసు స్టేషన్‌లో మహిళా ఎస్ఐగా విల్లుపురం జిల్లా, తిరుక్కోవిలూరుకు చెందిన మణిమేగలై (24) పనిచేస్తున్నారు. ఈమె 2016లో వేలూరు కాట్పాడి పోలీసు స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేశారు. ఆ సమయంలో కాట్పాడికి చెందిన బాలచంద్రన్ (25) హోంగార్డుగా పనిచేస్తూ వచ్చాడు. అతనితో మణిమేగలై చనువుగా ఉండేదని తెలిసింది. దీన్ని ప్రేమగా భావించిన బాలచంద్రన్ మణిమేగలైను ఒన్‌సైడ్‌గా ప్రేమించాడు. ఇలా ఉండగా శనివారం రాత్రి చెన్నైకు చేరుకున్న బాలచంద్రన్ ఎగ్మూరులోని ఉడుపి హోటల్ వద్ద మణిమేగలైతో మాట్లాడాడు. ఆ సమయంలో తాను ఆమెను గాఢంగా ప్రేమిస్తున్నట్లు తనను వివాహం చేసుకొమ్మని కోరాడు. ఇందుకు మణిమేగలై నిరాకరించింది. అయినప్పటికీ తాను సిద్ధంగా తెచ్చుకున్న తాళిబొట్టును మణిమేగలై మెడలో ప్రజల సమక్షంలోనే కట్టేందుకు ప్రయత్నించాడు. దీన్ని ఊహించని మణిమేగలై అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించింది. ప్రజలు బాలచంద్రన్‌ను పట్టుకుని ఎగ్మూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఇందిరాగాంధీపై కేంద్ర మంత్రి గడ్కరీ ప్రశంసలు

- మహిళలకు రిజర్వేషన్ల అంశంపై మాట్లాడిన గడ్కరీ
- ఈ సందర్భంగా ఇందిరాగాంధీ గురించి ప్రస్తావన
- మహిళా రిజర్వేషన్ లేకుండా రాణించిన నేత ఇందిర



న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రసంగిస్తున్న సందర్భంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీని కేంద్ర మంత్రి, బీజేపీ అగ్ర నేత నితిన్ గడ్కరీ గుర్తుచేసుకున్నారు. నాగపూర్ లో జరిగిన ఓ కార్యక్రమంలో మహిళలకు రిజర్వేషన్ల అంశంపై ఆయన మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల హోదా పొందకుండానే మగవారి మధ్య మేటి నేతగా నాడు ఇందిరాగాంధీ తన సత్తా చాటుకున్నారని ప్రశంసలు కురిపించారు. ఎటువంటి రిజర్వేషన్ సౌకర్యం పొందకుండానే ఆమె తన పాలన సాగించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా తమ పార్టీకి చెందిన మహిళా నేతలు సుష్మ స్వరాజ్, వసుంధర రాజే, లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ కూడా ఎటువంటి రిజర్వేషన్ సౌకర్యం లేకుండానే రాజకీయాల్లో దూసుకెళ్తున్నారని కొనియాడారు. ఎవరైనా తమ ప్రతిభ ఆధారంగానే రాణించాలి తప్ప, కులమతాలు, ప్రాంతం, భాష వంటి అంశాలను ఆధారం చేసుకుని కాదన్న గడ్కరీ, మహిళా రిజర్వేషన్ కు తాను వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కులమతాల ఆధారంగా చేసే రాజకీయాలను తాము వ్యతిరేకిస్తామని తెలిపారు.

అటవీ శాఖ ఉద్యోగిపై దాడిచేసి చంపేసిన ఏనుగు

- ఏనుగులను తరిమేసే పనిలో ఉండగా ఘటన
- తొండంతో విసిరి, కాళ్లతో తొక్కేసి చంపిన గజం
- డెంకణీకోట సమీపంలోని తావరకరై అటవీ ప్రాంతంలో ఘటన

హోసూరు: కర్ణాటకలోని హోసూరు సమీపంలోని డెంకణీకోట సమీపంలోని తావరకరై అటవీ ప్రాంతంలో ఓ దుర్ఘటన చోటుచేసుకుంది. విధులు నిర్వహిస్తున్న ఓ అటవీ ఉద్యోగిని ఏనుగు ఒకటి తొక్కి చంపేసింది. వివరాల్లోకి వెళితే... తమిళనాడులోని డెంకణీకోట అటవీ ప్రాంతంలో ఇటీవల 30 ఏనుగులు మకాం వేసి చుట్టుపక్కల ప్రాంతాల్లోని పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో అటవీ శాఖ సిబ్బంది ఈ ఏనుగును సమీపంలోని కర్ణాటక అడవుల్లోకి తరిమేసేందుకు చర్యలు చేపట్టారు. వీటిని తరుముతుండగా గున్న ఏనుగు ఒకటి వెనుకబడింది. గుంపులోని తల్లి ఏనుగు తన పిల్లకు ఏదో అపాయం జరుగుతుందని భావించి ఒక్కసారిగా వెనక్కి తిరిగి సిబ్బందిని వెంబడించింది. అందరూ భయంతో పారిపోగా మారప్ప (55) అనే అటవీ ఉద్యోగి తల్లి ఏనుగుకు దొరికిపోయాడు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న ఏనుగు మారప్పను తొండంతో విసిరికొట్టి కాళ్లతో తొక్కి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న మారప్పను మిగిలిన సిబ్బంది డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మరణించినట్లు ధ్రువీకరించారు.

మొదటి పేజీ తరువాయి

మోడీకి ట్రంప్, పుతిన్ ఫోన్

మధ్యా వాణిజ్య యుద్ధ భయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో ఇండియా సైతం దీటుగా స్పందించింది. జనవరిలోగా పెంచిన సుంకాలను తగ్గించకుంటే తామూ ప్రతీకార సుంకాలను వేస్తామని హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ఫోన్ చేయడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోడీకి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఫోన్ చేసి మాట్లాడారు. వీరిద్దరూ పలు ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై చర్చించినట్టు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రధానంగా రక్షణరంగం, ఉగ్రవాద నిర్మూలన తదితర అంశాలపై వీరిమధ్య చర్చ సాగిందని తెలిపింది. ఐక్యరాజ్యసమితి, బ్రిక్స్ వంటి ప్రపంచ వేదికలపై పరస్పర సహకారాన్ని కొనసాగించాలని ఇరు దేశాధినేతలూ నిర్ణయించారని వెల్లడించింది. రష్యాలో సెప్టెంబర్ లో జరగనున్న ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సుకు హాజరు కావాలని కోరేందుకు పుతిన్ ఫోన్ చేసినట్టు తెలుస్తోంది. సదస్సుకు హాజరుకావాలన్న పుతిన్ విజ్ఞప్తిపై నరేంద్ర మోడీ సానుకూలంగా స్పందించారని విదేశాంగ శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు.

ఫలించిన దౌత్యం



డెలివరీ సిస్టర్న్ నిర్మాణం, 9 కిలోమీటర్ల పైప్ లైన్, వాగుల పై క్రాస్ డ్రైనేజ్ స్ట్రక్చర్, టన్నెల్లు, కాలువల పై క్రాస్ రెగ్యులేటర్ లు మరియు తూముల నిర్మాణం జరుగుతుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 8,476 హెక్టార్ల భూమి అవసరం ఉండగా అందులో 1531 హెక్టారాల అటవీ భూమి ఉంది ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం 13,384.80 కోట్లు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ను మూడేళ్ళల్లో పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. సాగు నీటి శాఖ సమర్పించిన పర్యావరణ నివేదికను ఈఏసి కూలంకషంగా పరిశీలించిన పిదప సాగునీటి శాఖ అధికారులు ఇచ్చిన వివరణలకు చెంది ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతి మంజూరు చేయవలసిందిగా కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ కు సిఫారసు చేసింది. వారి సిఫారసు మేరకు పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ 2006 కి లోబడి మంత్రిత్వ శాఖ ఈ నెల 7 వ తేదీన తుది పర్యావరణ అనుమతిని మంజూరు చేస్తూ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు కు లేఖ రాసింది. ఈ అనుమతి పదేళ్ళ వరకు మనుగడ లో ఉంటుందని లేఖ లో పేర్కొన్నారు.

ఫలించిన సీఎం దౌత్యం : రెండోసారి ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రమాణ స్వీకారం అనంతరం డిల్లీ పర్యటన లో భాగంగా కేంద్ర పర్యావరణ మంత్రి హర్షవర్ధన్ ని కలిసి ప్రాజెక్టు కు పర్యవరన అనుమతిని మంజూరు చేయమని కోరిన సంగతి తెలిసిందే. దీంతో కేసీఆర్‌దౌత్యం ఫలించింది. పర్యావరణ అనుమతిని మంజూరు చేసినందుకు గాను ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేస్తూ, కేంద్ర మంత్రి హర్షవర్ధన్ కు ధన్యవాదాలు తెలిపారు.

మరో ఘట్టం



341 వ రోజు ఇచ్ఛాపురం నియోజకవర్గంనుంచి జగతి నుంచి బయలుదేరి కవిటి, తుత్తిలివుట్టుగా, రాజపురం మీదుగా అగ్రహారం వరకు నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి అక్కడే బసచేసి జగన్ బుధవారం ఉదయం 341వ రోజు యాత్రప్రారంభించి ఇచ్ఛాపురం చేరుకుంటారు. భోజన విరామం అనంతరం ఆయన పాదయాత్రను తిరిగి ప్రారంభించి ఇచ్ఛాపురం చేరుకుంటారు. అక్కడ జాతీయ రహదారి వద్ద ఏర్పాటుచేసిన పైలాన్‌ను జగన్ ఆవిష్కరించి అక్కడనుంచి పాతబస్టాండ్ వరకు పాదయ్త్రా కొనసాగించి బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఈమేరకు షెడ్యూల్ ఇప్పటికే ఖరారు కావడంతో జనాలు కూడా తరలి వస్తుండడంతో పార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లుచేస్తున్నారు. జిల్లాలోని 10 శాసన సభ నియోజకవర్గాలనుంచి కూడా జగన్ పాదయ్త్రా ముగింపు సభకు తరలి వెళ్ళేందుకు వైఎస్సార్‌కేడర్ సిద్ధమైంది. వైఎస్సార్‌రాష్ట్రనాయకులు రఘురాం, కరుణాకరరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ లాంటి నాయకులు ఇప్పటికే ఏర్పాట్లపై సమీక్ష చేస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డి చేపట్టే పాదయాత్రముగింపు సభపై సర్వ్త్ర ఆసక్తి నెలకొంది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఆయన ఇప్పటికే వెలిగెత్తి చాటుతున్నారు. మరో ప్రక్క నాలుగునెలల్లో ఎన్నికలు రానున్నాయి. ఇక్కడనుంచే ఎన్నికల శంఖారావంచేయనున్నారు. కొత్తగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కూడా ఆయన మాట్లాడే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ విధానాలు లోతుగా ప్రస్తావించే అవకాశాలు ఉన్నాయి. వైకాపా శ్రేణులతోపాటు, ఇతర పార్టీ రాజకీయ పార్టీల దృష్టి అంతా ఈ ప్రజా సంకల్పయ్త్రా ముగింపు ప్రస్థానంపై వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అన్ని విషయాలపై జగన్ కుండ బద్దలకొట్టే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు జాతీయ రాజకీయాలపై కూడా ఆయన ప్రస్థావించనున్నారు. అయితే ఇచ్ఛాపురం ఈ చరిత్రకు సాక్షిభూతం కానుంది. గతంలో తన తండ్రి వైయస్.రాజశేఖర్‌రెడ్డి 2004 ఎన్నికల ముందు 1475 కిలోమీటర్ల పాదయాత్రచేసి మరో మహాప్రస్థానానికి శ్రీకారం చుట్టి పాద యాత్ర చరిత్రలోనే ఓ మైలురాయిగా నిలిచారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆయన ఘన విజయం సాధించారు. తర్వాత వైయస్. షర్మిల పాదయాత్రచేసి 3012 కిలోమీటర్లు గమ్యాన్ని అదిగమించారు. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి 3700 కిలోమీటర్లు పాదయాత్ర చేసి చరిత్రసృష్టించారు. వచ్చే ఎన్నికలకు ప్రజలతో ఆయన మమేకమైన తీరు , సమస్యలపై అవగాహన పూర్తిస్థాయిలో తెలుసుకున్నారు. మొత్తం మీద సిక్కోలు జిల్లా పాదయాత్రలతో పునీతమైంది.

సాక్షర భారత్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి



విజయవాడ, సూర్య బ్యూరో : తొలగించిన సాక్షర భారత్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవడంతోపాటు, వారి న్యాయమైన కోర్కెల పరిష్కారించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం వినతిప్త్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వయోజన విద్యాశాఖ సాక్షర భారత్‌లో రాష్ట్రవ్యాప్తంగా మండల సమన్వయకర్తలుగా (ఎంసిఓలు) 504మంది, జిల్లా సమన్వయకర్తలుగా (డిసిఓలు) 40 మంది, గ్రామ సమన్వయకర్తలుగా (విసిఓలు) 19,959 మంది విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. గ్రాడ్యుయేషన్ వంటి ఉన్నత చదువులతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం వంటి అదనపు విద్యార్హతల గల వారిని మండల సమన్వయకర్తలుగా నియమించడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిల్లో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు వీరు ఎంతో కృషిచేశారన్నారు. దీనికితోడు అన్ని ప్రభుత్వ పథకాలను మండల, గ్రామ స్థాయిల్లో లబ్దిదారులకు చేరవేయడంలో వీరు ప్రముఖ ప్తా పోషించారన్నారు. 2010వ సంవత్సరం నుండి చాలీచాలని వేతనాలతో విధులు సమర్ధవంతంగా నిర్వర్తిస్తున్న వీరిని తొలగిస్తున్నట్లుగా ది.14062018న రాష్ట్ర వయోజన విద్యాశాఖ ఉత్తర్వులివ్వడంతో సాక్షర భారత్ సిబ్బందిలో ఆందోళన నెలకొన్నదన్నారు. ఫలితంగా ఉద్యోగాలు కోల్పోయిన వీరి కుటుంబాలు వీధుల పాలయ్యే ప్రమాదం దావురించిందన్నారు. దిక్కుతోచని సాక్షర భారత్ సిబ్బంది ఆందోళనబాట పట్టారన్నారు. తక్షణమే తొలగించిన మండల, జిల్లా, గ్రామ సమన్వయకర్తలను విధుల్లోకి తీసుకోవాలి. వీరికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ హెల్త్ కార్డులు, హెచ్.ఆర్.ఎ. వర్తింపచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను, టి.ఎ., డి.ఎ.లను చెల్లించాలన్నారు. వయో పరిమితితో నిమిత్తం లేకుండా గ్రామ పంచాయితీ, మండల పరిషత్ కార్యాలయాల్లో, డ్వామా, డిఆర్‌డిఎ, సర్వశిక్షా అభియాన్ వంటి శాఖలలోని పలు విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నామన్నారు.

చంద్రబాబుతోనే నవ్యాంధ్ర అభివృద్ధి

- కష్టకాలంలోనూ సమర్ధవంత పరిపాలన
- ప్రజా శ్రేయస్సుకు నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు
- నేడు పోర్టు, పేపర్ మిల్లుకు శంఖుస్థాపన, జన్మభూమి సభకు హాజరు
- అభివృద్ధికి దిక్సూచిగా దర్శి నియోజకవర్గం
- రూ 3 వేల కోట్లతో యోజకవర్గంలో అభివృద్ధి పనులు
- లంకోజనపల్లిలో 'జన్మభూమి-మా ఊరు' సభలో రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు



దర్శి, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివద్ధి కార్యక్రమాలకు ప్రజలు అండగా నిలవాలని రాష్ట్ర శాఖ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. మంగళవారం దర్శి నియోజకవర్గ పరిధిలోని లంకో జనపల్లి గ్రామంలో జరిగిన జన్మ భూమి మాఊరు కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు గారు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్ధిక లోటు ఉన్నప్పటికీ 24 వేల కోట్ల రూపాయల తో రైతులకు రుణమాఫీ, 12 వేల కోట్ల రూపాయలతో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, 6 వేల కోట్ల రూపాయలతో కొత్తగా పెన్షన్లు మంజూరు చేయడం జరిగింద న్నారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకరించనప్పటికి పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలో సాగునీటి కి,త్రాగునీటి కు ఇబ్బందులు రాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నదుల అనుసంధానం చేపట్టారన్నారు.గోదావరి నదిను కష్ణానదికి పట్టిసీమ ద్వా రా అనుసంధానం చేయడం జరిగిందని ఆయన అన్నారు. కష్ణానదీని పెన్నానది కు అనుసంధానం చేయడానికి నకిరేకల్ వద్ద ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కరువు లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలోఎస్.సి,ఎస్.టి,బి.సి,కావు,మైనార్టీ, బ్రహ్మణ్ణ, వైశ్య, కార్పొరేషన్ ల్లు ఏర్పాటు చేసి సబ్సీడి రుణాలను, వడ్డీలేని రు రుణాలను అందించడము జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వ్యవ సాయరంగము లొ విప్లవాత్మక మైన మార్పులు తీసుకు రావడము జరిగిందన్నారు.పొలము పిలు స్తుంది అనే కార్యక్రమం ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక సాంకేతిక పరి జ్ఞానాన్ని అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రంగంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడము వంటి అంశాలపై రైతులకు అవ గాహన కల్పించడము జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని పరిపాలించదగ్గ సమ ర్ధవంతమైన నాయుకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కడేనన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిగా ముఖ్యమంత్రి గా తిరిగి చంద్రబాబు నాయుడు గెలిపించాలని ఆయన కోరారు.దర్శి నియోజకవర్గ పరి దిలో 3 వేల కోట్ల రూపాయల తో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. దర్శిలో 30 కోట్ల రూపాయల తో అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూలుకు, మినీ స్టేడియం, ఫైర్ స్టేషన్, కురిచేడు లో 30 కోట్ల రూపాయల తో సోషవెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.లంకొజనపల్లి లో 7 కోట్ల రూపాయల తో అభివ ద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. .లంకొజన పల్లి గ్రామంలో మిగిలి పోయిన సిమెంటు రోడ్డులు పూర్తీ చేస్తామని ఆయన అన్నారు. పాఠశాలలో ప్రహరి గోడ నిర్మాణం కోసం నిధలు మంజూరు చేస్తామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలకు సంక్రాంతి కానుక లను మంత్రి పంపిణీ చేశారు. రైతులకు ఈ పాస్ వుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారవుశెట్టి పాపారావు, దర్శి ఎంపీపీ వూసల సంజీవయ్య, వైస్ ఎంపీపీ మారం శ్రీనివాస్ రెడ్డి, కనీస వేతనాలు అమలు బోర్డ్ డైరెక్టర్ శోభారాణి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సూరే చిన్న సుబ్బారావు, జడ్పీటీసీ స్టీవెన్ ,ఎంపీడీఓ శ్రీనివాసరావు,సంగా తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.



పోలవరం గిన్నిస్ రికార్డ్

- తెలుగు జాతికే గర్వకారణం
- వానా కాలం నాటికి గోదారమ్మ వస్తుంది
- బంగారు పంటలు పండుతాయి: మంత్రి ఉమా



మేజర్ న్యూస్ చాట్రాయి:పోలవరం నిర్మాణానికి గిన్నిస్ రికార్డు రావడం తెలుగు జాతికే గర్వకారణమని ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల శాఖ మాత్యులు దేవినేని ఉమామహేశ్వరరావు కొనియాడారు. మంగళవారం సాయంత్రం కృా ఎష్ణాజిల్లా హాయ్ మండలం చీవురు గూడెం గ్రామం వద్ద జరుగుతున్న చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్ టు పనులను రాత్ర 7 గంటల నుండి ఎనిమిది గంటలు దాటే వరకు అక్విడెట్ను పరిశీలించారు. ఆయన వస్తున్నారని తెలియడంతో ప్రజలు పెద్ద ఎత్తున రాత్రవేళ అయినా తరలిరావడంతో. అక్విడెట్ పై నుండి ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర విభజన నేపథ్యంలో అనేక ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు గారు దూరదృాఎష్టితో సాహసోపేతమైన పరిపాలన చేస్తూ ప్రపంచ స్థాయి చరిత్రను సృాఎష్టిస్తున్నారని కొనియాడారు. ప్రపంచంలోనే 24 గంటల సమయంలో ఎన్నడూ లేని విధంగా 32 వేల క్యూబిక్ మీటర్ల నిర్మాణం జరిపి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందితే దానిని చూసి వార్వ లేని జగన్మోహన్ రెడ్డి పత్రిక దానిపై కూడా కుళ్ళు రాతలు రాస్తున్నారు అని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం నుండి రావలసిన నీరు రాకుండా పోయే సమయంలో రాష్ట్రం ఎడారిగా మారే పరిస్థితులలో. చంద్రబాబు నాయుడు గారు ఆయన పరిపాలనాదక్షతతో దూరదృాఎష్టితో సృా ఎజనాత్మక శక్తితో నీటి భద్రత పథకాలను రూపొందించారని కొనియాడారు. రానున్న తరాలు వాళ్ళందరూ ఆయనకు రుణపడి ఉంటారని కొనియాడారు. చింతలపూడి ఎత్తిపోతల పేజ్ టూ ద్వారా 9 నియోజకవర్గాల్లోని రెండు లక్షల 50 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించాలని కోరడంతో ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నా చంద్రబాబు నాయుడు గారు నాలుగు వేల 900 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే రెండు వేల కోట్ల పైగా ఖర్చు చేయడం జరిగిందన్నారు. వానాకాలం కల గోదారమ్మ ఈ కాలువ లో వచ్చితీరుతుందని మన ప్రాంతంలో బంగారు పంటలు పండుతాయని కృా ఎష్ణాజిల్లా దేశంలోనే అభివృాఎద్ధిలో అగ్రగామిగా ముందుకు వచ్చే రోజులు రాబోతున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. 760 కోట్లతో పట్టిసీమ నిర్మించిన తర్వాత ఆదాయం 94 వేల కోట్లకు పెరిగింది అన్నారు. గతం కన్నా 44 వేల కోట్లు అధిక ఆదాయం వచ్చిందన్నారు. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా గణనీయంగా పెరిగాయి అన్నారు. జూన్ జూలై నాటికల్లా ఈ ప్రాంతానికి కూడా గోదారమ్మ వచ్చితీరుతుందని బలంగా చెప్పారు. మన దగ్గర లో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా తయారవుతుందని మన దగ్గర పడిన పంటలను అంత ర్జాతీయ స్థాయికి ఎగుమతి చేసే అవకాశం ఉందని ఈ ప్రాంతం మొత్తం హార్టి కల్చర్ హబ్ గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలవ ప్రవహించే గ్రామాల్లో కూడా మిగిలిన భూములకు నీళ్లు కూడా కోసం ఏడు వందల కోట్ల రూపాయలతో పిట్ల వారి గూడెం వద్దా ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేయడం జరిగిందని దానివలన చాట్రాయి విస్సన్నపేట నూజివీడు ముసునూరు తదితర ప్రాంతాలలో 50 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. చెప్పిన ప్రతి పని చేస్తామ న్నారు. ఎత్తిపోతల పథకం ప్లాన్ ని మూడు వేల క్యూసెక్కుల నీరు ప్రవహించే విధంగా పెంచడం జరిగిందన్నారు. జల్లేరు లో 14 టీఎంసీల నీరు నిల్వ సామ ర్థ్యం ఉండేవిధంగా రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో భూ ములిచ్చిన ప్రతి రైతుకు చివర పైసా వరకు ఇస్తామని ఎవరు భయపడవద్దని పనులకు సహకరించాలని కోరారు. తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకి ఆరు వందల క్యూసెక్కుల నీరు ఇచ్చే విధంగా ప్రణాళిక రూపొందించబడింది అన్నా రు.

పాదయాత్ర చేస్తా !:గోదావరి తాడిపూడి నుండి కలగర రామచంద్రపురం వన్ వన్ సెవెన్ వరకు 119 కిలోమీటర్ల పొడవు పాదయాత్ర చేస్తానని త్వరలోనే దానికి రూపకల్పన చేస్తున్నామని కాలవ ప్రారంభమైన దగ్గర నుండి 117 కిలోమీటర్ వరకు కాల్వ పొడవునా కాలినడక నడవాలని ఏది నా కోరిక ని దానికోసమే అహర్నిశలు కృాఎషి చేస్తున్నారని తెలిపారు.రైతుల కళ్ళల్లో ఆనందం చూడాలనేది నా కోరికను రైతుల జీవితాలకు భద్రత కల్పించాలనేది ఆశయమని వ్యవసాయ కూలీలకు నిరంతరం పనులు చూపించాలనేది నా లక్ష్యమన్నారు. దీనికోసం మనమంతా పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని కారు కూతలు కూసే వారికి సరైన బుద్ధి చెప్పాలని కోరారు.

చారిత్రాత్మకం:ముద్దరబోయిన:తెలుగుదేశం పార్టీ నూజివీడు ఇంచార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన నేపథ్యంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని ఇది చారిత్రాత్మకమైన దని కొనియాడారు. ముందు చూపు ఉన్న మన నాయకుడు చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రామికుడి వలె పని చేస్తూ రాష్ట్ర అభివృాఎద్ధి ధ్యేయంగా ఎన్నడూ లేని పథకాలకు రూపకల్పన చేస్తున్నారని మన ప్రాంతంలో భూములు అన్ని బంగారు పంటలు పండుతాయని కొనియాడారు. ఈ సభలో ఎస్సి రమేష్ సిఇ సతీష్ డి చలపతి రావు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

ఎపిపిఇసిఎంఎ



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఎపిపిఇసిఎంఎ), జెఎన్‌టియు అనంతపూర్, కాకినాడ వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సాంకేతిక విద్య ఉన్నత ప్రమా ణాలు పాటించడానికి, వారికి తగిన శిక్షణ ఇచ్చి ఉద్యోగ అర్హతలు పొందటానికి తగిన ప్రణాళికలు రూపొందినదని ప్రెసిడెంట్ శాంతి రాముడు, జనరల్ సెక్రటరీ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నిర్వా హకులు మాట్లాడుతూ మన రాష్ట్ర విద్యార్థులు సుమారు 30 వేల మంది యితర రాష్ట్రాలకు ఉన్నత విద్యకొరకు వెళ్ళి అక్కడ పరిస్థితులకు అలవాటుపడక, తిరిగి వచ్చి మొదటి నుండి యిక్కడ విద్యను అభ్యసించుచున్నా రన్నా రు. దీనివలన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆర్థిక భా రమవటమే కాకుండా వారు మానసిక వ్యధను అనుభ వించుచున్నారన్నారు. మన రాష్ట్రంలో పేద, మధ్య తరగతి అందరూ కూడా ఉన్నత సాంకేతిక విద్యను అభ్యసించాలనే తపనతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని సహాయ సహకారాలు అందించి వారి ఫీజు రీయంబర్స్‌మెంట్ రూపంలో అంద రికీ అందిస్తున్నదన్నారు. అలాగే ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉన్నతమైన శిక్షణ యిచ్చి ఉద్యోగ అర్హులుగా తీర్చిదిద్దుచున్నదన్నారు. అందుకు అన్ని ఉన్నత ప్రమాణాలు గల ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రంలో వున్నాయన్నారు. మన రాష్ట్రంలో విద్యను అభ్యసించి వి ద్యార్థులను ఉన్నత ప్రమాణాలుగల విద్యార్థులుగా తీర్చి దిద్దడటమే కాకుండా దేశ, విదేశాలలో ఉన్నత ఉద్యోగాలు చేస్తూ అభివృద్ధి చెందేలా తయారు చేస్తున్నామన్నారు. ప్రముఖ సీమెన్స్, జర్మనీ, రోబోటెక్ సెంటర్, డసాల్ట్, ఫ్రెం చ్ కంపెనీల యొక్క శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేసి వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ యేడు కేంద్ర ప్రభుత్వ వివిధ సర్వేలలో దేశంలో ఉద్యోగ అర్హతలు, నియామకాలు పొందిన ఉద్యోగులలో ఎపి నెం1గా వుందన్నారు. 2018 నియామకాలలో 51.70 శాతం, ఇంజనీరింగ్ పట్టభ ద్రులు వున్నారు. రాబోయే 2019 సంవత్సరంలో 57 శాతం ఇంజనీరింగ్ పట్ట భద్రులు ఉద్యోగాలు పొందటాని కి అవకాశమున్నదని సర్వేలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశా లలు, జెఎన్‌టియు యూనివర్శిటీ కలసి మారు చున్న కాలానికి అనుగుణంగా, పరిశ్రమల అవసరానికి తగి నట్టుగా విద్యార్థులను తీర్చిదిద్ద తున్నామన్నారు. సుమా రు 2500 పిహెచ్‌డి హోల్డర్స్, రీసెర్చ్ స్కాలర్స్ సాంకేతిక విద్యను ఉన్నత ప్రమాణాలతో తీర్చి దిద్దుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కృషితో నెలకొ ల్పబడుతున్న పరిశ్రమలకు అవసరమైన లక్షలాది ఉద్యో గాలలో మన రాష్ట్ర విద్యార్థులు వుండేలా ఎపిపిఇ సిఎంఎ కృషి చేస్తున్న దన్నారు. ఉన్నత ప్రమా ణాలతో దేశానికే ఎడ్యుకేషనల్ హబ్ గా ఆంధ్రప్రదేశ్ తీర్చిది ద్దటానికి ఎపి పిఇసిఎంఎ, జెఎ న్‌టియు ఆధ్వ ర్యంలో రాష్ట్రంలో 13 జిల్లా లో సెమి నార్ లు, వర్క్ షాపులు నిర్వ హించి రాష్ట్రంలో విద్యార్థులకు అవకాశాలు తెలియ జేప్పాలని ప్రయత్నిస్తు న్నామన్నారు. మొదటగా జనవరి 25 నెల్లూరు, 27 కర్నూ లు, 28 కడప వర్క్ షాపులు నిర్వ హిస్తున్నామన్నారు. అసత్య ప్రచారాలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమం లో కోశాధికారి ఎం. కోటేశ్వ రరావు, వైస్ ప్రెసిడెంట్ గంజిరెడ్డి, సెక్రటరీలు బోనం కృష్ణ, జగన్‌మోహన్‌రెడ్డి, ఇసి మెంబర్ రాంమో హన్ తదితరులు పాల్గొన్నారు.

11లోగా జన్మభూమి సమస్యల పరిష్కానికి చర్యలు

ప్రత్యేక అధికారి లక్ష్మీనరసింహం



(మేజర్ న్యూస్ శ్రీకాకుళం కలెక్టరేట్) ఈ నెల 11లోగా జన్మభూమి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకో వాలని ప్రత్యేక అధికారి డా. పి. లక్ష్మీనరసింహం సంబం ధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకు ళం మున్సిపాలిటీలో 31, 35 వార్డులకు సంబంధించి దేశల్లవీధిలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జన్మభూమి ముగిసేలోగా ప్రజల సమస్యల పరిష్కానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ఆర్. శ్రీరా ములు నాయుడు, శ్రీకాకుళం రెవెన్యూ డివిజినల్ అధికారి ఎం.వి. రమణలను ఆదేశించారు. మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ మా వార్డులో స్మశా నానికి వెళ్లే దారి సమస్యగా ఉన్నదని, అంగన్ వాడీ భవ నం కూడా కావాలని ప్రత్యేక అధికారికి తెలుపగా స్మశా నానికి వెళ్లే దారి గూర్చి అక్కడే ఉన్న మున్సిపల్ కమీషనర్ ను అడుగగా స్మశానానికి వెళ్లే దారికి నిధులు మంజూరు అయ్యాయని, టెండర్లు కూడా పూర్తి అయిపోయినావని, సంబంధిత కాంట్రాక్టరు పనులు ప్రారంభించాల్సి ఉందని కమీషనర్ చెప్పగా సత్వరమే పనులు ప్రారంభించి పూర్తి చేయించాలని, పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగి తే కాంట్రాక్టర్ ను మార్చవలసినదిగా ఆయన కమీషనర్ ను ఆదేశించారు. మీ మీ వార్డులలో సమస్యలు తెలియ జేయాలని ఆయన సభకు హాజరైన ప్రజలను కోరగా వేలి ముద్రలు పడలేదని ఫించన్లు ఇవ్వడం లేదని తెలుపగా వేలి ముద్రలు పడలేదని ఫించన్లు ఆపవద్దని, ప్రతీ నెలా ఫించన్లు తీసుకోడానికి వస్తారని, వారు మీకు తెలుసని, వేలిముద్రలు లేకపోతే ఐరిస్ ను కూడా ఉపయో గించు కోవచ్చని సంబంధిత బిల్ కలెక్టర్ ను ఆదేశించారు. ఫించ న్లు మాత్రం ఆప వద్దని చెప్పారు. ఫించన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, గ హాలు, తదితర వాటి గూర్చి వినతులను ఆయన స్వీకరించారు.మరిన్ని అభివద్ధి పనులు చేపట్ట నున్నట్లు ఆయన తెలిపారు.

సుప్రీంకోర్టు జడ్జిమెంటు ప్రధాని మోడీ ప్రభుత్వానికి చెంపపెట్టు

యనమల రామకృష్ణుడు




అమరావతి, సూర్య బ్యూరో : సిబిఐలో అధికార బిజెపి నేతల జోక్యానికి అడ్డుకట్ట. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని చూసేవారికి గుణపాఠం. స్వార్థానికి వాడుకోవాలని చూసేవారికి చెంపపెట్టు అని ఆర్థికమంత్రి యనమల రామకష్ణుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోది పాలనలో ఆర్‌బిఐ, సిబిఐ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీశారన్నారు. ఈడి, ఐటి దర్యాప్తు సంస్థలను సొంతానికి వాడుకున్నారన్నారు. రాజ్యాంగ సంస్థల అధికారాలను కాలరాయాలని చూశారన్నారు. ప్రత్యర్థులపై కక్ష సాధింవునకు వీటిని వాడుకు ంటున్నారన్నారు. బీజేపీ పెడ ధోరణులకు సుప్రీం తీర్పు కొరడా దెబ్బలాంటిదన్నారు. వ్యక్తిగత గోప్యత హక్కుకు భంగం కలిగించాలని చూశారన్నారు. కంప్యూటర్ల లో సమాచారాన్ని చూసేందుకు 10 సంస్థలకు అధికారం ఇచ్చారన్నారు. పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛ హరించాలని ప్రయత్నిస్తే, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తే భారత న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోదన్నారు. రాజ్యాంగాన్ని కాలరాయాలని చూస్తే ఎవరూ సహించరు. వ్యక్తిగత స్వేచ్ఛ హరించాలని చూస్తే జనం భరించరన్నారు. అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు ఆహ్వానించదగిందేనన్నారు. కానీ కేంద్రం నిర్ణయం వెనుక రాజకీయ రహస్యం ఏమిటి? పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ప్రాథమికంగా ప్రతిఒక్కరూ స్వాగతిస్తారన్నారు. అమలు ప్రక్రియలో అడ్డంకుల కల్పనపైనే అనుమానాలు ఉన్నాయి. ఎన్నికల స్టంట్‌గానే ప్రజలు దీనిని చూస్తారన్నారు. ఈబిసిల రిజర్వేషన్ల వెనుక బీజేపీ చిత్తశుద్ధి ప్రశ్నార్థకం. ప్రాథమికంగానే బీజేపీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. కులపర, మతపర రిజర్వేషన్లను గతంలో వ్యతిరేకించిన చర్త్రి బీజేపీదన్నారు.తప్పుడు హామీల పార్టీ బిజెపిని ప్రజలు నమ్మరన్నారు.ఎన్ని రిజర్వేషన్లు తెచ్చినా రాబోయే ఎన్నికల్లో బిజెపిని ప్రజలు నమ్మరన్నారు.

ఏయూ స్నాతకోత్సవంలో పాల్గొననున్న గవర్నర్



విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ నగరంలో పర్యటించనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగే స్నాతకోత్సవంలో ఆయన పాల్గొననున్నారు. పలువురికి డాక్టరేట్లను గవర్నర్ అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, యూనివర్సిటీ అధికారులు పాల్గొననున్నారు.

జగన్ బహిరంగ చర్చకు రావాలి: మంత్రి ప్రత్తిపాటి




అమరావతి, సూర్య బ్యూరో : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి తెలుగుదేశం పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తూ వుస్తకం విడుదల చేయడంపై మంత్రి ప్రత్తిపాటి వుల్లారావు మండిపడ్డారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోపణలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బహిరంగ చర్చకు రావాలని ఆయన జగన్‌కు సవాల్ విసిరారు. ఆ వుస్తకంలోనివి అన్నీ నిరాధారమైన ఆరోపణలన్నారు. ఏదిపడితే అది రాస్తే ప్రజలు నమ్మరని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కుటుంబ ఆస్తులను ప్రకటించారని, జగన్మోహన రెడ్డికి కుటుంబ ఆస్తులు ప్రకటించే దమ్ము, ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. ఎన్ని ఏళ్లు పాదయాత్ర చేసినా జనం అతనిని నమ్మరని చెప్పారు. జగన్మోహన రెడ్డి తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీని ప్రశ్నించే దమ్ము జగన్‌కు లేదన్నారు. ప్రత్యేక హోదాపై ప్రశ్నించే దమ్ములేదన్నారు. రాజధానిని అడ్డుకున్నారని, ఉపాధి హామీ నిధులు కూడా రాకుండా అడ్డుపడటానికి లేఖలు రాసిన ఘనాపాటి అని విమర్శించారు. 2019లో రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు 150 సీట్లు ఇస్తారని, జగన్మోహన రెడ్డికి ఉన్న సీట్లు కూడా ఊడగొట్టి ఇంట్లో కూర్చోబెడతారని అన్నారు. అవినీతి పత్రికలో తప్పుడు రాతలు, అవినీతి టీవీలో తప్పుడు ప్రచారం చేయడం వల్ల వారికే ఓట్లు రావని, నష్టపోతారని మంత్రి వుల్లారావు హెచ్చరించారు.

కళలను పరిరక్షించడమే ధ్యేయం మంత్రి ఆదినారాయణరెడ్డి



విజయవాడ, సూర్య బ్యూరో : మరుగునపడుతున్న మన కళలను వెలికితీసేందుకు ఎక్కడో ఉన్న తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) బృం దం రాజధాని కళోత్సవం పేరుతో సంబరాలను నిర్వహించడం అభినంద నీయమని, తానా సభ్యులే కాకుండా ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ మన కళలను, కళాకారులను ఆదరించాలని రాష్ట్ర హార్టికల్చర్ శాకా మంత్రి ఆదినారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. శాసనసభ్యులు గద్దె రామమోహన్, బోడె ప్రసాద్ మాట్లాడుతూ తానా బృందం రాజధాని ప్రాంతంలో కళలను ప్రోత్సహించాలన ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. తానా అధ్యక్షులు సతీష్ వేమన మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచలోనే ఎంతో గొప్పవని, అయితే ఇవి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వాటిని పరిరక్షించాలనే ఉద్దేశంతోనే ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామన్నారు.. అనంతరం 50 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తానా సభ్యులు, అమరావతి బోటింగ్ క్లబ్ చైర్మన్ తరుణ్ కాకాని, తానా సభ్యులు దేవినేని లక్ష్మి, విజయలక్ష్మి, ఈవెంట్స్ కో ఆర్డినేటర్ రాజా సూరపనేని తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నిర్ణయం సాహసోపేతమైనది: కన్నా



అమరావతి, సూర్య బ్యూరో : నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్య క్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. అగ్ర వర్ణాల్లోని పేదలకు (ఈబీసీ) 10 శాతం రిజర్వే షన్ కల్పిస్తూ మోదీ చేసిన ప్రకటనపై స్పందిం చిన ఆయన మాట్లాడుతూ 10 శాతం రిజర్వేష న్లతో అగ్రవర్ణాల్లోని పేదలకు భరోసా అని అన్నారు. 70 ఏళ్లలో ఏ ప్రధానమంత్రి తీసుకోని నిర్ణయం మోదీ తీసుకున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు అదుపులోపెట్టుకుని మాట్లాడాలన్నారు. పోలవరం నిర్మాణంలో నాణ్యతను గాలికొదిలి, ప్రచారం కోసం చంద్రబాబు పాకులాడుతున్నారని కన్నా విమర్శించారు.

శ్రీవారి దర్శించుకున్న 'యన్‌టిఆర్' చిత్ర బృందం

తిరుమల, సూర్య ప్రతినిధి : తిరుమల శ్రీవారిని 'యన్‌టిఆర్ కథానాయకుడు' చిత్ర బృందం దర్శించుకుంది. నటుడు నందమూరి బాలకష్ణ, విద్యాబాలన్, సుమంత్, సాయి కొర్రపాటి తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో ఆలయానికి చేరుకున్న బందానికి టీటీడీ ఛైర్మన్ వుట్టా సుధాకర్ యాదవ్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో చిత్ర బృందం ఆలయ పండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. 'యన్‌టిఆర్ కథానాయకుడు' చిత్రం బుధవారం విడుదలవుతున్న కారణంగా స్వామివారి ఆశీస్సుల కోసం వచ్చామని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు బాలకష్ణ తెలిపారు.

జగన్‌కు సీఎం కుర్చీ తప్ప మంచి కనబడదు

మంత్రి దేవినేని ఉమా

విజయవాడ, సూర్య బ్యూరో : పోలవరం ప్రాజెక్టు గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కడం చాలా సంతోషంగా ఉందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖ విడిది కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కరోజు వ్యవధిలో 32,315.5 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేయడం గొప్ప విషయమని చెప్పారు. దేశమంతా తెలుగువాడి సత్తాను అభినందిస్తుంటే వైసీపీ అధ్యక్షుడు జగన్ ఓర్వలేక పోతున్నారని, గిన్నిస్ రికార్డు పేరుతో నాటకం అంటూ తన అవినీతి పత్రికలో విషం చిమ్మడం దుర్మార్గమని మంత్రి విమర్శించారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మంచిని కూడా అంగీకరించలేని మానసికవ్యాధితో జగన్ బాధ పడుతున్నారన్నారు. వేలాదిమంది కార్మికులు, ఇంజనీర్ల 24 గంటల శ్రమను జగన్ అవమానించారని ఆరోపించారు.

రామాయపట్నం పోర్టుకు సీఎం శంకుస్థాపన


విజయవాడ, సూర్య బ్యూరో : రామాయపట్నం పోర్టు శంకుస్థాపనతో పరిసర ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రజలకు పెద్ద ఎత్తున ఉపాధి లభించనుందని ఏపి ఓడరేవుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం రేరా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఏపి పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఉలవపాడులో రామాయపట్నం పోర్టు నిర్మాణానికి బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపి మారిటైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్గను సృష్టించి మైనర్ పోర్టు నిర్మాణానికి సంకల్పించిందన్నారు. బ్రేక్ వాటర్ 4.9 కిలోమీటర్లతో ఈ పోర్టు నిర్మాణం జరుగుతుందని, 5 వేల కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్నామన్నారు. ఈ పోర్టుతో అనుబంధ పరిశ్రమలు చాలా రానున్నాయని అందులో ఏషియా పేపర్ మిల్స్ 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించడంతో పాటు మెట్ట ప్రాంతాలలో పండించే సరుగుడు, జామాయిల్ పండించే రైతులకు ఊరట వచ్చి మంచి ధర లభిస్తుందన్నారు. పోర్టుకు అనుబంధంగా స్టీల్ ప్లాంట్ కూడా రానుందన్నారు. సిమెంట్ పరిశ్రమతో ఇప్పటికే ఎంవోయు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. కాకినాడ గ్రూప్ క్రింద ఉన్న నాలుగు ఓడరేవులతో యేటా వచ్చే రూ.150 కోట్ల ఆదాయం రామాయపట్నం ఓడరేవుకు మళ్లించి భారీ ఓడరేవుకు పెట్టుబడులను సమీకరించే విధంగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ పోర్టు మద్రాస్ నేషన్ హైవేకి దగ్గరగా, దొనకొండ ఇండస్ట్రియల్ క్లస్టర్, నేషనల్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ సంస్థలతో అదనంగా అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. మత్స్యకారులకు తోడ్పాటును అందించేందుకు అంతర్గతంగా ఫిషింగ్ హార్బర్‌ను నిర్మిస్తున్నామన్నారు. పోర్టు నిర్మాణం జరిగితే పారిశ్రామిక రంగంలో పరిసర ప్రాంతాలలో అభివృద్ధి జరుగుతుందన్నారు. పోర్టుకు జనవరి 2020లో టెండర్లు పిలుస్తామని, టెండర్లు పిలిచిన సంవత్స రంలోపూ పూర్తి చేసే విధంగా కృషి చేస్తామ న్నారు. 3,500 ఎకరాలు భూసేకరణ పోర్టు కోసం చేయాల్సి ఉందన్నారు. రామాయపట్నంకు ఒక చర్త్రి ఉందని తెలిపారు. మచిలీపట్నం పోర్టు ఈ నెలాఖరుకు శంఖుస్థాపన చేసే అవకాశం ఉందని, ఈ నెలలోనే నాలుగు ఓడరేవుల పనులు కార్యరూపం దాల్చుతాయన్నారు.



నేడే ప్రకాశం అభివృద్ధికి పునాది రాయి




- సిఎం చేతుల మీదగా రామాయపట్నం పోర్టు, పేపర్ మిల్లుకు శంఖుస్థాపన
- ప్రభుత్వ సొంత నిధులతో పోర్టు నిర్మాణం
- 2022 నాటికి జిల్లావాసులకు అందుబాటులోకి ఓడరేవు
- చిరకాల జిల్లావాసుల కల చంద్రబాబుతో సాకారం
- పోర్టు నిర్మాణంతో శరవేగంగా అభివృద్ధి చెందనున్న ప్రకాశం
- ఉద్యోగ, ఉపాథే లక్ష్యంగా జిల్లాపై సిఎం ప్రత్యేక దృష్టి
- త్వరలో పరిశ్రమల స్థాపనతో దొనకొండ ప్రాంతం సశ్యశ్యామలం
- నేడు ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి మీడియాతో రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు



ఒంగోలు, మేజర్‌న్యూస్ ః ప్రకాశం జిల్లా ప్రజల చిరకాల కోరిక రామాయపట్నం ఓడరేవు తీరనున్నదని రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్ధా రాఘవరావు వెల్లడించారు. మంగళవారం స్థానిక ఒంగోలులోని రాష్ట్ర అటవీశాఖ మంత్రి నివాసంలో మంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్ధా రాఘవరావు మాట్లాడుతూ ప్రకాశము జిల్లా వెనుకబడ్డ ప్రాంతమని జిల్లాను అభివద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రామాయపట్నం ఓడరేవు ను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారన్నారు. ప్రకాశము జిల్లాకు ఓడరేవు వస్తే రెవెన్యూ పెరుగుతుందని ఆయన అన్నారు. ప్రకాశము జిల్లాలో రామాయపట్నం ఓడరేవు నిర్మాణం వల్ల ఈ ప్రాంతము వేగవంతంగా అభివద్ధి చెందుతుందన్నారు. రామాయపట్నం ఓడరేవులో 2 లక్షల టన్నుల షిప్పింగ్ సామర్థ్యం ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడము జరిగిందన్నారు. రామాయపట్నం ఓడరేవులో 10 బెర్తులతో ఉండే విధముగా నిర్మాణం చేపట్టడము జరుగుతుఈదని ఆయన చెప్పారు. రామాయపట్నం ఓడరేవు నిర్మాణం కోసం రామాయపట్నం, రావురు, చెవురూలో 3 వేల ఎకరాలు భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడము జరిగిందన్నారు. రైట్స్ సంస్థ 2016 సంవత్సరంలో రామాయపట్నంలో ఓడరేవు నిర్మాణం చేపట్టడానికి అవకాశం ఉందని ప్రతి పాదనలు ఇవ్వడం జరిగింది ఆయన చెప్పారు. ప్రకాశము జిల్లాలో రామాయపట్నం ఓడరేవు రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలో ఉద్యాన వన యూనివర్సిటీకి, చిరు ధాన్యాలు పరిశోధన కేంద్రానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు అయన చెప్పారు. ప్రకాశము జిల్లాలో రామాయపట్నం ఓడరేవు నిర్మాణం ప్రతిపాదనలు డి.పి.ఆర్.లు జూన్ 2019 నాటికి తయారు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. 2019 డిసెంబరు నాటికి టెండర్లు ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. 2020 నాటికి ఓడరేవు పనులు ప్రారంభించడము జరుగుతుందన్నారు. 2022 నాటికి రామాయపట్నం ఓడరేవు ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రకాశము జిల్లాలో రామాయపట్నంలో 24,500 కోట్ల రూపాయలతో ఇండో నేషియన్ పేపర్ ఫుల్ఫ్ సంస్థ పేపర్ మిల్లు ను ఏర్పాటు చేయాలని రేవు రామాయపట్నంలొ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఎం. ఓ.యూ. లు చేసుకోవడము జరుగుతుందన్నారు. జిల్లాలో పేపర్ మిల్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రత్యేక గా15 వేల మందికి ఉద్యోగ అవకాశాలు, పరోక్షంగా50 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. రామాయపట్నంలో భారీ పేపర్ మిల్లు ఏర్పాటు చేయాలని మొదటి దశలో 24,500 కోట్లు రూపాయలు రెండవ దశలో 6500 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ప్రకాశము జిల్లాలో పేపర్ పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల సుబాబుల్, జామాయిల్, సర్వీ పంటల రైతులకు ఇబ్బందులు ఉండవని ఆయన చెప్పారు. జిల్లాలో ఈ రెండు ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేవు శంఖుస్థాపనల్ చేస్తారని అయన అన్నారు. దొనకొండలో 286 చిన్న ,మధ్య తరహా పరిశ్రమలు పెట్టడానికి70 ఎకరాలు భూమి ని కేటాయించడము జరిగిందన్నారు. ఇప్పటికే 200 పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి బుక్ చేసుకున్నారన్నారు. జిల్లాలో ప్రజలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయం చేయాలని ఆయన కోరారు.

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు : నారా లోకేష్



కర్నూలు, సూర్య ప్రతినిధి : రాష్ట్రాభివద్ధిని ప్రతిపక్షనేత జగన్, ప్రధాని మోదీ అడ్డుకుంటున్నారని మంత్రి నారా లోకేష్ ఆరోపిం చారు. ప్రతిపక్షనేత జగన్, ప్రధాని మోదీ తోడు దొంగలని మంత్రి లోకేష్ వ్యాఖ్యానించారు. వైసీపీ కార్యకర్త ఒకరు జగన్‌పై దాడి చేస్తే చంద్రబాబు చేయించారని కోడి కత్తి డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అభివద్ధి చేస్తున్న చంద్రబాబుపై బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇదేనా బీజేపీ సంస్కారం? అని ప్రశ్నించారు. మంత్రాలయం నియోజకవర్గం అభివద్ధికి నిధులు కావాలని వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఏనాడు అడగలేదని విమర్శించారు.

వాహనాల విడిభాగాల తయారీ రూ.300 కోట్లు పెట్టుబడులు



వెలగపూడి సచివాలయప్రతినిధి : రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు లైట్ ఆటో కంపోనెంట్ ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ బాల ఆనంద్ జాలాది, సీఎస్ అనిల్ చంద్ర వునేఠా, ఎకనమిక్ డెవలప్ మెండ్ బోర్డ్ సీఈవో జాస్తి కృఎష్ణ కిషోర్ సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకున్నారు. వాహనాల విడిభాగాల తయారీలో రూ.300 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు లైట్ ఆటో ముందుకు వచ్చింది. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఏదో ఒక ప్రాంతంలో కంపెనీ పెట్టుబడులు పెట్టనుంది. మొదటి దశలో రూ.100 కోట్లు, రెండవ దశలో రూ.200 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా మరో 350 మందికి ఉపాధి కల్పించనున్నట్లు కంపెనీ ఎండీ తెలిపారు. ప్రధానంగా ఈ కంపెనీలో అల్యూమినియానికి ప్రత్యామ్నాయంగా మెగ్నీషియంతో వాహనాల విడిభాగాలు తయారు చేయనున్నారు. మెగ్నీషియంతో వాహనాల విడిభాగాలు తయారు చేయడం వల్ల వాహనాల బరువు తగ్గడంతోపాటు, ఇంధన సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని కంపెనీ సీఈవో సుభాచరణ్ మీడియాకు వెల్లడించారు.

సిద్ధాంత బలం లేని పార్టీలకు మనుగడ ఉండదు

- టీడీపీ, వైసీపీలకి ఎలాంటి సిద్ధాంతాలు లేవు
- రాజకీయాల్లో ఓ స్థాయికి రావాలంటే దశాబ్దం పడుతుంది
- లాంగ్ టర్మ్ విజన్ తోనే రాజకీయాల్లో రాణింపు సాధ్యం
- పండగలోపు స్వల్పకాలిక కమిటీల ప్రకటన
- కర్నూలు జిల్లా సమీక్షా సమావేశంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్



కర్నూలు జిల్లా సమీక్షా సమావేశంలో జనసేన అధ్యక్షులుపవన్కళ్యాణ్‌సిద్ధాంత బలం లేకుండా కేవలం నాయకుల బలం మీద ఆధారపడి నడిచే పార్టీలు ఎక్కువ కాలం మనుగడ సాధించలేవనీ, తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలే అందుకు ఉదాహరణ అని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. జనసేన పార్టీ మాత్రం చాలా బలమైన సిద్ధాంతాలు ఉన్న పార్టీ అని తెలిపారు. జిల్లా స్థాయి సమీక్షా సమావేశాల్లో భాగంగా కర్నూలు జిల్లాకి చెందిన నాయకులు, కార్యకర్తలకి విడివిడిగా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీ పవన్కళ్యాణ్ గారు మాట్లాడుతూ.. 2019 ఎన్నికలు జనసేనకు మొదటి పోరాటమే. ఇదే ఆఖరి పోరాటం కాదు. రాజకీయాల్లో ఓ స్థాయికి రావాలంటే కనీసం ఓ దశాబ్దం ఓపిక ఉండాలి. కొత్త నాయకత్వం రావాల్సిన సమయం ఆసన్నమైంది. అయితే కొత్తవారు ఎంత వరకు నిలబడతారు అన్నదే అసలు సమస్య. దెబ్బ కొడితే అంతకు మించి బలమైన పోరాటం చేసే శక్తి ఉన్న వారు కావాలి. అలాంటి వారిని గుర్తించాలంటే, తయారు చేయాలంటే సమయం కావాలి. కర్నూలు జిల్లాతో నాకున్న అనుబంధం ఈనాటిది కాదు. అయితే హత్తిబెళగళ్ పేలుళ్లు జరిగినప్పుడు బాధితుల్ని పరామర్శించేందుకు బయలు దేరినప్పుడు కర్నూలు వస్తున్నారు.. జనం రారని చెప్పారు. కానీ రోడ్లు పట్టనంత జనం వచ్చినప్పుడు సగటు కుటుంబాలు ఏ స్థాయిలో మార్పు కోరుకుంటున్నాయో అర్ధం అయ్యింది. 2009లో ఎక్కువ శాతం సీనియర్ లీడర్లే వచ్చారు. కొత్త వారిలో కసి ఉంటుంది కానీ సరైన వ్యూహం ఉండదు. ప్రవహించే నదిలోనూ పవర్ ఉంటుంది. దాన్ని వెలికి తీయాలంటే టర్బైన్లకి అనుసంధానం చేయాలి, ఓ ప్రక్రియ జరపాలి. ఓ క్రమ పద్ధతిలో వెలికి తీయాలి. వ్యవస్థని మార్చేయాలన్న లక్ష్యంతో ముందుకు వచ్చిన వారిని కూడా ఓ క్రమ పద్ధతిలో అనుసంధానం చేసి వారిలో ఉన్న కసిని వెలికితీయాలి. అది సమాజానికి ఉపయోగపడేలా తయారు చేయాలి. 2001 నుంచే ప్రజలు మార్పు కోరుకోవడాన్ని గమనించా. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ మీద విసుగుతో జనం మన వైపు చూస్తున్నారు. మనం ఏదో చేస్తామన్న ఆశతో మన కోసం వస్తున్నారు. వచ్చే జనాన్ని శక్తిగా మలచుకోవాలి. 2014లో అతికొద్ది మందితో పార్టీ ప్రారంభించాక, ఇంత మంది అభిమానం చూరగొనడానికి రాజకీయాలపై ఉన్న వ్యతిరేకతే కారణం. పాలకులు అందుబాటులో ఉన్న వనరుల్ని అందరికీ ఆమోదయోగ్యమయ్యే రీతిలో పంచితే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావు. అందరికీ సమానమైన రీతిలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే జనసేన లక్ష్యం. నాయకులకి కోట్ల రూపాయలు దోచేయడంలో ఉన్న తెలివితేటలు, శ్రద్ధ యువతకి ఉపాధి కల్పించడంలో ఉండవు. స్థానిక పరిస్థితులు అర్ధం చేసుకోకుండా రాజకీయాలు చేయలేం. కులాల కాన్సెప్ట్తో అసలు నడపలేం. నా బలం, బలహీనత రెండూ నాకు తెలిసినంతగా ఎవ్వరికీ తెలియదు. అందుకే నేను ఎలాంటి పరిస్థితులకి అయినా తట్టుకుని చాలా బలంగా నిలబడగలను. 2003 నుంచి రాజకీయాల కోసం పూర్తి స్థాయిలో సంసిద్ధమయ్యా. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినప్పుడు మెజారిటీ శాతం కొత్తవారే ఉండాలన్న లక్ష్యంతోనే 60 శాతం సీట్లు ఇస్తానని చెప్పా. సంక్రాంతి పండగ లోవు స్వల్పకాలిక కమిటీలు వేసి బాధ్యతలు అప్పగిస్తాం. అవసరం అనుకుంటే మధ్యలో మార్పుచేర్పులు చేద్దాం. యువతకి రాజకీయంగా ఎదగాలన్న కసి ఉన్నా పొలిటికల్ శక్తులు ఎదగనివ్వవు. కర్నూలు లాంటి జిల్లాల్లో అయితే ప్రజలు కుటుంబాల మధ్య నలిగిపోతున్నారు.

రాజకీయాల్లో రెండు రకాల శక్తులు ఉంటాయి. ఒకటి పాలసీ మేకింగ్ అయితే, రెండోది మాస్ ఫాలోయింగ్. జనసేనకి అన్నీ రెండు రకాల బలం ఉన్నవారు కావాలి. కొత్త పార్టీ అంటే అంతా కొత్త నాయకులే ఉన్నా నిలబడలేం. అనుభవం, మన సిద్ధాంతాలకి దగ్గరగా ఉన్న సీనియర్ల అవసరం కూడా ఉంది. 175 స్థానాల్లో పోటీపై నాకు స్పష్టత ఉంది. ఎన్ని స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలి అన్న అంశం మీదా స్పష్టత ఉంది.అన్నింటినీ దృష్టిలో పెట్టుకునే సుదీర్ఘ ప్రయాణానికి సిద్ధమయ్యా. అన్ని స్థానాల్లో గొప్పవారిని నిలబెట్టాలన్న కాంక్ష నాకూ ఉంది. గొప్ప అంటే ఆస్తిలో కాదు. గొప్ప ఆశయాలు ఉన్నవారిని. స్థానికంగా కూడా నాలా ఆలోచించే నా యకుల్ని తయారుచేయాలి. అందుకు కొంత సమయం పడుతుంది. లాం గ్టర్మ్ విజన్ ఉంటేనే రాజకీయాల్లో రాణింపు సాధ్యం. ప్రతి సమస్య మీదా నేను బలం గా మాట్లాడుతున్నా, పోరాటం చేస్తున్నా.. దాన్ని జనంలోకి తీసుకెళ్లేందుకు మన కి మీడియా లేదు. ఇన్ని వ్యతిరేక శక్తుల మధ్య పోరాటం చేస్తున్నాం.భావ జా లం ఉన్నవాడికి బలం ఉంటుంది. బాంబులు వేసినా చలించనంత బలం ఉం టుంది. అలాంటి బలం నా దగ్గర ఉంది. మన లక్ష్యం కోసం ఇప్పుడు పోరాటం చేద్దాం. అది తగ్గి పోరాటం చేయాల్సిన సమయంలో తగ్గే చేద్దాం. నిజమైన పోరాటం చేయాల్సినప్పుడు మీ అందరి కంటే ముందు నేనే నిలబడతానని అన్నారు.



ప్రజా వ్యతిరేక విధానాలవల్ల దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించింది : ఎఐటియుసి



విజయవాడ, సూర్య బ్యూరో : 8, 9 తారీఖులలో సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయటా నికి మంగళవారం 11 కేంద్ర ఉద్యోగసంఘాలు, కార్మిక సంఘాలు, ప్రైవేట్ సెక్టర్లపని చేయుచున్న కార్మికులు వేలాదిగా తరలివచ్చి ప్రదర్శనగా లెనిన్‌బొమ్మ దగ్గరికి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎఐటియుసి నాయకులు టి.తాతయ్య, జి.ఓబులేసు మాట్లాడుతూ కేంద్రంలోనే మోడీ ప్రభుత్వం బి.జె.పి.పాలిత రాష్ట్రాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల ప్రజా వ్యతిరేక విధానాలవల్ల దేశ ఆర్థిక పరిస్థితి దారుణంగా క్షీణించిందన్నారు. పల్లా సూర్యారావు మాట్లాడుతూ హమాలీ, ఆటో, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు, షాపులలో, తదితర రంగాలలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి సాంఘీక భద్రతా పథకాలను అమలుచేయాలన్నారు. ఎం.ఎ. గఫూర్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రం లోని కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. పొలాక్ మాట్లాడుతూ భవిష్యత్తులో కార్మిక పోరాటాలకు సిద్ధం కావాలని కోరినారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ టియుసి. విశ్వనాథరవి, ఎఐసిటియు సాంబశివరావు, నాయకులు ఎం.సాంబ శివరావు, సి.హెచ్.వి.రమణ, కె. నాగేశ్వరరావు, సి.హెచ్ శ్రీరామచంద్రమూర్తి, బోను శ్రీరాములు, జి.జనార్దన్, మణ్యం సుబ్బయ్య, సూన రాజు, శీలం సోమేశ్వరరావు, తంగిరాల రాజారావు, వై.శ్రీనివాసరావు, భరత్, పి.కోటేశ్వరరావు, స్టాలిన్, కె.సూరిబాబు, ఎస్.ఆంజనేయులు, మహిళా నాయకులు సుధారాణి, శైలజ తదితరులు సదస్సులో పాల్గొన్నారు.


వైసీపీకి ఘట్టమనేని ఆదిశేషగిరిరావు గుడ్‌బై



అమరావతి, సూర్య బ్యూరో : ఘట్టమనేని ఆదిశేషగిరిరావు త్వరలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకోన్నట్లు సమాచారం. చంద్రబాబు సమక్షంలో పసుపు కండువా కప్పుకోనున్నారు. వైసీపీకి సూపర్‌స్టార్ కష్ణ సోదరుడు, వైసీపీ క్రియాశీలక నేత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్‌కు పంపించారు. ఆదిశేషగిరిరావు వచ్చే ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని ఆయన అనుకొన్నారు. అయితే, వైసీపీ అధినేత జగన్ ఆయనను విజయవాడ ఎంపీగా పోటీ చేయాలని ప్రతిపాదించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆదిశేషగిరిరావు వైసీపీని వీడాలని నిర్ణయించుకొన్నారు. సీఎం చంద్రబాబుకు ఆదిశేషగిరిరావు దగ్గర బంధువు. తన సోదరుడు సూపర్‌స్టార్ కష్ణ అల్లుడు జయదేవ్ టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయినా, బంధుత్వాన్ని పక్కనపెట్టి మరీ వైసీపీ విజయానికి 2014లో ఆయన కషి చేశారు.

‘జేపీ’ రిపోర్టు కేంద్రానికి చెంప పెట్టు

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు
- ఏపీకి కేంద్రం చేస్తున్న అన్యాయం బట్టబయలు
- ప్రధాని నరేంద్రమోడివన్నీ అబద్ధాలే
- వారెప్పుడైనా అసెంబ్లీకి వస్తే కదా నిజాలు తెలిసేది
- ప్రతిపక్ష నేతలపై కుటుంబరావు ఫైర్



(వెలగపూడి సూర్య ప్రత్యేక ప్రతినిధి) :ఏపీ వునర్ వ్యవస్థీకరణ చట్టం, సంబంధిత హామీల అమలుపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతప్త్రంలోని అంశాలు నిజమేనని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ నేతత్వంలోని నివుణుల కమిటీ విడుదల చేసిన నివేదికతో రుజువైందని, ఇది కేంద్రానికి చెంప పెట్టువంటిదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు అన్నారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయం బట్టబయలైందన్నారు. రాష్ట్రంలోని ఏడు వెనుకబడి జిల్లాలకు ఇవ్వాల్సిన రూ.750 కోట్లు తక్షణమే చెల్లించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడి అధ్యక్షునిగా ఉన్న నీతి అయోగ్ స్పష్టం చేసిందన్నారు. ఏపీకి అన్ని చెల్లించేశామంటూ చెబుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోడి నీతి అయోగ్ సభ్యులను డిస్మస్ చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ వునర్ వ్యవస్థీకరణ చట్టం, సంబంధిత హామీల అమలుపై గత నెల 23వ తేదీన విడుదల చేసిన శ్వేతప్త్రంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి ఏపీకి రూ.90 వేల కోట్లు రావాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందన్నారు. కేంద్ర నుంచి ఏపీకి రావాల్సిన నిధులపై జయప్రకాశ్ నారాయణ నేతత్వంలోని ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ విడుదల చేసిన, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతప్త్రం చిన్న చిన్న అంశాలు మినహా ఒకేలా ఉన్నాయన్నారు. ఈ రెండింటి లెక్కలతో ఏపీకి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయం బట్టబయలైందన్నారు. జేపీ రిపోర్టును కూడా తప్పుబడతారా?... 201520 మధ్య ఏపీ రెవెన్యూ లోటు రూ.22,113 కోట్లు అని, అదే సమయంలో తెలంగాణా రూ.1,17,000 కోట్ల మిగులు రెవెన్యూ కలిగి ఉంటుందని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని, రాష్ట్ర విభజనకు ఇదేనా హేతుబద్ధత అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా, రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్ ఖండ్గ తరహాలో ప్యాకేజీ ఇవ్వాలని14వ ఆర్థిక సంఘం చెప్పిందన్నారు. జేపీ నేత త్వంలోని ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థలో జస్టిస్ పర్వతరావు, కె.పద్మనాభయ్య, కాకి మాధవరావు, ప్రొఫెసర్ ఆర్.రాధాక ష్ణ, అజేయ కల్లాం, ప్రొఫెసర్ ఎస్.గలాబ్‌తో పాటు 13, 14వ ఆర్థిక సంఘ సభ్యులుగా ఉన్నారన్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం తరవున అన్ని వివరాలూ అందజేశామన్నారు. కేంద్రానికి ఈ రిపోర్టు ఒక చెంప పెట్టు అని అన్నారు.

అబద్ధాలు చెబుతున్న నరేంద్రమోడి:రాష్ట్రంలోని వెనుకబడి ప్రాంతాలకు రూ.24 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం నేటి వరకూ రూ.1,050 కోట్లు మ్త్రామే మంజూరు చేసిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు తెలిపారు. తక్షణమే రూ.750 కోట్లు చెల్లించాలని కేంద్రానికి ప్రధానమంత్రి అధ్యక్షునిగా ఉన్న నీతి అయోగ్ నివేదిక అందజేసిందన్నారు. ఏపీకి అన్నీ ఇచ్చేశామంటున్న ప్రధానమంత్రి నరేంద్రమోడి ఏం సమాధానం చెబుతారని ఆయన నిలదీశారు. నీతి అయోగ్ నివేదిక అసత్యమైతే, ఆ సంస్థ సభ్యులను డిస్మస్ చేస్తారా? అని పీఎం నరేంద్రమోడిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు ప్రశ్నించారు.

ఏపీకి తెలంగాణా రూ.5 వేల కోట్ల బకాయి:2015-20 మధ్య ఏపీ రెవెన్యూలోటు రూ.22,113 కోట్లు ఉంటుందని 14వ ఆర్థిక సంఘం చెబితే, తెలంగాణా ముఖ్యమంత్రి హేళనగా మాట్లాడడం తగదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు హితవు పలికారు. ఏపీ విద్యుత్ సంస్థలకు తెలంగాణా ప్రభుత్వం రూ.5 వేల కోట్ల బకాయి ఉందని, ఇదే విషయమై జాతీయ కంపెనీలా ట్రిబ్యునల్ (ఎన్.సి.ఎల్.టి.)లో కేసు నడుస్తున్న విషయం నిజమా...కాదా..? అని ఆయన ప్రశ్నించారు.

అసెంబ్లీకి వస్తే కదా నిజాలు తెలిసేది:శ్వేతపత్రాలతో ప్రభుత్వ విజయాలను ప్రజల దగ్గరుకు తీసుకెళుతుంటే, ప్రతిపక్ష వైసీపీ నేతలు ఓర్వలేకపోతున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు విమర్శించారు. శ్వేతపత్రాల్లోని నిజాలను దష్టి మరల్చడానికే అబద్ధవు వుస్తకాలు ముద్రిస్తున్నారన్నారు. ఆ వుస్తకాల్లో 0.1 శాతం కూడా వాస్తవం ఉండదన్నారు. శ్వేతపత్రాల్లో అవాస్తవాలు ఉంటే పోలిస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయొచ్చునన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాటలు చూస్తుంటే, భారతదేశంలో భూభాగంగా ఏపీని చూడడంలేదని అర్ధమవుతోందన్నారు. రోజు రోజుకూ ఆంధ్రప్రదేశ్ పై కేంద్ర ప్రభుత్వం శ్త్రుత్వం పెంచుకుంటోందన్నారు. జాతీయ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ఇదే విషయంపై సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తిరిగి నియమిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రుజువు చేసిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు అన్నారు.

సంస్కృతి పరిరక్షణలో శిల్పారామాలది కీలక భూమిక



శిల్పారామం క్యాలెండర్ ఆవిష్కరించిన ముఖేష్

విజయవాడ, సూర్య బ్యూరో :శిల్పారామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ శిల్పారామం, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చరల్ సొసైటీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు. రూ.20 కోట్ల వ్యయంతో శిల్పారామాల అభివృఎద్ధి పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్లో ఆంధ్రప్రదేశ్ శిల్పారామం, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చరల్ సొసైటీ రూపొందించిన క్యాలెండర్ను మీనా ఆవిష్కరించారు. సొసైటీ సిఇఓ జయరాజ్తో పాటు పర్యాటక శాఖ పిఎంయు విభాగ ప్రత్యేక అధికారి లక్ష్మణ మూర్తి, శిల్పారామం ఉన్నతాధికారులు గురు ప్రసాద్, భక్తర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శిల్పారామాలను స్వయం పోషకాలుగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని ఈ సందర్భంగా మీనా అధికారులను అదేశించారు. నవ్యాంధ్రలో శిల్పారామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి జనరంజకంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని, అయితే స్థానిక పరిస్థితులను అనుసరించి, అక్కడి వాస్తవ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని స్పష్టం చేసారు.

నడకే మంత్రం

పూర్తయిన ప్రజా సంకల్పం



కడపజిల్లా ఇడుపులపాయలో ప్రారంభమైన అడుగులు ఇచ్ఛాపురంలో నేటితో ఉపసమనం పొందనున్నాయి. 2017 నంబర్ ఆరో తేదీన నెలకొన్న పండుగ వాతావరణంను మరిపించేలా ఇచ్ఛాపురం వేదికగా వైసీపీ శ్రేణుల వేడుక మరికొన్ని గడియల్లో ప్రారంభంకానున్నది. జనంనాడి పట్టేందుకు, సమస్యలతో సతమతమవుతూ అలసిన ప్రాణాలకు అభయమిస్తూ వైసీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పం నేటితో నెరవేరబోతోంది. ఈ ప్రజా సంకల్పయాత్ర అటు పార్టీ శ్రేణుల్లోనూ, ఇటు ఉపసమనం కోసం ఎదురుచూస్తున్న ప్రజానీకంలోనూ భవిష్యత్ భరోసాను నింపడంలో జగన్ చేసిన ఈ పాదయాత్రతో సఫలమైంది.

ప్రజా సంకల్పయాత్ర పేరుతో వైసీపీ అధినేత వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన సుధీర్ఘ పాదయాత్ర చరిత్రలో మూడు సంవత్సరాలు కీలక భూమిక పోషించాయి. 2017 నవంబర్‌లో 6న ప్రారంభమైన పాదయాత్ర 2019 జనవరి 9వ తేదీతో తుది అంకాన్ని పూర్తిచేసుకొంటోంది. సుధీర్ఘంగా చేపట్టిన పాదయాత్రలో ఏ బాటసారికి కలగని అనుభవాలు, ప్రజానాడే పట్టే అవకాశం వైసీపీ అధినేత వై.ఎస్.జగన్‌కు ఈ ప్రజా సంకల్పయాత్ర ద్వారా వరించందని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అనేక సామాజిక వర్గాలు, విద్యార్థి, యువత, మహిళా, వృద్దులతోపాటు రైతాంగం, ఉద్యోగయంత్రాంగం, నిరుద్యోగులు, వికలాంగులు, వివిధ సామాజిక వర్గాలు ఇలా అన్ని వర్గాలతో మమేకమయ్యే అర దైన వరాన్ని వైసీపీ అధినేత దక్కించుకొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లోని 13జిల్లాలలో తన పాదయాత్ర పూర్తి చేసుకొని నేడు ఇచ్ఛాపురంలో సంబరాలకు వైసీపీ నాయకత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే 12 జిల్లాలలో యాత్ర పూర్తి చేసుకొని చివరి జిల్లా అయిన 13వ జిల్లా శ్రీకాకుళంలో పాదయాత్రతో 136 నియోజకవర్గాలలో జగన్ యాత్ర పూర్తిచేశారు. ఈ యాత్రంలో ఆయన మొత్తంలో మొత్తం 123 సభలు, సమావేశాలు,42 ఆత్మీయ సమ్మేళనా లను నిర్వహిం చిన ఆలుపెరగక అడుగులు ఎయటం విశేషం.

నేనొస్తా...న్యాయం చేస్తా

ఎవరు ఏ సమస్యతో వచ్చినా ఓర్పుతో వినడం...ఆ తరువాత "నేనోస్తా...మీకు న్యాయం చేస్తా" అని జగన్మోహన్‌రెడ్డి నోట వచ్చిన మాట అణగారిన, అలసిన ప్రాణాలకు ఓ తెలియని భరోసా. ఇదే ప్రజా సంకల్పయాత్రకు విశేష ఆదరణ ఇచ్చింది. ఈ పాద యాత్రతో జనంలోకి వెళ్లడమే కాకుండా అనేక సామాజిక వర్గాలకు వైసీపీ అధినేత జగన్ దగ్గరయ్యారయ్యారనే చెప్పాలి

వివిధ వర్గాలతో సమావేశాలు

జగన్ తన పాదయాత్రలో చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని కల్లూరు వద్ద ముస్లిం మైనారిటీలతో, అదే జిల్లా శ్రీకాళహస్తిలోని పాపనాయుడుపేట వద్ద బీసీలతో, నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలిచేడుకు ముందు శివారులో చేనేత కార్మికులతో, అదే జిల్లా దేవరపాలెం ప్రారంభ శివారులో వైశ్యులతో, ఉదయ గిరికి చెందిన హస్త కళాకారులతో ఆత్మీయ సమ్మేళనాలు, తమ సమస్యలు చెప్పుకొనేందుకు తండోపతండాలుగావచ్చిన వారితో ముఖాముఖీలు ఇలా తన పాదయాత్రలో నిత్యం ఉండేలా చేసుకొని తనదైన శైలీలో అన్నివర్గాల ప్రజలకు దగ్గరై రాష్ట్ర జనాభాలో మెజార్టీ జనాభాకు ఆయన చేరువయ్యారు.

జనంతోనే జగన్....

ఓ వైపు ఆత్మీయసమ్మేళనాలు నిర్వహిస్తూనే సభలలో తన ధీటైన ఉపన్యాసాలతో, తెలుగుదేశం పార్టీపై తీవ్రవిమర్శలతో దూసుకుపోయారు. యాత్రలో తనకు ఎదురుపడ్డ కార్మిక, శ్రామిక వర్గాలతోనూ ఆయన మాటా మంతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కులం, మతం వర్గం అని బేధాలు లేకుండా తనదైన తీరుగా అందరిలోనూ భరోసా ఇవ్వడటంతో పాటు పార్టీ శ్రేణులలో స్ఫూర్తి నింపుతూ ముందుకు సాగాడాయన

రైతుకు భరోసా

చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని తిమ్మ రాజుపల్లి ఎన్ఆర్ కమ్మపల్లిలో జగన్ కాసేపు పొలాల్లో రైతులతో కలిసి కలివిడిగా తిరిగారు. మినీ ట్రాక్టర్ నడిపిన ఆయన వరి నాట్లు వేశారు. చంద్రగిరి నియోజకవర్గంలోని నెమ్మళ్లగుంటపల్లి వద్ద వై.ఎస్.జగన్ రైతులతో ముఖాముఖి నిర్వహించి అధికారంలోకి రాగానే రైతాంగాన్ని ఆదుకునేలా ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెడతానని చెప్పారు. అనంతర పాదయాత్రలో రైతాంగానికి తెలంగాణలో ప్రవేశ పెట్టిన రైతు బందు తరహాలో స్కీమ్ ప్రవేశ పెడతానని చెప్పారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని రైతు నాయకులు హర్షాతిరేకాలు కనిపించడంతో రానున్న ఎన్నికలలో తమపార్టీకి వీరంతా అండగా నిలుస్తారన్న భావన వైసిపి శ్రేణులలో కనిపించింది.

పాదయాత్ర సాగిందిలా :


ప్రజా సంకల్ప పాదయాత్రలో తన నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం శివారుకి 1000 కి.మీ, పూర్తి చేసుకోవటంతో వైఎస్సార్ శ్రేణులు కైవల్య నది పక్కన నిర్మించిన 25 అడుగుల విజయ సంకల్ప స్థూపంను ఆవిష్కరించారు. ప్రకాశం జిల్లా నందనమారెళ్ల వద్ద జగన్ తన పాదయాత్రలో 1300 కి.మీ పూర్తి చేసుకోగా చీమకుర్తిలో పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకుంది. ఆపై గుంటూరు కృష్ణా జిల్లాల మీదుగా పశ్చిమ గోదావరిలోకి చేరిన పాద యాత్ర ఏలూరు నియోజకవర్గం, వెంకటాపురం 2000 కి.మీ, దాటింది. ఇక తూర్పు గోదావరి జిల్లా లక్కవరం క్రాస్ వద్ద 2400 కి.మీ పూర్తి చేసుకొని, అమలాపురం వద్ద200వ రోజుకు పాదయాత్ర చేరుకొగా, ప్రజా సంకల్పయాత్రలో 100వ నియోజకవర్గంగా జగ్గంపేట నిలిచింది. తుని పట్టణంలోని వద్ద పాదయాత్ర 2700 కి.మీ,లకు చేరటంతో విశాఖ జిల్లాలోకి ప్రవేశించిన ప్రజా సంకల్పయాత్ర. నర్సీపట్నం నియోజకవర్గంలోకి అడుగు పెట్టారు. ఆపై అనకాపల్లిలో 250వ రోజును పాదయాత్ర పూర్తిచేసుకొంది. విజయనగరంలోని కొత్తవలస మండలం, దేశపాత్రునిపాలెం వద్ద 3000 కి.మీ పూర్తి చేసుకోగా. పార్వతీపురం నియోజకవర్గంలో 300వ రోజునుప్రజాసంకల్పయాత్ర చేసారు. అక్కడి నుంచి వీరఘట్టాం మండలం ద్వారా శ్రీకాకుళం జిల్లలోకి ప్రవేశించారాయన. టెక్కలి నియోజకవర్గంలోని రావివలస శివారులో 3500 కి.మీ ప్రస్థానం పూర్తిచేసుకొంది. నేడు శ్రీకాకుళం, ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లాలలో పాదయాత్ర పూర్తి కానుంది. నేటితో ఈ పాదయాత్ర 3,648 కిలోమీటర్ల మైలు రాయిని చేరుకుందని వైఎస్ఆర్ పార్టీ శ్రేణులు చెపుతున్నాయి.

ప్రతి చోటా ఓ వరం

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా తన పాదయాత్రలో వైసీపీ అధినేత అడుగెట్టన ప్రతి చోట తమ వద్దకు వచ్చిన వివిధ సామాజిక వర్గాలకు ఓ వరం ప్రకటించారు. వీటన్నింటినీ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తానని స్పష్టమైన హామీని ఇచ్చారు. ప్రజల్లో ధీమా నింపే ప్రయత్నం చేశారు. పెన్షన్లు, ఇళ్ల మంజూరుకై మెజార్టీ ప్రజల నుంచి విన్నపాలు వెల్లువెత్తగా తమ సమస్యలూ పరిష్కరిం చండి అంటూ ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, అసంఘటిత కార్మికులు ఇలా ఎవరు తన వద్దకు వచ్చిన వై.ఎస్.జగన్ ఇచ్చిన వరంతో తెలియని ధీవ ఇచ్చారు. వైసీపీ ప్రకటించిన నవరత్నాల హామీ ద్వారా ప్రజలకు భరోసా కల్పించారు. ఇవే కాకుండా పాదయాత్రలో తన దృష్టికి వచ్చే సమస్యలపైనా తాము అధికారంలోకి రాగానే ఎలాంటి చర్యలు తీసుకుంటామో జగన్ స్పష్టంగా వివరించే ప్రయత్నం చేశారు. కాపుల రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో పాటు వారిని ఆదుకునేందుకు కాపు కార్పొరేషన్‌కు ఏటా రూ.10 వేల కోట్ల నిధిని సమకూరుస్తామని ప్రతిపక్ష నేత ప్రకటన చేశారు.

సీమలో మొదలై సిక్కోలులో ముగింపు

2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో ప్రారంభమైన జగన్ పాదయాత్ర 2019 జనవరి 9న సిక్కోలులో ముగిస్తోంది. ఈ కీలక ఘట్టానికి ఇచ్ఛాపురం వేదిక కానున్నది. ఈ సందర్భంగా భారీ పైలాన్‌ని ఆవిష్కరించనున్నారు. ముగింపురోజు నాటికి పాదయాత్ర గ్రామాల సంఖ్య 2,516కి చేరనుంది. 231 మండల కేంద్రాలు, 54 మున్సిపాలిటీలు, 8 నగరాలు, మహానగరాల మీదుగా సాగిన జగన్ పాదయాత్రకు జనం అడుగడుగునా వెల్లువెత్తారు. ప్రతిపక్ష నేతను కలసి సమస్యలు చెప్పుకునేందుకు, తమ కష్టాలను తీర్చాలని విన్నవించేందుకు ప్రతిపక్ష నేతను కలిసేందుకు బారు లుతీరారు. ఫొటోలు దిగేందుకు, సెల్ఫీలు తీసుకొనేందుకు పోటీ పడ్డారు. వృద్ధులు, యువత, మహిళలు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, చిరుద్యోగులు, వివిధ సామాజికవర్గాల ప్రతినిధులు, కర్షకులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలు వైఎస్ జగన్‌ను కలిసేందుకు కదలి వచ్చారు. పాదయాత్ర గ్రామాల మీదుగా సాగిన ప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, రైతు కూలీలు పరుగెత్తుకొచ్చిన దృశ్యాలు ఈ ప్రజా సంకల్ప యాత్రలో సర్వసాధారణమయ్యా యి.



హత్యాయత్నం కలకలం.

సుధీర్ఘంగా ఒడిదుడుకులు లేకుండా సాగిన పాదయాత్ర చివ రి అంకానికి చేరుతున్న సందర్భంలో విశాఖ ఎయిర్ పోర్టులో వై.ఎస్. జగన్‌పై జరిగిన హత్యాయత్నం వైసీ పీ శ్రేణులను దిగ్ర్భాంతి కలిగించగా రాష్ట్రంలో రాజకీయ వేడిని కూడా రగల్చింది. దీంతో అధికార టిడిపి వైసిపి మధ్య తీవ్ర విమర్శ, ప్రతి విమర్శలు సాగాయి. ఇప్పుడు ఈ కేసు ఎన్ఐఏ దర్యాప్తుకు సిద్దం కావటంపైనా విమర్శలు రేగుతున్నాయి.

సరికొత్త చరిత్ర

మొత్తం 341 రోజులు 3,648 కిలోమీటర్లు ఇలా వైసీపీ అధినేత జగన్మో హన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర తెలుగు రాష్ట్రాల చరి త్రలో సరికొత్త చరిత్రను సృష్టించిందనే చెప్పాలి. పాదయాత్ర ద్వారా జగ న్ 2,516 గ్రామాల మీదుగా నడిచి 124 బహిరంగ సభలు నిర్వహించారు. ఈ పాదయాత్రలో నిర్వహించిన బహిరంగ సభ ల కు దాదాపుగా 74.40లక్షల మంది హాజరైనట్టు వైసీపీ వర్గాలు అంచనావేస్తున్నాయి. ఇది కాక చివరి రోజున భారీగా జనం వచ్చే అవకాశం ఉందని, రాష్ట్రం లోని నాలుగున్నర కోట్ల మంది జనాభాలో దాదాపుగా ఓ కోటి కి పైగా ఓటర్లను నేరుగా తమ అధినేత జగన్ కలసినట్టు అయ్యిం దని పార్టీ శ్రేణులు పేర్కొం టున్నా యి.



నేడు ముగింపు సభ

జగన్ పాదయాత్ర ముగింపు సభకు వైసీపీ శ్రేణులు భారీ ఎత్తున్న ఏర్పాట్లు పూర్తి చేశాయి. నేడు కొత్త కొజ్జీరియా గ్రామం నుంచి 9వ తేదీ ఉదయం తన పాద యాత్రను ప్రారంభించి లొద్దపుట్టి గ్రామం నుంచి . మధ్యాహ్న జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విజయసంకల్ప స్తూపం వద్దకు చేరుకుని. తన యాత్ర ముగింపు సూచకంగా ఈ స్తూపాన్ని ఆవిష్కరించి, ఆ తరువాత అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలోని ఇచ్ఛాపురం పట్టణంలోకి అడుగుపెట్టి ఆర్టీసీ పాత బస్టాండ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభకు హాజరవుతా రు. ఈ బహిరంగ సభతో జగన్ పాదయాత్ర పూర్తి అవుతుంది.

– సయ్యద్ నిసార్ అహ్మద్
సూర్య–పొలిటికల్ బ్యూరో
780 101 9343





సంక్రాంతి సమరం-తొలి ఫలితం తేలేది నేడే

కెప్టెన్స్ ఆఫ్ ది సినీ షిప్స్ బోయపాటి-క్రిష్-అనిల్ రావిపూడి-కార్తీక్ సుబ్బరాజ్‌లకు కీలక పరీక్ష, నలుగురు దర్శకులూ హ్యాట్రిక్ వీరులే కావడం గమనార్హం!





ఈ సంక్రాంతికి వస్తున్న నాలుగు సినిమాల్లో ఒక ముఖ్య సినిమా ఫలితం మరి కొన్ని గంటల్లో తేలిపోనుంది. ఇది మీరు చదువుతున్న సమయానికి ఫలితం వెల్లడైపోయి ఉండొచ్చు కూడా. సంక్రాంతి బరిలో దిగుతున్న నలుగురు దర్శకులకూ ఈ చిత్రాలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవే. గమ్యంతో దర్శకుడిగా





మారి, వేదం, కృష్ణం వందే జగద్గురుమ్, కంచె, గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రాలతో తెలుగులో, గబ్బర్ చిత్రంతో హిందీలో తనకంటూ తిరుగులేని పేరు సంపాదించుకున్న క్రిష్ రెండోసారి బాలకృష్ణతో జత కట్టి తీసిన చిత్రం ఎన్టీఆర్-కథానాయకుడు. ఈ చిత్రం కోసం కంగనా రనౌత్ మణికర్ణికను కూడా త్యాగం చేశారు క్రిష్. పైగా కథానాయకుడు ఫలితం.. మహానాయకుడుపై పడుతుంది కాబట్టి.. ఎన్టీఆర్-కథానాయకుడు చిత్రం క్రిష్ కెరీర్‌కి చాలా కీలకం.

ఇక ఆ తర్వాత చెప్పుకోవాల్సిన దర్శకుడు బోయపాటి శ్రీను. భద్ర, తులసి, సింహా చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టి.. ఎన్టీఆర్ దమ్ముతో సూపర్‌హిట్ జస్ట్ మిస్ అయిన బోయపాటి, లెజెండ్, సరైనోడు చిత్రాలతో మళ్లీ గురి చూసి కొట్టాడు. ఈ చిత్రం తర్వాత వచ్చిన జయజానకి నాయక బాగానే ఉందనే టాక్ తెచ్చుకున్నప్పటికీ.. ఆ చిత్రానికి చేసిన వ్యయం వెనక్కి రాకపోవడంతో సెకండ్ హ్యాట్రిక్ మిస్సయ్యాడు. ఇప్పుడు తాజాగా రామ్‌చరణ్ కలయికలో బోయపాటి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన వినయ విధేయ రామ చిత్రం దర్శకుడిగా ఆయనకు యాసిడ్ టెస్ట్ లాంటిదనే చెప్పాలి.

> ఇక్కడ గమనార్హమైన విషయమేమిటంటే ఈ నలుగురు దర్శకులు తొలి మూడు చిత్రాలతో హ్యాట్రిక్‌లు సాధించినవారే కావడం. మరి ఈ నలుగురు దర్శకుల్లో ఎవరెవరు విజేతలుగా నిలుస్తారో వేచి చూడాల్సిందే!!

పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్ చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన అనిల్ రావిపూడి తాజాగా వెంకీ-వరుణ్‌తేజ్‌లతో రూపొందించిన ఎఫ్-2 ఈ సంకాంతి బరిలో చివరాఖరున దిగుతోంది. ఎఫ్-2 (ఫన్ అండ్ ఫ్రస్టేషన్) అనే టైటిల్ బిసి సెంటర్స్‌కి మైనస్ అవుతుందేమోనన్న శంకతో ఇప్పుడు దీనికి సంక్రాంతి అల్లుళ్లు అనే ట్యాగ్‌లైన్ తగిలించారు. కామెడీని పండించడంలో అనిల్ రావిపూడి సిద్ధహస్తుడనే విషయం అతను తీసిన మూడు చిత్రాల్లో ఏ ఒక్కటి చూసినా తెలిసిపోతుంది. పైగా ఎఫ్-2 ట్రైలర్స్‌కు విపరీతమైన స్పందన వస్తుండడం ఈ చిత్రానికి ప్లస్ పాయింట్.

ఇక ఈ మూడు సినిమాలతోపాటు వస్తున్న మరో చిత్రం పేట. రజనీకాంత్ నటించిన సినిమా కావడం, త్రిష, సిమ్రాన్ హీరోయిన్లు కావడం ఈ చిత్రానికి ఎంతోకొంత క్రేజ్ పెంచుతున్నాయి. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన కార్తీక్ సుబ్బరాజ్ ట్రాక్ రికార్డ్ కూడా ఘనమైనదే కావడం గమనార్హం. తొలి చిత్రం పిజ్జాతో సూపర్‌హిట్ కొట్టి, జిగర్తాండా, ఇరైవి చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన కార్తీక్ సుబ్బరాజ్ మెర్క్యురి అనే సైలెంట్ చిత్రంతోనూ విమర్శకుల ప్రశంసలు దండిగా పొందాడు. పైగా అతను స్వతహా రజనీ అభిమాని కావడంతో ఈ చిత్రంపై మరిన్ని అంచనాలు పెంచాయి. ఇక్కడ గమనార్హమైన విషయమేమిటంటే ఈ నలుగురు దర్శకులు తొలి మూడు చిత్రాలతో హ్యాట్రిక్‌లు సాధించినవారే కావడం. మరి ఈ నలుగురు దర్శకుల్లో ఎవరెవరు విజేతలుగా నిలుస్తారో వేచి చూడాల్సిందే!!

పర్‌ఫెక్ట్ పొంగల్ పిక్చర్



విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్స్‌గా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ట్యాగ్ లైన్. అనిల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ రామానాయుడులో ట్రైలర్‌ను విడుదల చేశారు.

వెంకటేష్ మాట్లాడుతూ.. ముందుగా అనీల్‌కి థాంక్స్. ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్ తర్వాత ఫుల్‌ప్లెడ్జ్ కామెడీ మూవీ చేయలేదు. వరుణ్ చక్కగా చేశాడు. తమన్నా, మెహరీన్ సహా అందరితో నటించడం హ్యాపీగా ఉంది. క్యారెక్టర్స్ అన్నీ చక్కగా డిజైన్ చేశారు. తప్పకుండా సినిమాను ఎంజాయ్ చేస్తారు. సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఫన్ మూవీ.. అన్నారు.

వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. డిఫరెంట్ జోనర్‌లో సినిమాలు చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో కామెడీ సినిమాలు కూడా చేయాలనుకున్నాను. నా కెరీర్‌లో ఎంత కామెడీ చేయాలనుకున్నానో దాన్ని అంతా అనిల్ ఒక సినిమాలో చేయించేశాడు. నిర్మాతలు, అనీల్ సహ అందరికీ థాంక్స్. వెంకీగారు కామెడీ అంటే ఇరగదీస్తారు. ఆయనతో చేయడమంటే కాస్త టెన్షన్ పడ్డాను. అయితే ఆయన కంఫర్ట్ ఇచ్చి సినిమాను చేయించారు. ఆయనతో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను.. అన్నారు.

అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో ఇది నా మూడో సినిమా. దిల్‌రాజు, లక్ష్మణ్, శిరీష్‌తో మంచి అనుబంధం ఉంది. మా కాంబినేషన్‌లో ఇది హ్యాట్రిక్ హిట్ కావాలని.. వారితో అనుబంధం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాకు నాలుగు పిల్లర్స్.. వెంకటేష్‌గారు తమన్నా, వరుణ్, మెహరీన్ ఈ నలుగురు మధ్య ఉండే ఫన్, ఫ్రస్టేషన్‌ను సినిమాలో ఎంజాయ్ చేస్తారు.. అన్నారు.

దిల్‌రాజు మాట్లాడుతూ.. రాజా దిగ్రేట్ తర్వాత ఏ సినిమా చేద్దామని అనుకున్నప్పుడు అనీల్ ఈ ఐడియా చెప్పాడు. అనీల్‌తో ఇది మూడో సినిమా. కానీ మూడు సినిమాల ప్రయాణంలో ఎక్కడా చిన్న క్లాష్ రాలేదు. వెంకటేష్‌గారు, వరుణ్, తమన్నా, మెహరీన్ సహా ప్రతి ఒక క్యారెక్టర్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ పండుతుంది. సంక్రాంతికి ఎఫ్ 2 అందరికీ ఫన్ ఇస్తూ సక్సెస్ అవుతుందనే నమ్మకంతో ఉంది.. అన్నారు!!

తమిళ హుషారు

2018లో అనూహ్య విజయం సాధించిన చిత్రంగా నిలిచి, 2019లోనూ జోరు కొనసాగిస్తున్న హుషారు చిత్రం తమిళంలో రీమేక్ కానుంది. ఈ తరహా చిత్రాలకు తమిళంలో మరింత ఆదరణ ఉంటుందనే ఉద్దేశ్యంతో ఫ్యాన్సీ రేట్ చెల్లించి హుషారు చిత్రం తమిళ రీమేక్ రైట్స్ ఓ ప్రముఖ తమిళ నిర్మాత సొంతం చేసుకోవడం విశేషం. కాగా మిగిలిన భాషల్లోనూ ఈ చిత్రాన్ని రీమేక్ చేసేందుకు ఆయా భాషలకు చెందిన నిర్మాతలు తెలుగు నిర్మాతతో సంప్రదింపులు జరుపుతుండడం విశేషం!!

వలచితి.. తలచితి



ఎస్.ఎల్.ఎం ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం నిన్ను తలచి. అనిల్ తోట దర్శకత్వంలో నేదురుమల్లి అజిత్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో వంశీ, స్టెఫీ పటెల్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ లాబ్‌లో ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు.

నిర్మాత అజిత్ మాట్లాడుతూ... కొత్త బ్యానర్‌తో పాటు కొత్త హీరో హీరోయిన్లతో కలిసి చేస్తున్న సినిమా. ఈ సినిమాతో అందరికి మంచి పేరు రావాలని కోరుకుంటున్నా అన్నారు.

దర్శకుడు అనిల్ మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి సినిమా చేసాం. ఈ సినిమాకు అవకాశం కల్పించిన నిర్మాతలకు కృతజ్ఞతలు. అలాగే ఈ చిత్రం బాగా వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఫిబ్రవరిలో సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం.. అన్నారు!!

హింసాత్మకం కాదు పూర్తి వినోదాత్మకం



రామ్‌చరణ్

ధృవ, రంగస్థలం వంటి బ్యాక్ టు బ్యాక్ హిట్స్‌తో దూసుకుపోతున్న మెగా పవర్ స్టార్ రాంచరణ్ లేటెస్ట్ సెన్సేషన్ వినయ విధేయ రామ. మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో శ్రీమతి డి. పార్వతి సమర్పణలో డి.వి.వి.ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై అగ్ర నిర్మాత దానయ్య డి.వి.వి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ కథానాయిక. దేవిశ్రీ ప్రసాద్ బాణీలు అందించారు. సంక్రాంతి కానుకగా జనవరి 11న ప్రపంచ వ్యాప్తంగా వినయ విధేయ రామ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా రాంచరణ్ మీడియా వారితో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

క్రెడిట్ గోస్ టు బోయపాటి

ప్రతి ఇంట్లో ఇలాంటి వాడు ఒకడు ఉండాలి అనుకునే పాత్ర నాది. రాముడు టైప్లో వినయంగా వుంటూ అవసరమైతే విధ్వంసం కూడా సృష్టించే టైప్‌లో ఈ పాత్ర ఉంటుంది. ఒక నటుడుగా ఒక దానికే పరిమితం కాకూండా అన్ని జోనర్లలో సినిమా చేయాలనేదే నా ఉద్దేశం. 1980లో నాన్న కూడా అన్ని జోనర్లలో సినిమాలు చేశారు. జోనర్ కంటే కూడా ఒక సెన్సిబుల్ సినిమా చేయాలనుకున్నాను. అందుకే ఈ సినిమాను అంగీకరించాను. నాకు ఇంకా సమయం ఉంటే బాగుండేది అనిపించింది. రంగస్థలం షూటింగ్ అయిపోయాక 25వ రోజుల గ్యాప్‌లో ఈ చిత్ర షూటింగ్‌ను మొదలు పెట్టాం. బోయపాటికి వున్న కమిట్మెంట్స్ అలాగే నా కమిట్మెంట్స్ వల్ల సినిమా షూటింగ్‌ను తొందరగా మొదలు పెట్టాం. అయితే డైరెక్టర్‌కు ఉన్న క్లారిటీ వల్ల నాకు ఈ పాత్ర చేయడం పెద్ద కష్టమేమి అనిపించలేదు.

క్లీన్ యు సర్టిఫికెట్

నలుగురు అన్నదమ్ముల కథ 'వినయ విధేయ రామ'. వారి కుటుంబంలోని ఎమోషన్స్ ఎలా ఉంటాయో బోయపాటి తెరపై చూపించారు. కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది. మీరు అనుకున్నంత రక్తపాతం ఇందులో ఉండదు. ట్రైలర్ చూస్తే అలా అనిపిస్తుంది అంతే. సెన్సార్ వాళ్లు ఒక్క కట్ కూడా లేకుండా యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. బయటి వారు ఈ చిత్రాన్ని 'గ్యాంగ్ లీడర్'తో పోల్చడంలో అర్థం లేదు. నాకు 'గ్యాంగ్ లీడర్' అంటే ఇష్టం. అలాంటి కథలో చేయాలి అనుకున్నా. కానీ ఆ కథ వేరు, ఈ కథ వేరు.

నాలుగేళ్ల క్రితమే నేరేట్ చేశారు

వినయ విధేయ రామ' టైటిల్ సాఫ్ట్‌గా ఉంది. టైటిల్ చెప్పినప్పుడు దీని కన్నా మాస్ టైటిల్ నేను అడగలేదు. బోయపాటి సినిమాల్లో నాకు 'జయ జానకి నాయక' టైటిల్ అంటే ఇష్టం. ఇప్పుడు 'వినయ విధేయ రామ' టైటిల్ విన్న తర్వాత అదే అనుభూతి కలిగింది. ఈ కథను బోయపాటి నాలుగేళ్ల క్రితమే కథ చెప్పారు.

వేసవిలో చేయాల్సిన షూటింగ్ వింటర్‌లో

"యూరప్‌లోని అజర్‌బైజాన్‌లో విపరీతమైన చలి వాతావరణంలో షూటింగ్ చేశాం. నిజానికి ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను వేసవిలో దీన్ని తీద్దాం అనుకున్నాం. కానీ కుదరలేదు. అంత చలిలో టాటూ వేసుకోవడం, చొక్కా లేకుండా ఉండటం కష్టం అనిపించింది.

సమస్యలొచ్చిన మాట నిజం రీషూట్ అబద్ధం

సైరా' సినిమా రీ షూట్ జరుగుతోంది అన్న మాటలో నిజం లేదు. కానీ సమస్యలు వచ్చాయి. ఓ పెద్ద సినిమా చేస్తున్న సమయంలో రకరకాల ఇబ్బందులు వస్తుంటాయి. అది సాధారణం. నాన్న గారికి ఎవరూ ఇవ్వలేనంత పారితోషికం నేనిచ్చాను. కొణిదెల నిర్మాణ సంస్థను నాన్న గారి కోసమే స్థాపించా. ఆయనతో ఎక్కువ సినిమాలు తీయాలనే స్వార్థంతో దీన్ని పెట్టా. నా సినిమాల్ని బయట సంస్థతో కలిసి తీస్తాను. చాలా మంచి నిర్మాతలు ఉన్నారు.

పక్కా స్వార్థంతో కానుకలిచ్చాను

"సైరా' షూట్ విదేశాల్లో జరుగుతున్నప్పుడు యూనిట్ సభ్యులకు బహుమతులు ఇచ్చాను. జార్జియాలో షూట్ కోసం చాలా రోజులపాటు యూనిట్ సభ్యులు ఇళ్లకు దూరంగా గడిపారు. అప్పుడు ఎవరైనా సరే ఒంటరిగా ఫీల్ అవుతారు.. అందుకే బాగా పనిచేయాలని, నా స్వార్థం కోసం బహుమతులు ఇచ్చాను.

దర్శకనిర్మాతలకు నేను చెప్పేది అదే

"రికార్డుల గురించి నేను పట్టించుకోవడం లేదు. 'రంగస్థలం' సమయంలో 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాలు విడుదలయ్యాయి. మూడు సినిమాలు బాగా ఆడాయి. సినిమాలను కొన్న వారికి బాగా లాభాలు వచ్చాయి. అంతకన్నా ఏం కావాలి. అందుకే పోస్టర్లపై అంకెలు వేయొద్దని దర్శక, నిర్మాతలకు చెబుతున్నా. దీని వల్ల మా హీరోల మధ్య కూడా మంచి వాతావరణం ఏర్పడుతుంది కదా.


వాళ్లిద్దరూ నాకు మంచి స్నేహితులు

"ఆర్.ఆర్.ఆర్'కు సంబంధించి ఒక్క షెడ్యూల్ పూర్తయింది. రెండో షెడ్యూల్ పండుగ తర్వాత జరుగుతుంది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడు. ఆయనతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. మహేష్ కూడా నాకు బెస్ట్ ఫ్రెండ్. నేను అందరితోనూ స్నేహంగా ఉంటాను. ఇప్పుడంటే సోషల్‌మీడియా ఉంది కాబట్టి అంతా బయటికి తెలుస్తోంది.

ఆర్.ఆర్.ఆర్ కోసం ఆసక్తిగా

రాజమౌళి మళ్లీ డి గ్లామరైజ్డ్ పాత్రను సృష్టించారు. ఈ పాత్ర ప్రేక్షకులకు చాలా బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురుచుస్తున్నాను. ఈ సంవత్సరం మొత్తం ఈ సినీమాకే కేటాయించాను!!

ఒక చెంప తనయ-మరో చెంప భార్య



తను నటిస్తూ నిర్మించిన జీరో షారుక్ ఖాన్‌కి ఆశించిన ఫలితం ఇచ్చి ఉండకపోవచ్చు. ఈమధ్య కాలంలో షారుక్ కెరీర్ మరీ అంత గొప్పగా ఉండి ఉండకపోవచ్చు. కానీ, జయాపజయాలకు అతీతంగా అతన్ని అభిమానించేవారు కోట్లలో ఉన్నారు. వారిలో ముందు వరుసలో నిలిచేది భార్యాపిల్లలు. ఇటీవల జరిగిన ఓ ఫ్యామిలీ ఫంక్షన్‌లో షారుక్ భార్య గౌరీఖాన్, కుమార్తె సుహానాఖాన్.. ఇద్దరూ రెండు చెంపలకు ముద్దులిచ్చి.. తమ ప్రేమను చాటుకున్నారు. సుహానా అతి త్వరలోనే హీరోయిన్‌గా అరంగేట్రం ఇవ్వనుంది. ప్రస్తుతం ఆమె యాక్టింగ్‌లో ట్రయినింగ్ తీసుకుంటోంది!!





అమ్మవారి గుడిలో ఆహారంతోపాటు మద్యం పంపిణీ

లక్నో: సామాజిక సమ్మేళనం పేరుతో దేవాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆహారంతోపాటు మద్యం బాటిళ్లు పంపిణీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తరప్రదేశ్ లోని హర్దోయ్‌లోని శ్రావణదేవి ఆలయంలో చోటు చేసుకున్న ఈ ఘటనతో స్థానిక బీజేపీ పెద్దలు ఇరుకున పడ్డారు. వివరాల్లోకి వెళితే... బీజేపీ ఎమ్మెల్యే నితిన్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఆలయంలో పాసి సమ్మేళన్ జరిగింది. ఆయన ఇటీవలే సమాజ్‌వాదీ పార్టీని వీడి కమలనాథుల పంచన చేరారు. పార్టీ మారిన సందర్భంగా తన అభిమానులు, అనుచరులు, పార్టీ నేతలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ ప్యాకెట్లు తెరిస్తే అందులో ఆహారంతోపాటు మద్యం బాటిళ్లు కూడా ఉండడంతో కొందరు షాకయ్యారు. ముఖ్యంగా పిల్లలకు పంచిపెట్టిన ప్యాకెట్ల లోనూ ఇవి దర్శనమివ్వడంతో విమర్శలు వెల్లువెత్తాయి. పైగా గ్రామంలోని తమ వర్గం వారికి ఈ ప్యాకెట్లను తప్పక పంపిణీ చేయాలని నితిన్ చెబుతున్నట్లున్న వీడియో ఒకటి బయటపడడం మరింత వివాదానికి కారణమైంది. ఈ ఘటనపై స్థానిక ఎంపీ అన్షుల్ వర్మ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు గతంలో బీజేపీ నాయకులు పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసేవారని, ఇలా మద్యం పంపిణీ చేయడం ఏమిటంటూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ రాశారు. బీజేపీపై దుష్ప్రచారం జరగాలన్న ఉద్దేశంతోనే నితిన్ తండ్రి నరేష్ అగర్వాల్ ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికైనా నితిన్‌ను పార్టీలో చేర్చుకోవడంపై పార్టీ నాయకులు మరోసారి ఆలోచించాలని కోరారు. అయితే నితిన్ తండ్రి నరేష్ అగర్వాల్‌ను దోషిని చేయడం ద్వారా బీజేపీ ఈ వివాదం నుంచి బయటపడాలని చూస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇంత జరిగినా, ఈ ఘటనపై నితిన్‌గాని, ఆయన తండ్రి నరేష్‌గాని నోరు మెదపక పోవడం గమనార్హం.



లోక్ సభలో అగ్రవర్ణాల రిజర్వేషన్ బిల్లు

10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు నిర్ణయం

- లాభపడనున్న అగ్రవర్ణాల పేదలు
- 124వ రాజ్యాంగ సవరణ చేపట్టే అవకాశం
- ఈడబ్ల్యూఎస్‌లకు రిజర్వేషన్లపై నిరసనకారుల వ్యతిరేకత
- భారతీయులందరికీ ఆర్థిక న్యాయం : అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: దేశంలోని అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును కేంద్ర కేబినెట్ నిన్న ఆమోదించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బిల్లును కేంద్ర మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ లోక్ సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం సభలో అధికార విపక్షాల మధ్య వాడీవేడిగా చర్చలు జరిగాయి. ఈ బిల్లు చట్టంగా మారాలంటే 124వ రాజ్యాంగ సవరణ చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం ఉభయ సభలు ఈ బిల్లును మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదించాల్సి ఉంటుంది. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చట్టం కింద విద్య, ఉద్యోగాల్లో ఓసీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ఈ కోటా వల్ల బ్రాహ్మణులు, రాజ్‌పుత్ లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్‌లు, వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ వంటి సామాజిక వర్గాలకు లబ్ధి చేకూరనుంది.

ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కలిపి ఉన్న 49.5% రిజర్వేషన్లకు ఇది అదనం. అంటే ఈ బిల్లు చట్టంగా మారితే మొత్తం రిజర్వేషన్లు 59.5 శాతానికి చేరుకుంటాయి. ఆర్థికంగా వెనుకబడ్డ అగ్ర వర్ణాలకు (ఈడబ్ల్యూఎస్) కూడా పది శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై దళిత సామాజిక వర్గాల నుంచి వ్యతిరేకతలు వస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన మేధావులు, నిరసనకారులు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమే అవుతుందని విమర్శిస్తు న్నారు. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లను కులాల ప్రాతిపదికన ఇవ్వాలి. ఆర్థిక స్తోమత ప్రాతిపదికన కాదు. పేదరికాన్ని నిర్మూలించేందుకు రిజర్వేషన్లు వాడేందుకు వీలు లేదు. ప్రభుత్వ నిర్ణయం.. అసహ్యకరమైంది. అంతే కాక ఇది ఒక రాజకీయ ఎత్తుగడ. అని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ సీనియర్ ఆచార్యుడు వివేక్ కు మార్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడ్డ అగ్ర కులాల వారికి రిజర్వేషన్ల నిర్ణయాన్ని జాతీయ దళిత సంస్థ సమ్మేళనం ఛైర్మన్ అశోక్ భర్తీ ఖండించారు. ప్రభుత్వంలో ఏ స్థాయి లోనూ అగ్ర కులాల వారిని చిన్న చూపు చూడట్లేదు. జనాభాలో ఎక్కువగా ఉన్న వర్గం వారికి రిజర్వేషన్లు కల్పిం చడం.. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేదు. తాజా ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగాన్ని స్పష్టంగా ధిక్కరించడమే అవుతుంది. అంతే కాకుండా ఈ చర్య అగ్ర కులాల వారిని బుజ్జగించడం లాంటిది. అని ఆయన అన్నారు. అగ్ర కులా ల్లో పేదవారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సోమ వారం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజిక న్యాయా న్ని నీరుగార్చడమేనని గుజరాత్‌కు చెందిన దళిత హక్కుల నిరసనకారిణి మంజులా ప్రదీప్ అభిప్రాయపడ్డారు. దీని ఫలితంగా నిమ్నవర్గాల నుంచి ప్రభుత్వం మరింత ఆగ్ర హం చవిచూడాల్సి వస్తుందని అన్నారు. ముస్లిం, క్రైస్తవ మతాల్లో కొన్ని వర్గాల వారు తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని చాలా కాలం నుంచి కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం అగ్ర వర్ణాలవారినే మెప్పించే ప్రయత్నం చేస్తోంది. అందుకే ఈ నిర్ణయం ప్రకటించింది అని నేషనల్ దళిత్ మూవ్‌మెంట్ ఫర్ జస్టిస్ కార్యదర్శి రమేశ్ నాథన్ అన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి భాజపా కొన్ని అంశాల్లో దళితుల ఆగ్రహాన్ని ఎదుర్కొన్న విషయం తెలిసిందే. 2016లో రోహిత్ వేముల ఆత్మహత్య, గుజరాత్‌లోని ఊనాలో దళిత యువకులను కొరడాలతో కొట్టిన ఘటన, గతేడాది జరిగిన భీమా కొరేగావ్ ఘటన.. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం వ్యవహారంలో తొలుత ప్రభుత్వం వ్యవహరించిన తీరు వంటి పరిణామాలపై దళితులు భాజపాకు వ్యతిరేకంగా మారిన సంగతి తెలిసిందే. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం వల్ల భారతీయులందరికీ ఆర్థిక న్యాయం అందుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. ఇప్పటి వరకు రిజర్వేషన్లు లేని వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. చాలా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో అన్‌రిజర్వుడ్ కేటగిరీలవారికి రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానాలు చేశాయన్నారు. సమాజంలో పేదలకు ప్రయోజనాలు కల్పిస్తూ ఉంటే వామపక్షాలు వ్యతిరేకిం చడం ఇదే మొదటిసారి అని వ్యాఖ్యానించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికి విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని జైట్లీ సమర్థించారు. దీనివల్ల భారతీయులందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రస్తుతం ఉన్న కోటాను ఏ విధంగానూ కదిలించబోమని స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికి విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర మంత్రివర్గం సోమ వారం ఆమోదించింది. అగ్ర వర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ల బిల్లుపై లోక్‌సభలో వాడీ వేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బిల్లు ద్వారా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకే మా ఈ ప్రయత్నం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని పైకి తీసుకురావాలన్నదే ఈ బిల్లు ఉద్దేశం. ఈ బిల్లుకు రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ అన్న అంశాన్ని 15వ అధికరణ క్లాజ్(5) సవరణ సమయంలోనే చేర్చారు. అదే ప్రకారం ఇప్పుడు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లను కల్పించాలని ప్రయత్నిస్తున్నాం. పీవీ హయాంలో ప్రత్యేక చట్టం ఏమీ చేయలేదు.. అందుకే కోర్టు కొట్టివేసింది. చాలా మంది రిజర్వేషన్లు 50శాతం దాటితే కోర్టు కొట్టివేస్తుందని అంటున్నారు.

ఆ ఆందోళన నిజమే అయితే ఇప్పటివరకు రిజర్వేషన్లకు ఆర్టికల్ 15, 16 కల్పించిన వెసులుబాటులే మూలం. ఆర్టికల్ 16(4)లో కులాల ఆధారంగా రిజర్వేషన్ల ప్రస్తావన ఉంది అని జైట్లీ వెల్లడించారు.

'పరీక్షా పే చర్చా'తో మళ్లీ విద్యార్థుల ముందుకు మోదీ



న్యూఢిల్లీ: పరీక్షల సీజన్ వస్తోందంటో విద్యార్థుల్లో టెన్షన్ సహజం. ఆ టెన్షన్ తగ్గించి వారిని పరీక్షలకు సిద్ధం చేసేందుకు మోడీ దాదావు ఏడాది తర్వాత రెండోసారి 'పరీక్షా పే చర్చా' పేరుతో స్కూలు విద్యార్థులకు దిశానిర్దేశం చేయబోతున్నారు. ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 11 గంటలకు స్కూలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో చర్చా కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారు. తల్కతోరా స్టేడియంలో జరిగే ఈ చర్చా కార్యక్రమంలో పిల్లలతో ముఖాముఖీ మాట్లాడటంతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా వేలాది మంది పిల్లలతో సంభాషిస్తారు. పరీక్షలు, జీవితం, ఇంకా ఎన్నో విషయాలపై చర్చ జరుగుతుందని కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ఓ ట్వీట్‌లో తెలియజేశారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఇదే వేదిక నుంచి 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారాలక్షలాది మంది విద్యార్థులతో పరీక్షలకు సంబంధించిన అంశాలపై మోడీ చర్చించారు. 'ప్రధానితో మాట్లాడుతున్నాననే విషయం మీరు మరచిపోండి. ఒక మిత్రుడిగా భావించి నాతో మాట్లాడండి. మీ అనుమానాలను నాతో పంచుకోండి. ఇది నాకు పరీక్షలాంటిది. మీరంతా ఎగ్జామినర్లు. మీరు నాకెన్ని మార్కులు ఇస్తారో చూద్దాం' అంటూ విద్యార్థుల్లో మోడీ ఉత్సాహాన్ని నింపారు. కాగా, ఈసారి సైతం ఇదే తరహా చర్చా కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటున్నందున దీన్ని వీక్షించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్ని పాఠశాలకు ఆదేశాలివ్వాలని సీబీఎస్‌ఈని ప్రభుత్వం కోరింది.

కాంగ్రెస్, ఆప్‌కు చెరో 3, యశ్వంత్ సిన్హాకు ఒకటి...



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ దాదావు అవగాహనకు వచ్చినట్టు తెలుస్తోంది. ఢిల్లీలోని మొత్తం 7 లోక్‌సభ స్థానాలకు గాను తలో మూడు స్థానాల్లో కాంగ్రెస్, ఆప్ పోటీ చేస్తాయి. మిగిలిన ఒక్క స్థానాన్ని బీజేపీ మాజీ నేత యశ్వంత్ సిన్హాకు వదిలిపెట్టనున్నారు. సిన్హా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు విషయమై కాంగ్రెస్, ఆప్ మూడు నెలలుగా చర్చలు సాగిస్తున్నాయని, అయితే కాంగ్రెస్ కేవలం 3 సీట్లలో పోటీకే పరిమితం కావడం అజయ్ మాకెన్కు నచ్చకపోవడం వల్లే ఆయన రాజీనామా చేశారని ఆ వర్గాలు తెలిపాయి. కాగా, తాజాగా రెండు పార్టీల మధ్య కుదిరనట్టు చెబుతున్న అవగాహన ప్రకారం, దక్షిణ, తూర్పు, ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గాల్లో ఆప్ పోటీ చేస్తుంది. దిలీప్ పాండే, అతిషి మార్లెన, రాఘవ్ ఛదా ఇక్కడ అభ్యర్థులుగా పోటీ చేస్తారు. పశ్చిమ, వాయవ్య ఢిల్లీ, ఛాందినీ చౌక్‌లలో కాంగ్రెస్ తమ అభ్యర్థులను నిలబెడుతుంది. మరోవైపు, కాంగ్రెస్, ఆప్ పొత్తుపై వ్యాఖ్యానించేందుకు కాంగ్రెస్ నేతలు నిరాకరిస్తున్నారు. అయితే ఏ పార్టీతోనూ పొత్తుకు క్షేత్రస్థాయి కార్యకర్తలు సుముఖంగా లేరని పేరు వెల్లడించడానికి ఇష్టపడని కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. ఆప్ సైతం పొత్తుల వ్యవహారంపై ఇంకా పెదవి విప్పడం లేదు.

రాఫెల్ స్కాం నుంచి మోడీని ఎవరూ కాపాడలేరు : రాహుల్



న్యూఢిల్లీ: రాఫెల్ స్కాంపై తనతో చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సిద్ధంగా లేరని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాఫెల్ స్కాం నుంచి మోడీని ఎవరూ కాపాడలేరని అన్నారు. రాఫెల్‌పై దర్యాప్తు చేస్తున్నందుకే సీబీఐ చీఫ్‌ని తొలగించారని ఆయన ఆరోపించారు. మోడీ డబ్బులు తీసుకుని స్నేహితులకు పంచిపెట్టారని, రూ. 30 వేల కోట్లను మోడీ స్నేహితులకు ఇచ్చారన్నారు. రాఫెల్ స్కాంపై సీబీఐ దర్యాప్తు చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

సుప్రీం తీర్పుపై జైట్లీ స్పందన



న్యూఢిల్లీ : కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) సూచన మేరకే సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను సెలవుపై పంపాలనే నిర్ణయం తీసుకున్నామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. అత్యున్నత దర్యాప్తు సంస్థను పరిరక్షించడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. సీబీఐ ఉన్నతాధికారులు అలోక్ వర్మ, రాకేష్ ఆస్థానాల పరస్పర ఆరోపణల నేపథ్యంలో సీవీసీ సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని జైట్లీ చెప్పుకొచ్చారు. సీబీఐ విశ్వసనీయత, నిష్పాక్షిక విచారణను కొనసాగించే క్రమంలో దర్యాప్తు సంస్థ విస్తృత ప్రయోజనాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని వ్యవహరించిందన్నారు. సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి అలోక్ వర్మను నియమించాలని సుప్రీం కోర్టు మంగళవారం స్పష్టం చేసిన క్రమంలో జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు.

సీబీఐ తాత్కాలిక చీఫ్‌గా ఎం నాగేశ్వరరావును నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు తోసివుచ్చింది. కాగా అలోక్ వర్మ, రాకేష్ ఆస్థానాల మధ్య విభేదాల నేపథ్యంలో గత ఏడాది అక్టోబర్‌లో ప్రభుత్వం వీరిని సెలవుపై పంపిన సంగతి తెలిసిందే. తనను అకారణంగా సెలవుపై పంపడాన్ని సవాల్ చేస్తూ వర్మ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

ఇండో పాక్ యుద్ధంపై ఇమ్రాన్ వ్యాఖ్యలు



ఇస్లామాబాద్ : శాంతి ప్రక్రియ కోసం తాను చేసిన ప్రతిపాదనలపై భారత్ స్పందించడం లేదని పాకిస్తాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం అనివార్యమైతే అది ఆత్మహత్యా సదృశ్యమేనని హెచ్చరించారు. భారత్ చర్చలకు పాక్ సంసిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. ఇరు దేశాల ప్రయో జనాలకు కోల్డ్ వార్ సైతం వాంఛనీయం కాదని టర్కీ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ద్వైపాక్షిక చర్చల ద్వారా ఇరు దేశాలు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. చర్చల ప్రతిపాదనను భారత్ పలుమార్లు తోసివుచ్చిందన్నారు. కశ్మీరీ ప్రజల హక్కులను భారత్ ఎన్నడూ అణిచివేయలేదన్నారు. కాగా 2016లో భారత్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రదాడులు జరిగిన దరిమిలా పాక్ భూభాగంలో భారత్ మెరుపు దాడులు చేపట్టిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి.

రిజర్వేషన్లపై ఎవరేమన్నారంటే...

న్యూఢిల్లీ : ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును కేంద్ర మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ కే వీ థామస్ మాట్లాడుతూ ఈ కోటా బిల్లుకు తాము మద్దతిస్తు న్నామన్నారు. దీనికి తాము వ్యతిరేకం కాదన్నారు. దీనిని తీసుకొచ్చిన తీరు మాత్రం ప్రభుత్వ నిజాయితీపై ప్రశ్నలు లేవనెత్తుతోందని చెప్పారు. దీనిని పరిశీ లించేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు కేంద్ర మంత్రివర్గం సోమవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితరులకు కల్పిస్తున్న రిజర్వేషన్లకు ఎటువంటి ఢోకా లేకుండా ఈ పది శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

బీజేపీది రాజకీయ ఎత్తుగడ : మాయావతి



అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్లను కేటాయించే బిల్లును తీసుకు రావడానికి సిద్ధమైన కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి, బీఎస్పీ అధినేత్రి మాయావతి మద్దతు ప్రకటించారు. రిజర్వేషన్ల నిర్ణయాన్ని ఆమె సమర్థి స్తూనే ఎన్నికల వేళ దీనిని బీజేపీ రాజకీయ ఎత్తుగడగా విమర్శించారు. నిజంగా అగ్రవర్ణాల పై అభిమానం ఉండి ఉంటే ఇంతకు ముందే ఈ ప్రతిపాదన చేయాల్సి ఉండేదని చెప్పారు. ఎన్నికల ముందు దీన్ని గిమ్మిక్కుగా తీసేయకుండా అమల్లోకి తెస్తే తాము మద్దతు ఇస్తామని ప్రకటించారు. మోదీ ప్రయోగించిన రిజర్వేషన్ల బ్రహ్మాస్త్రం ప్రస్తుతం రాజకీయ ప్రకంపనలు సృష్టి స్తోంది. ఈ నేపథ్యంలో మాయావతి స్పందిస్తూ అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇస్తూ నే, ఇప్పటికే రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రయోజనాలకు పెద్దపీట వేయాలని సూచించారు.

రిజర్వేషన్లు కేవలం విద్య, ఉద్యోగాల్లోనే కాకుండా అన్ని రంగాల్లోనూ అమలు చేయాలని కోరారు. జనాభా ప్రాతిపదికన దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తే మంచిదన్నారు.

సామాజిక సమానత్వం కోసం ఈ చారిత్రక నిర్ణయం: థావర్ చంద్ గెహ్లాట్



అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్ల బిల్లుపై లోక్ సభలో చర్చ కొనసాగుతోంది. ఈ సందర్భంగా బీజేపీ నేత థావర్ చంద్ గెహ్లాట్ మాట్లాడుతూ, అగ్రవర్ణ పేదలకు ఆర్థిక స్తోమత లేక రిజర్వేషన్ల పరిధిలోకి రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని సామాజిక సమానత్వం కోసం ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయడానికి చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, రిజర్వేషన్లు కాకుండా వేర్వేరు మార్గాల్లో వారికి ఊరట కలిగించే ప్రయత్నాలు జరిగాయని అన్నారు. రాజ్యాంగంలోని 15వ అధికరణకు క్లాజ్ (6) జోడించేందుకు ఈ బిల్లు తీసుకొచ్చామని, ఈ బిల్లు ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు అందుతాయని చెప్పారు.

ఈ చట్టం నిలవదు: తంబిదురై



అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్ల బిల్లుపై లోక్‌సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా అన్నా డీఎంకే సభ్యుడు తంబిదురై మాట్లాడుతూ.. ఈ దేశంలో సామాజిక న్యాయం కోసమే రిజర్వేషన్లు ఉన్నాయనని, ఈ రిజర్వేషన్ల బిల్లును ఇంత తొంద రగా తీసుకురావాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. ఇంతకాలం పేదల కోసం చేపట్టిన పథకా లు, ప్రయత్నాలు ఏమయ్యాయని నిలదీశారు. శతాబ్దాలుగా అణచివేతకు గురైన శూద్రుల కోసమే రిజర్వేషన్లు. ఎన్నో పథకాలు ప్రకటించి ప్రచారం చేసుకుంటున్నారు.. ఫలాలు ఏవీ? ఈ నేపథ్యంలో రిజర్వేషన్లకు ఆర్థిక వెసులుబాటు అనేది ప్రాతిపదిక కాబోదు. గ్రామీణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి పేరుతో అనేక పథకాలు అమలు చేస్తున్నారు. నిమ్న వర్గాల రిజర్వేషన్ల అంశాన్ని అంబేద్కర్ గుర్తించారు. ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న నినాదం తమిళనాడులో 1920 నాటి నుంచే ఉంది. అంబేద్కర్ ఎంతో చదువుకున్నా ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఇదే వ్యవహార శైలితో ముందుకెళ్తే ఈ చట్టం నిలవదు. 70 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇంకా కుల వివక్ష ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ద్రవిడ ఉద్యమాలు రిజర్వేషన్ల కోసం నినదించాయి. సామాజిక న్యాయం ముందు... ఆ తర్వాతే స్వాతంత్ర్యమని జస్టిస్ పార్టీ పోరాడింది. ఉత్తరాదిన కూడా జాట్లు, పటేళ్లు, ఇలా అనేక వర్గాలు బీసీల్లో చేర్చమని ఉద్యమాలు చేస్తున్నాయి. ఎంజీఆర్ హయాంలో తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లకు నాంది పలికారు అని వివరించారు.

ఇది రాజకీయ జిమ్మిక్కు: టీఎంసీ



రిజర్వేషన్ల బిల్లుపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడుతూ.. కేంద్రం తీరును తప్పుబట్టారు. వంద రోజుల్లో ఎన్నికలుండగా ఈ తరహా బిల్లు ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. ఇది రాజకీయ జిమ్మిక్కు అనే అనుమానం ఉంది. రైల్వేలో 85వేల ఉద్యోగాలకు 25 మిలియన్ల దరఖాస్తులు వచ్చాయి. ఇదే స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఈ ప్రభుత్వం ఎందుకు తీసుకు రావట్లేదు? ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగ కల్పనపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి. ఉపాధి కల్పనకు ఇచ్చిన హామీలపై ఏం చేయబో తున్నారో స్పష్టం చేయాలి. ఏ ఏటికాయేడే తప్పించుకుంటూపోతే నిరుద్యోగంపై ఎప్పటికీ చర్చ జరగదు. నిరుద్యోగ యువత గురించి ఈ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుందని నమ్ముతూ రిజర్వేషన్ల బిల్లుకు టీఎంసీ మద్దతిస్తోంది అని సుదీప్ బందోపాధ్యాయ ప్రకటించారు.

బిల్లును జేపీసీకి పంపాలి: కేవీ థామస్



ఈ చర్చలో కాంగ్రెస్ ఎంపీ కేవీ థామస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయానికి తాము వ్యతిరేకం కాదని, కానీ ఈ బిల్లును జేపీసీకి పంపి సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. ఏ తొంద రపాటు నిర్ణయమైనా అనేక సమస్యలకు దారితీస్తుంది. పీవీ హయాంలో మొదటిసారి ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్లు తెచ్చారు. కానీ ఆ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వం చాలా తొందరపాటుగా వ్యవహరిస్తోంది. ఆ అనుభవం దృష్ట్యా ఇందులో ఎన్నో చట్టపరమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. అసలు ఈ దేశంలో ఉద్యోగ కల్పన ఎక్కడ ఉంది? ఈ ప్రభుత్వం ఏటా 2 కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఐదేళ్లలో పదికోట్ల ఉద్యోగాలు రావాల్సిఉంది.. కానీ అలా జరగలేదు. ఈ ప్రభుత్వానికి ఇంకా 3 నెలలు మాత్రమే సమయం ఉంది. ఇంత తొందరపాటుతో తీసుకున్న నిర్ణయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అని ప్రశ్నించారు.

జమిలి ఎన్నికలకు ఈసీ సమాయత్తం?

- ఆరు లేదా ఏడు రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు
- 2019 ఎన్నికలపై దృష్టి సారించిన ఎన్నికల సంఘం
- 2014 లోక్‌సభ ఎన్నికల తరహాలో నిర్వహణకు యోచన
- ఎనిమిది నుండి పది దశల్లో 17వ లోక్‌సభ ఎన్నికలు



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆరు లేదా ఏడు రాష్ట్రాలకు నిర్వహించే ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. షెడ్యూలు ప్రకారం ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ 2019 మే, జూన్‌లలో ఎన్నికలు జరగాల్సివుంది. ఆ తరువాత జమ్ము, కశ్మీర్, మహారాష్ట్ర, హర్యానాలలో ఎన్నికలు నిర్వహించాల్సివుంది. అయితే అ అన్నిరాష్ట్రాలకు జమిలి ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం యోచిస్తున్నదని తెలుస్తోంది. ఈ రాష్ట్రాలకు నవంబరు మొదటివారంలో ఎన్నికలు నిర్వహించాలని ఈసీ భావిస్తోంది. తెలంగాణ తదితర ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ప్రక్రియ ముగియటంతో కేంద్ర ఎన్నికల సంఘం తన దృష్టిని 2019 ఏప్రిల్, మేలో జరపవలసిన లోక్‌సభ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సునీల్ అరోరా 2019 లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రాథమిక చర్చలకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసాతో ఈ అంశంపై ఇప్పటికే రెండు దఫాలుగా చర్చలు జరిపినట్లు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. 17వ లోక్‌సభ ఎన్నికలను ఏప్రిల్, మేలో ఎనిమిది నుండి పది దశల్లో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు ప్రారంభించిందని అంటున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఫిబ్రవరిలో ఓట్ ఆన్ అకౌంట్‌ను పార్లమెంటులో ప్రతిపాదించిన అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం 17వ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూలును సిద్ధం చేస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలు జనవరి 8వ తేదీతో ముగుస్తాయి. 16వ లోక్‌సభ ఆఖరు సమావేశాలు జనవరి ఆఖరు వారంలో ప్రారంభమై ఫిబ్రవరి 10 లేదా 12వ తేదీలోగా ముగుస్తాయని అంచనా వేస్తున్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ ప్రక్రియను ముగించిన తరువాత ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు విడుదల కావచ్చునని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. పదిహేడవ లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి త్వరలోనే వివిధ రాష్ట్రాల ఎన్నికల అధికారులతో ఒక విస్తృత స్థాయి సమావేశం జరువుతారని తెలిసింది. 2014లో పదహారవ లోక్‌సభ ఎన్నికలు 2014 ఏప్రిల్ 7వ తేదీ నుంచి మే 12వ తేదీ వరకు తొమ్మిది దశల్లో జరిగాయి. భద్రతా కారణాల దృష్ట్యా 17వ లోక్‌సభ ఎన్నికలు ఎనిమిది నుండి పది దశల్లో జరుగవచ్చునని అంటున్నారు. నరేంద్ర మోడీ 2014 మే పదహారో తేదీనాడు దేశ 14వ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా లోక్‌సభ మొదటి సమావేశం జూన్ 4 నుంచి 11 వరకు జరిగింది. కాగా 2019 ఫిబ్రవరి రెండో వారంలో పార్లమెంటు ఓట్ ఆన్ అకౌంట్ సమావేశాలు ముగిసిన వెంటనే ఎన్నికల రంగంలోకి దూకేందుకు జాతీయ, ప్రాంతీయ పార్టీలు సిద్ధం అవుతున్నాయి. 17వ లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, జమ్ముకాశ్మీర్ శాసనసభలకు ఎన్నికలు జరుగవలసి ఉన్నది. తెలంగాణ శాసనసభ ఎన్నికలు కూడా లోక్‌సభ ఎన్నికలతో జరుగవలసి ఉండగా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ముందస్తు ఎన్నికలకు వెళ్లి విజయం సాధించిన విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల క్రతువులో భాగంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యంత్రాంగాల సన్నద్ధత, సరంజామాపై ఈసీ పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాల్సి ఉన్నది. అందువల్ల 2019 ఫిబ్రవరి చివర్లో గానీ, మార్చి మొదటి వారంలో గానీ షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలున్నట్టు సీఈసీ అధికార వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్‌లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నూ ప్రవేశపెట్టాల్సి ఉన్నది. ఈ కారణం వల్ల ఎన్నికల షెడ్యూల్‌ను ఇంకా పూర్తిస్థాయిలో ఖరారు చేయలేదని ఈసీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆస్ట్రేలియాకు పయనమైన ఎంఎస్ ధోని

న్యూఢిల్లీ : భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని.. ఆస్ట్రేలియాకు బయల్దేరాడు. ఈ నెల 12 నుంచి ఆరంభం కానున్న వన్డే సిరీస్‌లో సభ్యుడిగా ఉన్న ధోని సోమవారం ఆస్ట్రేలియాకు పయనమయ్యాడు. ధోనితో పాటు రోహిత్ శర్మ, కేదార్ జాదవ్, ఖలీల్ అహ్మద్‌లు సైతం ఆస్ట్రేలియాకు బయల్దేరారు. ఈ క్రమంలోనే వారు విమానం ఎక్కిన తర్వాత తీసుకున్న సెల్ఫీను కేదార్ జాదవ్ సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఇక, రోహిత్ శర్మ టెస్టు జట్టులో కూడా సభ్యుడిగా ఉన్నప్పటికీ కూతురు వుట్టడంతో ఆసీస్‌తో ఆఖరిదైన నాలుగో టెస్టు ముందు భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఆసీస్‌తో జరిగిన నాలుగు టెస్టుల సిరీస్‌ను భారత్ 2–1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. అంతకముందు ఇరు జట్ల మధ్య జరిగిన టీ20 సిరీస్ సమం అయ్యింది. ఆసీస్‌తో తలపడే భారత జట్టు ఇదే : విరాట్ కోహ్లి(కెప్టెన్), రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేశ్ కార్తీక్, కేదర్ జాదవ్, ఎంఎస్ ధోని, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, బూమ్రా, మహ్మద్ షమీ, ఖలీల్ అహ్మద్.



బూమ్రా స్థానంలో సిరాజ్



న్యూఢిల్లీ : గతేడాది మార్చిలో బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో చివరిసారి కనిపించిన హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్ మళ్లీ భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆసీస్ వన్డే సిరీస్‌లో భాగంగా మహ్మద్ సిరాజ్‌ను ఉన్నపళంగా జట్టులో చేర్చుతూ భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నిర్ణయం తీసుకుంది. ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు సంబంధించి జట్టును గతంలోనే ప్రకటించినప్పటికీ, కొన్ని మార్పులు చేయాల్సి రావడంతో సిరాజ్‌ను ఎంపిక చేసింది. ఆసీస్ వన్డే సిరీస్‌తో పాటు న్యూజిలాండ్ పర్యటనకు బూమ్రాకు విశ్రాంతి ఇస్తున్నట్లు మంగళవారం బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. కెప్టెన్ కోహ్లి, కోచ్ రవిశాస్త్రిల సూచనతో బూమ్రాకు విశ్రాంతి ఇచ్చేందుకు సెలక్టర్లు అంగీకరించారు. దాంతో బూమ్రా స్థానంలో సిరాజ్‌ను జట్టులోకి తీసుకున్నట్లు తన అధికారిక ట్వీటర్ అకౌంట్‌లో స్పష్టం చేసింది. ఇప్పటివరకూ అంతర్జాతీయ టీ20లు మాత్రమే ఆడిన సిరాజ్.. ఆసీస్‌తో వన్డే ఫార్మాట్‌లో అరంగేట్రం చేయనున్నాడు. అదే సమయంలో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధార్థ్ కౌల్‌కు అవకాశం కల్పించారు సెలక్టర్లు. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్ తర్వాత విరాట్ కోహ్లి గ్యాంగ్ న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. కివీస్‌తో ఐదు వన్డేల సిరీస్‌తో పాటు మూడు టీ20 సిరీస్‌లో భారత్ పాల్గొనుంది.

ఒక బెస్ట్ బౌలర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా?: కోహ్లి



సిడ్నీ: ఇటీవల ముగిసిన టెస్టు సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేక విమర్శలు ఎదుర్కొంటున్న ఆసీస్ ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్‌కు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మద్దతుగా నిలిచాడు. ఎంతోకాలంగా ఆసీస్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న స్టార్క్... ఏదొక సిరీస్‌లో ఆకట్టుకోలేక పోతే ఆ దేశ మాజీలు ఒక్కసారిగా విమర్శలు ఎక్కుపెట్టడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నాడు. కొన్ని సందర్భాల్లో ఎవరైనా గాడి తప్పడం సహజమేనని, అటువంటి తరుణంలో వారికి మద్దతుగా ఉండాలే తప్ప ఇలా విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించాడు. ఒక బెస్ట్ బౌలర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ కోహ్లి నిలదీశాడు. చాలా ఏళ్లుగా స్టార్క్ మీ జట్టులో నంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఇప్పుడు అదే బౌలర్‌పై వరుస గా విమర్శలు చేయడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. స్టార్క్ మీ అత్యుత్తమ బౌలర్ అనుకుంటే అతనికి కొంత స్వేచ్ఛ ఇవ్వండి. మళ్లీ గాడిలో పడటానికి అతనికి మద్దతుగా నిలవండి. అంతే కానీ విమర్శలు చేస్తే అతనిపై మరింత ఒత్తిడి పెరుగుతుంది. అపార నైపుణ్యమున్న ఈ తరహా బౌలర్‌పై ఒత్తిడి పెంచి దూరం చేసుకోవద్దు. ఆస్ట్రేలియా సాధిం చిన ఎన్నో విజయాల్లో స్టార్క్ ప్రధాన పోషిస్తూ వస్తున్నాడు. అతని సేవల్ని కోల్పోవద్దు అని కోహ్లి పేర్కొన్నాడు. భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో స్టార్క్ 13 వికెట్లు తీశాడు. దాంతో ఆసీస్ దిగ్గజ ఆటగాళ్లు షేన్ వార్న్, మిచెల్ జాన్సన్‌ల నుంచి విమర్శలు ఎదుర్కొ న్నాడు స్టార్క్. కాగా, భారత్‌తో త్వరలో ఆరంభం కానున్న వన్డే సిరీస్ నుంచి స్టార్క్‌కు విశ్రాంతినిచ్చారు. యాషెస్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని స్టార్క్‌ను భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేయలేదు.

పుజారా.. అభినవ బుద్ధుడు : చీఫ్ సెలెక్టర్



ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు టెస్టుల సిరీస్‌ని భారత్ 2–1 తేడాతో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్ విజయంలో చతేశ్వర్ పుజారా కీలక పాత్ర పోషించాడు. మూడు సెంచరీలతో 521 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా పుజారాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా టీం ఇండియా చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ పుజారాను గౌతమ బుద్ధుడితో పోల్చారు. పుజారాను ఆయన అభినవ బుద్ధుడని అన్నారు. పుజారా అభినవ బుద్ధుడు. అతని ప్రదర్శన చూస్తుంటే అలానే అనిపిస్తుంది. ఒక్కసారి క్రీజ్‌లో అడుగుపెట్టగానే అని ధ్యానంలోకి వెళ్లపోతాడు. గంటల పాటు డొమెస్టిక్ క్రికెట్‌లో ఆడినందుకు ఇప్పుడు ఫలితం వచ్చింది అని ప్రసాద్ పేర్కొన్నారు.

కోహ్లి సేనది ఉత్తమ బ్యాటింగ్ కూర్పు కాదు



న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో టీమిండియా బౌలింగ్, ఫీల్డింగ్ అత్యుత్తమంగా ఉన్నాయని బ్యాటింగ్ మాత్రం ఆ స్థాయిలో లేదని ఆసీస్ మాజీ సారథి ఇయాన్ చాపెల్ అన్నాడు. కంగారూలను తమ సొంతగడ్డపై ఓడించాలన్న 71 ఏళ్ల కలను కోహ్లిసేన నెరవేర్చింది. ఆతిథ్య జట్టును 2–1 తేడాతో ఓడించింది. దీంతో కోహ్లి, కుర్రాళ్లపై ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది. కాగా ఇప్పుడు చూసిందే టీమిండియా అత్యుత్తమ బ్యాటింగా? అన్న ప్రశ్నకు ఇయాన్ చాపెల్ కాదని జవాబు ఇచ్చాడు. ప్రస్తుత భారత జట్టు బౌలింగ్, ఫీల్డింగ్ అత్యుత్తమంగా కనిపించింది. అయితే ఇది అత్యుత్తమ బ్యాటింగ్ విభాగం మాత్రం కాదు. ఇంతకన్నా మెరుగైన బ్యాటింగ్ కూర్పును చూశా అని చాపెల్ అన్నాడు. ఈ సిరీస్‌లో చెతేశ్వర్ పుజారా మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. 1200కు పైగా బంతులు ఆడిన ఈ టీమిండియా నయావాల్ 500 పైచిలుకు పరుగులు చేసి ఆసీస్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. అలసిపోయేలా చేశాడు. భారత బౌలింగ్ మాత్రం అత్యుత్తమంగా ఉంది. పేసర్లు 70 ఆస్ట్రేలియా వికెట్లకు 50 పడగొట్టారు. జస్ప్రీత్ బుమ్రా, ఇషాంత్ శర్మ, మహ్మద్ షమి త్రయం 21.62 సగటు నమోదు చేసింది. అదే ఆసీస్ బౌలర్లు పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, హేజిల్ వుడ్ మొత్తం సగటు 30కి పైగా ఉంది. ఆసీస్ పరిస్థితులను భారత బౌలర్లు అద్భుతంగా ఉపయోగించుకున్నారు. భారత బౌలర్లు నిజంగా అద్భుతంగా బంతులు వేశారు. ఆస్ట్రేలియా బౌలర్లను అధిగమించారు. కంగారూ బౌలర్లతో పోలిస్తే మరింత స్వింగ్ రాబట్టారు. వారి సీమ్ పొజిషన్ సైతం బాగుంది. వారు క్రమశిక్షణతో కట్టుదిట్టంగా సరైన ప్రాంతాల్లో బంతులు వేయడంతో మంచి స్వింగ్ రాబట్టడానికి కారణం అని చాపెల్ అభిప్రాయపడ్డాడు.

ముందుగానే ఐపీఎల్!

- తేదీలు మారినా... భారత్‌లోనే క్యాష్ రిచ్ లీగ్ 12వ సీజన్
- మార్చి 23 నుంచి ప్రారంభించే యోచనలో బీసీసీఐ



ముంబై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్ ముందుగానే ప్రారంభం కానుంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్ షెడ్యూల్‌ను బీసీసీఐ రెండు వారాల ముందుకు జరిపింది. అంతేకాకుండా 12వ సీజన్ ఐపీఎల్‌ను భారత్‌లోనే నిర్వహించనున్నట్టు స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా.. టోర్నీని యూఏఈ లేదా దక్షిణాఫ్రికాకు తరలిస్తారని జోరుగా ప్రచారం జరిగింది. కానీ భారత్‌లోనే టోర్నీ నిర్వహించాలని తాజాగా బీసీసీఐ నిర్ణయించింది. గత సీజన్‌ను ఏప్రిల్ 7 నుంచి ప్రారంభించగా.. ఈసారి అంతకు ముందే ఈ క్యాష్ రిచ్ లీగ్‌ను ఆరంభించనుంది. మార్చి 23 నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రారంభించేందుకు బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. ఐపీఎల్ వేదికల విషయమై చర్చించేందుకు సుప్రీం కోర్టు నియమిత క్రికెట్ పాలకుల కమిటీ (సీఓఏ) మంగళవారం న్యూఢిల్లీలో సమావేశం అయ్యింది. ప్రాథమికంగా చర్చించిన అనంతరం 12వ సీజన్ ఐపీఎల్‌ను స్వదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు. విస్తృతమైన చర్చల అనంతరం ఐపీఎల్ 2019 పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇంతకు ముందు 2010లో ఐపీఎల్‌ను మార్చిలో ఆరంభించారు. సాధారణంగా అయితే ఏప్రిల్‌లో మొదలై మే చివరి వారంలో ముగుస్తుంది. ఈ సారి మే 30న ఇంగ్లాండ్‌లో వన్డే ప్రపంచకప్ సైతం ఆరంభం అవుతోంది. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం రెండు టోర్నీల మధ్య ఆటగాళ్లకు కనీసం 15 రోజుల విశ్రాంతి ఇవ్వాలి. అందుకే ముందుగా ఐపీఎల్‌ను ఆరంభిస్తున్నారు. రాష్ట్ర సంఘాలు, అధికారులతో సుదీర్ఘ చర్చల తర్వాత ఐపీఎల్ 2019 షెడ్యూలు విడుదల చేస్తామని బీసీసీఐ తెలిపింది. ఎన్నికల కారణంగా 2009లో దక్షిణాఫ్రికాలో ఐపీఎల్ నిర్వహించారు. 2014లో కొన్ని మ్యాచ్‌లను దుబాయ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా విదేశాల్లోనే ఐపీఎల్ నిర్వహిస్తారని అందరూ భావించారు. కానీ బీసీసీఐ భారత్‌లోనే నిర్వహిస్తామని ప్రకటించి.. క్రికెట్ అభిమానులకు శుభావార్తను అందించింది.

ధోని వెనక్కి... పంత్ ముందుకు



దుబాయ్ : ఆసీస్‌తో జరిగిన చివరి టెస్టులో శతకం సాధించి ఆస్ట్రేలియాలో ఆ ఘనత సాధించిన తొలి టీమిండియా వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించిన రిషభ్‌పంత్... తాజాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు ర్యాంకింగ్స్‌లో సైతం అరుదైన ఘనతను అందుకున్నాడు. ఒక్కసారిగా 21 స్థానాలు ఎగబాకి 17 స్థానంలో నిలిచాడు. రిషభ్ పంత్ 673 రేటింగ్ పాయింట్లతో తన స్థానాన్ని మరింత మెరుగు పరుచుకున్నాడు. ఫలితంగా భారత్ తరవున బెస్ట్ ర్యాంక్ సాధించిన స్పెషలిస్టు వికెట్ కీపర్ల జాబితాలో ఫరూఖ్ ఇంజనీర్ సరసన నిలిచాడు. 1973, జనవరిలో ఫరూఖ్ ఇంజనీర్ 17 ర్యాంకును సాధించగా, ఇప్పుడు అతని సరసన పంత్ చేరాడు. కాగా, ఈ క్రమంలోనే ఎంఎస్ ధోని అత్యుత్తమ టెస్టు ర్యాంకును పంత్ బ్రేక్ చేశాడు. ధోనీ టెస్టు కెరీర్‌లో 19వ ర్యాంకే అత్యుత్తమ ర్యాంక్ కాగా, ధోని టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు 662గా ఉంది. ఇక టెస్టు నంబర్‌వన్ ర్యాంకింగ్‌ను విరాట్ కోహ్లి నిలబెట్టుకున్నాడు. ఆసీస్‌తో జరిగిన సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన పుజారా మూడో స్థానాన్ని ఆక్రమించాడు. మరొకవైపు రవీంద్ర జడేజా, మయాంక్ అగర్వాల్ కూడా బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. ఆరు స్థానాలు ఎగబాకిన భారత ఆల్‌రౌండర్ జడేజా 57వ స్థానంలో నిలవగా, మయాంక్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని 62వ స్థానంలో నిలిచాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పలువురు టీమిండియా బౌలర్లు తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. కుల్దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 45వ స్థానంలో నిలవగా, బుమ్రా 16, షమీ 22వ స్థానాల్లో నిలిచారు.

మీ విజయాన్ని చూసి దేశం గర్విస్తోంది!

పెల్లుబుకుతున్న ప్రశంసల జల్లు



సిడ్నీ : ఆస్ట్రేలియా గడ్డపై 2–1 తేడాతో టెస్ట్ సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించిన కోహ్లిసేనపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఆసీస్ గడ్డపై సిరీస్ గెలవాలన్న భారత్ దశాబ్దాల కల నెరవేరడంతో మాజీ క్రికెటర్లు.. సినీ తారాలు, రాజకీయ నాయకులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా భారత ఆటగాళ్లకు అభినందనలు తెలువుతున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, దేశ ప్రధాని నరేంద్ర మోదీలు కోహ్లిసేనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, టాలీవుడ్ హీరో మహేష్ బాబులు ట్విటర్ వేదికగా కోహ్లిసేనను కొనియాడారు. ఆస్ట్రేలియా తొలిసారి టెస్ట్ సిరీస్ గెలిచిన కోహ్లిసేనకు అభినందనలు. అద్భుత బ్యాటింగ్, బౌలింగ్ ప్రదర్శనతో రాణించిన ఈ ఆల్‌రౌండ్ ప్రతిభ మమ్మల్ని గర్వపడేలా చేసింది. దీన్ని ఇలానే అలవరుచుకోండి – రామ్‌నాథ్ కోవింద్.

– ఆస్ట్రేలియా గడ్డపై చరిత్ర సృష్టించిన భారత జట్టుకు అభినందనలు. అద్భుత టీమ్‌వర్క్‌తో గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌లకు ఈ సిరీస్ వేదికగా నిలిచింది. ఈ విజయ యాత్రను భవిష్యత్తులోను కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నా– నరేంద్ర మోదీ.

– ఆసీస్ గడ్డపై తొలిసారి సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించిన భారత్ జట్టుకు శుభాభినందనలు. ఈ విజయంతో మేం గర్వపడుతున్నాం – వైఎస్ జగన్.

– అద్భుత విజయం సాధించిన భారత్ జట్టుకు అభినందనలు. ఈ గెలువుతో దేశం మొత్తం గర్విస్తోంది– మహేశ్ బాబు.

– చరిత్రలో నిలిచిపోయే విజయాన్ని అందించిన భారత జట్టుకు అభినందనలు. ఈ సిరీస్ గెలువుతో భారత్‌లోని ప్రతి క్రికెట్ అభిమాని గర్వపడుతున్నాడు. టీమిండియా సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. – వీరేంద్ర సెహ్వాగ్.

– తొలిసారిగా ఆసీస్‌లో సిరీస్ గెలిచిన టీమిండియాకు అభినందనలు. మీ ప్రదర్శన ఆకట్టుకుంది –మిచెల్ జాన్సన్, ఆసీస్ మాజీ క్రికెటర్.

– ఈ చారిత్రక విజయం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసింది. –మహమ్మద్ కైఫ్, మాజీ క్రికెటర్.

– కెప్టెన్ కోహ్లికి అభినందనలు. టీమిండియా బాగా ఆడింది – అమిత్ మిశ్రా.

– ఇండియన్ క్రికెట్ టీం జిందాబాద్ – అనుపమ్ ఖేర్, బాలీవుడ్ నటుడు.

టీమిండియాకు పాకిస్థాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ అభినందనలు



న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్ట్ సిరీస్ నెగ్గిన టీమిండియాపై ప్రశంసల వర్షం కురుస్తూనే ఉంది. ఆ కోవాలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీతోపాటు పలువురు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు ఇప్పటికే టీమిండియాకు అభినందనలు తెలియజేశారు. తాజాగా ఆ జాబితాలో పాకిస్థాన్ ప్రధాన మంత్రి, ఆ దేశ మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ కూడా చేరారు. మంగళవారం నాడు ఆయన భారత జట్టుకు అభినందనలు తెలియజేస్తూ... ట్విట్ చేశారు. 'ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్ట్ సిరీస్ విజయం సాధించిన టీమిండియాకు, కెప్టెన్ విరాట్ కోహ్లికి అభినందనలు తెలియజేశారు. ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ సిరీస్ నెగ్గిన ఆసియా తొలి క్రికెట్ జట్టుకు కంగ్రాట్స్' అంటూ ఇమ్రాన్ ట్వీట్ చేశారు.

కోహ్లిసేనకు బీసీసీఐ భారీ నజరానా



ముంబయి : ఆస్ట్రేలియాలో చరిత్ర సృష్టించిన కోహ్లసేనకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి నగదు బహుమతి ఇవ్వనుంది. దాదావు 71 ఏళ్లకు టీమిండియా ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే ఓడించి 2–1 తేడాతో టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది. దిగ్గజ క్రికెటర్లకు సాధ్యం కాని లక్ష్యాన్ని సాధించింది. ఈ ఘనతకు నజరానా ఇవ్వాలని బీసీసీఐ పాలకుల కమిటీ నిర్ణయించింది. మ్యాచ్ ఫీజ్‌కు సమానంగా బోనస్ ఇవ్వనుంది. అంటే ఒక్కో మ్యాచ్‌కు ఫీజు రూ.15 లక్షల వరకు ఉంటుంది. నాలుగు మ్యాచ్‌లు ఆడిన వారికి రూ.60 లక్షల వరకు బహుమానం దక్కనుంది! రిజర్వు ఆటగాళ్లకు మ్యాచ్‌కు రూ.7.5 లక్షలు ఇస్తారు. కోచ్‌లకు తలో రూ.25 లక్షలు ఇవ్వనున్నారు. సహాయక సిబ్బందికి ప్రో రేటా వేతనం లేదా ప్రొఫెషనల్ ఫీజుకు సమానంగా బోనస్ ఇస్తారు. సుప్రీం కోర్టు నియమించిన పాలకుల కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. కంగారూలను వారి సొంతగడ్డపై ఓడించిన కోహ్లిసేనను అందరూ ప్రశంసించిన సంగతి తెలిసిందే. ఆ గడ్డపై ఇంతకు ముందెన్నడూ భారత్ టెస్టు సిరీస్ గెలవలేదు. చాలా మంది దిగ్గజాలు అక్కడ సిరీస్ గెలవాలని కలలు కన్నారు. గంగూలీ సారథ్యంలో ఒక సిరీస్ డ్రా అయింది.

ఆనందంతో నా కళ్లు చెమర్చాయి : గవాస్కర్



ముంబయి : చరిత్రాత్మక టెస్ట్ సిరీస్ చేజిక్కించుకున్న అనంతరం సోమవారం టీమిండియా సిడ్నీలో బోర్డర్–గావస్కర్ ట్రోఫీని అందుకోవడం చూసి ఆనందంతో తన కళ్లు చెమర్చాయని మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ అన్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వాహకుల తప్పిదం కారణంగా ఆయన ట్రోఫీ బహూకరణ కార్యక్రమానికి హాజరుకాలేపోయారు. ఆస్ట్రేలియాలో భారత్ 2–1 తేడాతో తొలిసారి చారిత్రక సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. చాలా గర్వంగా ఉంది. ఈ చారిత్రక సన్నివేశాన్ని చూసిన తర్వాత ఆనందంతో నా కళ్లు చెమర్చాయి. ఇదొక గొప్ప రోజు కాబట్టి నేను అక్కడ ఉండి ట్రోఫీని అందిస్తే ఇంకా అద్భుతంగా ఉండేది. వారి గెలువు, ట్రోఫీని అందుకోవడాన్ని చూడటం నిజంగా మధురానుభూతి అని గావస్కర్ మీడియాతో తన సంతోషాన్ని పంచుకున్నారు. అలెన్ బోర్డర్, సునీల్ గావస్కర్ పేర్ల మీద ఏర్పాటు చేసిన ఈ ట్రోఫీ ప్రెజెంటేషన్ కార్యక్రమానికి ప్రతిసారి గావస్కర్ హాజరవుతారు. అయితే సిడ్నీలో జరిగిన చరిత్రాత్మక ఈవెంట్‌కు మాత్రం ఆయన మిస్సయ్యారు. అక్కడికి వెళ్లలేకపోవడంపై మాజీ కెప్టెన్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

దేశవాళీ, పుజారా, మయాంక్‌పై కుంబ్లే ప్రశంసలు



ముంబయి : ఆస్ట్రేలియాలో 2–1 తేడాతో సిరీస్ గెలిచిన భారత క్రికెట్ జట్టు ఆటగాళ్లు అపూర్వ ఘనతకు అర్హులేనని మాజీ సారథి అనిల్ కుంబ్లే అన్నాడు. కోహ్లి సేనను ప్రశంసించాడు. ఇలాంటి ఘనతను ఇంతకు ముందు సాధించలేదు. 2003/04, 2007/08లో ఆస్ట్రేలియాలో సిరీస్ విజయానికి సమీపించాం. ఒకవేళ, కానీ అనే పదాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆస్ట్రేలియాను ఓడించిన ఈ జట్టు మాత్రం ఆ ఘనతకు అర్హమైందే అని కుంబ్లే అన్నాడు. మయాంక్ అగర్వాల్‌ను మెచ్చుకొని తీరాల్సిందే. ఇంతకు ముందు ఆస్ట్రేలియాలో ఆడిన అనుభవం లేకున్నా నేరుగా జట్టులోకి, క్రీజులోకి వెళ్లి తన ఉనికి చాటుకున్నాడు. తొలి రెండు టెస్టుల్లో భారత్ ఓపెనింగ్ సమస్యలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. అందుకే మెల్‌బోర్న్, సిడ్నీలో మయాంక్ చేసిన పరుగులు అమూల్యమైనవి అని కుంబ్లే పేర్కొన్నాడు. భారత దేశవాళీ క్రికెట్ వ్యవస్థను కుంబ్లే ప్రశంసించాడు. అద్భుతమైన క్రికెటర్లను అంతర్జాతీయ క్రికెట్‌కు అందించిందని పేర్కొన్నాడు. దేశవాళీ క్రికెట్ వల్లే ఎంతో మంది అంతర్జాతీయ క్రికెటర్లు వచ్చారు. ఐపీఎల్‌లో చాలా ఒత్తిడి ఉన్నప్పటికీ టెస్టులతో పోలిస్తే అది పూర్తిగా విభిన్నం. భారత్–ఏ జట్టు పర్యటనలు, రాహుల్ ద్రవిడ్‌తో ఎక్కువ కాలం గడపడం ప్రయోజనం కలిగించింది అని కుంబ్లే వెల్లడించాడు. చాలా మంది ఇప్పటికీ స్ట్రైక్‌రేట్ల గురించి మాట్లాడతారని తెలుసు. పుజారా ప్రదర్శన వారిందరి నోర్లు మూయించగలదని ఆశిస్తున్నా. ఎందుకంటే స్ట్రైక్‌రేట్ ముఖ్యం కాదు. జట్టు కోసం పరుగులు చేయడమే కీలకం. ఆస్ట్రేలియాలో పుజారా అదే చేశాడు అని కుంబ్లే ప్రశంసించాడు.

విరాట్, సచిన్ రికార్డులు బద్దలు చేసిన టేలర్



ముంబయి : న్యూజిలాండ్ ఆటగాడు రాస్ టేలర్ (137 పరుగులు) అదరగొట్టాడు. శ్రీలంకతో జరిగిన చివరి వన్డేలో అద్భుత శతకం బాదేశాడు. ఈ ఘనతతో ఒకే ఫార్మాట్‌లో 20 శతకాలు సాధించిన న్యూజిలాండ్ తొలి ఆటగాడిగా టేలర్ అవతరించాడు. కొన్నాళ్లుగా అతడు వీరోచిత ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా 50+ స్కోర్లు చేస్తున్నాడు. గత ఆరు వన్డేల్లో 181 నాటౌట్, 80, 86 నాటౌట్, 54, 90, 137 స్కోర్లు సాధించాడు. దీంతో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి రికార్డులు బద్దలయ్యా యి. గతంలో విరాట్ కోహ్లి, సచిన్ వరుసగా ఐదు వన్డేల్లో 50+ పరుగులు చేశారు. టేలర్ వరుసగా ఆరు ఇన్నింగ్సుల్లో ఈ 50+ స్కోర్లు చేసి వారి రికార్డు లను బద్దలుకొట్టాడు. అంతే కాకుండా న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్, ఆండ్రూ జోన్స్, మహ్మద్ యూసఫ్ (పాక్), గోర్డన్ గ్రీనిడ్జ్ (వెస్టిండీస్), మార్క్ వా (ఆస్ట్రేలియా) ఘనతను సమం చేశాడు. అయితే జావెద్ మియాందాద్ (పాక్) 1987లో వరుసగా 9 సార్లు 50+ స్కోర్లు చేసి అందరికన్నా ముందున్నాడు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-